# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 26 సెప్టెంబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 261 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర



2



# బై బోలే గణేశా..

## మా బొజ్జ గణపయ్య మళ్ళొచ్చే ఏడు మళ్లీ రావయ్యా



## ప్రశాంతం.. పరిపూర్ణం

- సాఫీగా జరిగిన నిమజ్జనోత్సవాలు
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4 లక్షల విగ్రహాల ఏర్పాటు
- 25,000 మంది పోలీసులతో బందోబస్తు
- రాజధానిలో మంత్రి పొన్నం ఏరియల్ సర్వే
- నవరాత్రుల సందర్భంగా 13 మంది మృతి

2



## అమ్మ ఒడి చేరిన అఖండ గణపతి

ప్రశాంతంగా ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం

2

## సంఘ్ పరివార్, గాంధీ పరివార్ మధ్య పోరాటం

- కేరళ రాజకీయ గాలి దేశాన్ని ప్రభావితం చేస్తుంది
- రాజకీయాల్లో మార్పు ఇక్కడి నుండే ప్రారంభం కావాలె
- గాంధీ పరివార్ కోసం నా ప్రాణమైనా ఇస్త
- రాహుల్ గాంధీ ప్రధాని కావాలి.. అదే నా లక్ష్యం

ఆర్యదాన్ ముహమ్మద్-2026 అవార్డు స్వీకార కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి





2

## ప్రభుత్వానికేం లాభం రాదు

యూపీఐ ఎండీఆర్ ఛార్జీల్లో సర్కారుకు ఆదాయం లేదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ఢిల్లీ, సెప్టెంబర్ 25:** యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధింపు విషయంలో విపక్షాలు చేస్తున్న విమర్శలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జవాబిచ్చారు. ప్రతిపాదిత రుసుములు రూ.2 వేల కన్నా అధికంగా ఉన్న యూపీఐ లావాదేవీలకే వర్తిస్తాయని గుర్తు చేశారు. అలాగని

...మిగతా 2లో

# దసరా లోపు నామినేటెడ్ పోస్టులు

- వరుస వాయిదాలతో కేడర్‌లో పెరుగుతున్న అసంతృప్తి
- ఈసారి భారీగా భర్తీ జరిగే అవకాశం
- 37 కార్పొరేషన్ ఛైర్మన్లలో ఐదుగురికే రెన్యువల్ ?
- 29న ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం బ్యూరో):** ఇన్నాళ్లు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ఈసారి జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల జాబితా సిద్ధమైందనీ ఏఐసీసీ ఆమోదం మాత్రమే వెలువడాల్సి ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఈనెల 29న సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ పెద్దలతో సమావేశమై సంబంధిత జాబితాకు ఆమోదముద్ర వేసే అంశంపై చర్చించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే గత కొన్నాళ్లుగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. దీంతో కేడర్‌లో తీవ్ర అసంతృప్తి పెల్లుబికుతోంది. ఈ సంగతి గమనించిన అధిష్టానం వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. అధికారంలో ఉండి కూడా పదవులు ఇవ్వకపోవడం పట్ల కేడర్ అసంతృప్తితో ఉన్న విషయాన్ని ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సందర్భంలో అధిష్టానం పెద్దలకు వివరించారనీ, దీంతో ఈమేరకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. దీంతో దసరాలోపే నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయాలన్న ఆలోచనకు ఏఐసీసీ నాయకత్వం వచ్చినట్లు ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. వివిధ

...మిగతా 2లో

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక న్యాయం

సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, (మనం బ్యూరో):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బడుగు బలహీనవర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో సామాజిక న్యాయం దిశగా పాలన

...మిగతా 2లో

## అమ్మాయికి వేధింపులు

బిహార్లో మరో ఘటన

2

## రాహుల్‌కు మతి తప్పింది

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** మోడీ- అమిత్ షాలపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఆయన అసహనానికి నిదర్శనమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వరుసగా ఎన్నికల్లో

...మిగతా 2లో

## హౌస్ హస్బెండ్‌గా ఎందుకుండకూడదు

భర్తలకు మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్న





**మదురై, సెప్టెంబర్ 25:** మహిళలు హౌస్ వైఫులుగా ఉన్నట్లు పురుషులు హౌస్ హస్బెండులుగా ఎందుకుండకూడదని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. తమ కెరీర్ కు వివాహం అడ్డంకిగా ఉందని భావించి వైవాహిక జీవితానికి దూరమయ్యే మహిళల సంఖ్య పెరుగుతోందని అభిప్రాయపడింది. ఈ పరిస్థితి మారాలంటే ఇంటి బాధ్యతలను పంచుకునేందుకు భర్త ముందుకు

...మిగతా 2లో

## ఆర్టీసీ ఎన్నికల్లో టీడబ్ల్యూయూకు కాంగ్రెస్ మద్దతు

ప్రకటించిన టీపీసీసీ చీఫ్ మహేష్



3

## 11 నుంచి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు



3

## జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు • పలుచోట్ల జల ఫిరంగుల ప్రయోగం





2

### క్రిమినల్ ప్రాసిక్యూట్ చేయాలె

సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది

ఆయన జెన్-జీ ఓటు హక్కును అడ్డుకుంటున్నరు

**ఢిల్లీ, సెప్టెంబర్ 25:** 'సర్' అంశంపై ఎన్నికల కమిషన్ లో విభేదాలు ఏర్పాడ్డాయంటూ వచ్చిన వార్తలపై రేగిన రాజకీయ దుమారం తీవ్రమవుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు విపక్షాలు సిద్ధమవుతుండగా.. ఈ వ్యవహారంపై సుప్రీంలో కేసు కూడా దాఖలైంది. జ్ఞానేశ్ కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఆయనపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోరుతూ

...మిగతా 2లో

### సీఈసీ రాజీనామాకు ఇంక మిగిలింది 24 గంటలే

ప్రతిపక్షాలు ఎన్నికల్లో పోటీ చేయొద్దు: అభిజీత్ దీప్కే

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు భావిస్తే.. ఇకపై ఎన్నికల్లో

...మిగతా 2లో

## కొసరి కొసరి వడ్డించిన ట్రంప్

జిన్‌పింగ్‌కు ప్రత్యేక డిన్నర్



**వాషింగ్టన్, సెప్టెంబర్ 25:** అమెరికా పర్యటనకు విచ్చేసిన చైనా అధినేత జిన్‌పింగ్‌కు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు అధికారిక విందు ఇచ్చారు. వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో జరిగిన ఈ విలాసవంతమైన విందులో జిన్‌పింగ్ కోసం ప్రత్యేక వంటకాలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మెనూను వైట్‌హౌస్ విడుదల చేసింది. అమెరికన్, చైనీస్ రుచుల కలయికతో చేసిన వంటకాలు అందులో ఉన్నాయి. మెయిన్ కోర్సులో నువ్వులతో చేసిన బాస్ చేప, క్రిస్పీ బాక్ చోయ్ (ఒక రకమైన చైనీస్ క్యాబేజీ), పసుపు

...మిగతా 2లో

## యుద్ధాన్ని కోరుకుంటలేం

ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్



**టెహ్రాన్, సెప్టెంబర్ 25:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది అమెరికానేనని స్పష్టం చేశారు. యుద్ధాన్ని కొనసాగించాలని తాము కోరుకోవట్లేదన్నారు. దీన్ని ఎలా ముగించాలనే విషయంలో ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేదని చెప్పారు. అయితే.. అగ్రరాజ్య ఒత్తిడికి టెహ్రాన్ ఎప్పటికీ లొంగబోదన్నారు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతి వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇరాన్‌కు గానీ.. అమెరికాకు గానీ సంఘర్షణలు

...మిగతా 2లో



# అమ్మ ఒడి చేరిన అఖండ గణపతి

## ప్రశాంతంగా ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ఖైరతాబాద్ పెద్ద గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నెంబర్ క్రేన్ వద్ద నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది 69 అడుగుల 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా గణనాథుడు దర్శనమిచ్చాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్ దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, సెక్రెటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. ఎన్టీఆర్ మార్గ్ వద్దకు చేరుకున్న అఖండ గణపతికి ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించింది. మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్ సాగర్లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తిచేశారు.

**అశేష భక్త జన సందోహం.. జయజయ ధ్వానాలు..**

ఖైరతాబాద్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు భక్తుల జయజయధ్వానాల నడుమ గణేశుడి శోభాయాత్ర కనుల పండువగా కొనసాగింది. వేలాదిమంది భక్తులు వీడ్కోలు పలుకుతుండగా గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. బడా గణేశుడి నిమజ్జనోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. శోభాయాత్ర ప్రారంభ సమయంలో దానం నాగేందర్ మహాగణపతి ముందు డ్యాన్స్ చేశారు.

# బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర ఫైనల్ పాట రూ.39 లక్షలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ గణేశుడి లడ్డూ మునుపటికన్నా ఎక్కువ.. రికార్డు ధర పలికింది. వనస్థలిపురంలోని సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి వేలంలో రూ.39లక్షలు పాడి లడ్డూను పొందారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్ రెడ్డిని లడ్డూ వరించింది. గతేడాది రూ.35 లక్షలు పలికింది. వినాయక ఉత్సవాల్లో బాలాపూర్ స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రత్యేక గుర్తింపు పొందింది. నవరాత్రులు పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కిలోల లడ్డూను పొందడం ద్వారా శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. కాబట్టి దక్కించుకునేందుకు అనేక మంది పోటీలు పడుతుంటారు. బాలాపూర్ వినాయకుడికి 45 ఏళ్ల ఘన చరిత ఉంది. లంబోదరుడిపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారిగా బాలాపూర్ ఉత్సవ సమితి 1994లో లడ్డూ వేలం నిర్వహించింది. మొదటిసారిగా లడ్డూ ప్రసాదాన్ని రూ.450కు కైవసం చేసుకున్న రైతు కొలను మోహన్‌రెడ్డి.. దాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు పంచి.. మిగతాది పొలాల్లో చల్లారు. భగవంతుడు సుఖసంతోషాలను అందించారనే నమ్మకంతో మరుసటి ఏడాదితో పాటు 1998, 2004, 2008లలోనూ ఆయన పోటీ పడి దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పాల్గొనేందుకు 15 ఏళ్ల పాటు స్థానికులకే అవకాశం కల్పించిన ఉత్సవ సమితి.. ఆ తర్వాత బయట వ్యక్తులనూ అనుమతించింది. అలా 2009లో సరిత అనే మహిళ రూ.5.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు 31 సార్లు వేలం వేయగా.. 2020లో కరోనా నేపథ్యంలో వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్కు అందజేశారు. 2024లో కొలను శంకర్‌రెడ్డి రూ.30.01లక్షలకు, గతేడాది లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

# కొసరి కొసరి వడ్డించిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

గుమ్మడితో చేసిన వెలౌట్, అడవి పుట్టగొడుగులతో చేసిన ఫికాసీ, క్రిస్పీ పాన్‌సెట్టా, రోస్టెడ్ గార్డెన్ ఎగ్‌ప్లాండ్ వంటివి ఏర్పాటు చేశారు. డెజర్ట్స్‌లో వెనీలా క్రిమెక్స్, వైట్‌హౌస్ హనీ క్రీమ్, వాల్నట్ ఫ్రాంగిపేన్, చెర్రీ కాన్ఫిట్ వంటివి అందించారు. ఇక, ఈ కార్యక్రమంలో జిన్‌పింగ్‌కు ట్రంప్ అరుదైన కానుకనిచ్చారు. అమెరికా జాతీయ బాల్ ఈగల్ విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. మూడు అడుగుల ఎత్తు ఉన్న ఈ గిఫ్ట్‌ను విందు సమయంలో అతిథుల ముందు ప్రదర్శించారు. స్వేచ్ఛ, స్ఫూర్తికి చిహ్నమైన ఈ విగ్రహం.. చైనాలో ప్రత్యేకంగా నిలుస్తుందని ట్రంప్ ఆకాంక్షించారు. విందు అనంతరం శ్వేతసౌధంలో నూతనంగా నిర్మిస్తోన్న బాల్‌రూమ్‌ను చూపించారు. 'ఈ గదిలోకి వచ్చిన మొదటి విదేశీ నేత మీరే' అంటూ ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**హాజరైన టెక్ దిగ్గజాలు..**

ఈ విందుకు అమెరికా టెక్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ మాజీ సీఈవో టిమ్ కుక్, ఎన్‌వీడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్, ఓపెన్ఏఐకు చెందిన శామ్ ఆల్ట్‌మన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యుద్ధాన్ని కోరుకుంటలేం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివరి నాటికి యుద్ధం ముగుస్తుందా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుంటే.. మరోవైపు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను ఉద్ధృతం చేస్తున్నారు. తాజాగా మరోసారి హూతీలు రియాద్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారు. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్, క్షిపణి దాడులు జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు హూతీ సైనిక ప్రతినిధి ప్రకటించారు. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. దక్షిణ తైఫ్ ప్రావిన్స్, ఎర్ర సముద్ర తీరంలోని యాన్బు ప్రాంతాల్లో హూతీలు ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ క్షిపణులను తమ బలగాలు అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. ఈ దాడుల నేపథ్యంలో పవిత్ర మక్కా నగరంతో సహా పలు ప్రాంతాలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది.

# సంఘ్ పరివార్, గాంధీ పరివార్ మధ్య పోరాటం

## ఆర్యదాన్ ముహమ్మద్-2026 అవార్డు స్వీకార కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, (మనం బ్యూరో):** ప్రస్తుతం దేశంలో సంఘ్ పరివార్, గాంధీ పరివార్ మధ్య పోరాటం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంఘ్ పరివార్‌ను ఓడించడానికి దేశమంతా గాంధీ పరివార్‌కు అండగా ఉండాలని కోరారు. శుక్రవారం కేరళం రాష్ట్రంలోని నిలంబూరులో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మక ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఏసీసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ చేతుల మీదుగా సీఎం అందుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ సంఘ్ పరివార్ దేశాన్ని మతం, భాష, సంస్కృతి, కులం ఇలా అన్ని విధాలుగా విడగొడుతోందని విమర్శించారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారనీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కేంద్ర మంత్రి, దేశ ప్రధాని, రాష్ట్రపతి వంటి పదవులను సైతం త్యాగం చేశారని పేర్కొన్నారు.

సంఘ్ పరివార్ దేశానికి, ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదకారిగా మారిందనీ, దేశాన్ని సంఘ్ పరివార్ నుంచి రక్షించడానికి గాంధీ పరివార్ కోసం నా ప్రాణం కూడా త్యాగం చేయడానికి సిద్దంగా ఉన్నానని స్పష్టం చేశారు. సంఘ్ పరివార్‌ను ఓడించి ఈ యుద్దంలో ముందున్నామని కేరళం ఇప్పటికే సంకేతాలు ఇచ్చిందని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో మార్పు కేరళం నుండే ప్రారంభమవుతుందనీ ఆ మార్పే దేశమంతా తుఫానుగా మారాలని పిలుపునిచ్చారు. అర్యదాన్ ముహమ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం తనకెంతో ఆనందంగా ఉందనీ కేరళ వెలుపల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత ప్రత్యేకమని చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తగా, రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఒక కార్యకర్తగా తాను ఈ అవార్డును స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కేరళకు రావడం తనకెప్పుడూ సంతోషంగా ఉంటుందనీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో చేపట్టిన భారత్ జోడో యాత్ర సమంయలోనూ తాను ఈ రాష్ట్రానికి వచ్చాననీ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ ఇక్కడికి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళ రాజకీయ గాలి యావత్ దేశాన్నే ప్రభావితం చేస్తుందనీ, వాతావరణ నిపుణులు రుతుపవనాల కోసం కేరళం వైపు ఎలా చూస్తారో, దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ ఈ రాష్ట్రాన్ని ఒక సంకేతంగా చూడాలని అభిప్రాయపడ్డారు. గత రెండు దశాబ్దాలలో జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు, సీఎం వంటి పదవులను చూశాననీ, ఇక తనముందున్న ఏకైక లక్ష్యం రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమేనని స్పష్టం చేశారు. ప్రతీసారి కేరళం ప్రజలు తనకు ఆత్మీయ స్వాగతం పలికారనీ లౌకికవాదానికి అండగా నిలుస్తూ కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులకు మద్దతు ఇస్తున్న కేరళం ప్రజలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# రాహుల్‌కు మతి తప్పింది

(మొదటి పేజీ తరువాయి)

ఓడిపోతుండడంతో మతిస్థిమితం తప్పినట్లుం దని ఆయన ఎద్దేవా చేశారు. అందుకే ప్రధాని మోడీ గురించి అనుచితంగా మాట్లాడుతున్నారని అన్నారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం, ప్రజాస్వామ్యాన్ని కించపరచడం, ప్రభుత్వ విదేశీవిధానాన్ని, దౌత్య సంబంధాలను విమర్శించడం, మోడీ వ్యక్తిగత సంబంధాల గురించి అనుచితంగా మాట్లాడడం సమంజసనీయం కాదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం ఉన్నట్లు.. లేకుంటే ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతున్నట్లా.. అని అడిగారు. ప్రజాస్వామ్యంపై రాహుల్ పాఠాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మంత్రి అన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

సాగిస్తున్నామని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించిన సీఎం ప్రభుత్వం బీసీలు, పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చాలకలి ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారన్నారు. అందుకే కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమె సేవలను స్మరించుకున్నామని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందించడమే ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని ఈ సందర్బంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# హౌస్ హస్బెండ్‌గా ఎందుకుండకూడదు

(మొదటి పేజీ తరువాయి)

రావాలని సూచించింది. ఓ విడాకులకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తిరువణ్ణామలైకి చెందిన యువతీయువకులు 2011లో



వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త వైద్యుడు కాగా ఉన్నత చదువులకు వెళ్లడంతో భార్య తన పుట్టింట్లో ఉన్నారు.

2020 తర్వాత కలిసి ఉన్నప్పుడు గొడవలు రావడంతో భార్య తన వైవాహిక హక్కులను సంరక్షించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. భర్త విడాకులు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను ఫ్యామిలీ కోర్టు కొట్టేయడంతో ఇద్దరూ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేశారు. భర్త రూ.2.50 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించడంతో పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరయ్యాయి. ఈ కేసు విచారణ సందర్భంగా వివాహ వ్యవస్థలో భార్యాభర్తల బాధ్యతలపై ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

# దసరా లోపు నామినేటెడ్ పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలకు డైరెక్టర్లు కార్పొరేషన్ల చైర్మన్ల ఎంపిక కోసం ఇప్పటికే కొంత కసరత్తు జరిగింది. నియోజకవర్గాల వారీగా పేర్లు తీసుకుని లిస్టు తీసుకుని జాబితాను కూడా సిద్దం చేయగా, దసరాలోపే ఆ నేతలకు పోస్టులు ఇవ్వనున్నట్లు సమాచారం. పార్టీలో పదవుల భర్తీ వ్యవహారాన్ని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షిస్తారు. ఈ క్రమంలో ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి ఆశావహుల జాబితా సిద్ధంగా ఉండటంతో త్వరలో ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశంపై అధిష్టానం నుంచి ఆమోదం పొందే అవకాశం ఉంది. కాగా, పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇచ్చిన 37 కార్పొరేషన్ చైర్మన్ల పదవీకాలం ముగిసింది. వీరిలో కొందరికి రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే, వాళ్లలో ఐదుగురికి మించి తిరిగి ఇవ్వకపోవచ్చని అంటున్నారు. మిగతా కార్పొరేషన్ చైర్మన్ల పదవులను కొత్త నేతలతో భర్తీ చేసే అవకాశం ఉంది. దీంతో నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న నేతలు తమకు సన్నిహితులైన మంత్రులు ఇతర సీనియర్లతో పైరవీలు చేసుకుంటున్నారు.

# ప్రభుత్వానికేమీ లాభం రాదు

(మొదటి పేజీ తరువాయి)

ఇది పన్నో, సెస్సో కాదని, సర్ ఛార్జీ అంతకంటే కాదని పేర్కొన్నారు. అంతేకాదు, దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు వచ్చేది కూడా ఏమీ ఉండదని ఆమె స్పష్టంచేశారు. మొత్తం ఎండీఆర్ లో 40 శాతం వినియోగదారులు ఉపయోగించే బ్యాంకులకు, 30 శాతం పేమెంట్ గేట్ వేకి, 20 శాతం యూపీఐ యాప్‌కు, మిగిలిన 10 శాతం యూపీఐ యాప్ స్పాన్సర్ బ్యాంకుకు వెళ్తుంది. ఈ రుసుములు వ్యాపారి మాత్రమే భరించాలి' అని నిర్మలా సీతారామన్ తెలిపారు. డిజిటల్ చెల్లింపుల సాంకేతిక మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి, మెరుగుదలకు, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడానికి ఈ ఛార్జీని చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వామి వర్గాలే పంచుకుంటాయని స్పష్టంచేశారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

**ఎమ్డీఆర్ భారం.. వినియోగదార్లపై తక్కువే**

క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలపై ఇప్పటికే వ్యాపారులు ఎండీఆర్ చెల్లిస్తున్నారని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. యూపీఐలో లావాదేవీలపై ఎండీఆర్ను వినియోగదారులపై పడే ఛార్జీగా చూడకూడదన్నారు. రూ.2 వేలు వరకు యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని తెలిపారు. వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ పరిధిలోకి రావని పేర్కొన్నారు. ప్రతిపాదిత ఎండీఆర్ వల్ల వినియోగదారులపై భారం పడుతుందన్న విమర్శల వేళ నిర్మలా సీతారామన్ ఈ మేరకు స్పష్టతనిచ్చారు.

# అమ్మాయికి వేధింపులు

- బిహార్లో మరో ఘటన
- కలకలం సృష్టిస్తున్న వరుస వేధింపుల ఘటనలు

**పట్నా, సెప్టెంబర్ 25:** బిహార్లో అమ్మాయిలపై వరుస వేధింపుల ఘటనలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే జాముయి, సమస్తీపూర్లలో మైనర్ బాలికలను ఆకతాయిలు వేధించగా.. తాజాగా బంకా జిల్లాలోనూ ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. జిల్లాలోని మందర్ హిల్ వద్ద ఓ అమ్మాయిపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితురాలితో వారు అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను కొట్టారు. సెప్టెంబరు 3న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారడంతో పోలీసులు సుమోటోగా దర్యాప్తు చేపట్టారు.

నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జాముయి జిల్లాలో స్నేహితులైన ఇద్దరు టీనేజర్లు.. కోచింగ్ సెంటర్కు వెళ్లి వస్తుండగా రోడ్డుపైనే దుండగులు అడ్డగించిన సంగతి తెలిసిందే. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు.

అభ్యంతరకరంగా తాకారు. ఈ ఘటన మరువక ముందే.. సమస్తీపుర్ జిల్లాలోనూ ఓ టీనేజీ అమ్మాయి, అబ్బాయి కలిసి రోడ్డుపై నడుచుకుంటూ ఫొటోలు తీసుకుంటుండగా కొందరు ఆకతాయిలు అడ్డగించి అమానుషంగా ప్రవర్తించారు. ఇలా వరుస ఘటనలు బిహార్లో రాజకీయ దుమారం రేపాయి. రాష్ట్రంలో అమ్మాయిలకు రక్షణ లేకుండా పోతోందని విపక్షాలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి.

# ప్రశాంతం.. పరిపూర్ణం

## రాజధానిలో మంత్రి పొన్నం ఏరియల్ సర్వేనవరాత్రుల సందర్భంగా

## 13 మంది మృతి.. 26 మందికి గాయాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** తెలంగాణ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగిశాయి. పోలీసు శాఖ తీసుకున్న పకడ్బందీ భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన ట్రాఫిక్ నియంత్రణల కారణంగా నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగింది. హైదరాబాద్ నగరంతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నారాయణపేట సహా అన్ని జిల్లాల్లో లక్షలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. శుక్రవారం జరిగిన నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ లక్డీకాపూల్లోని డీజీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.

**నాలుగు లక్షల వరకు విగ్రహాలు**

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 1,24,000 పైచిలుకు విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు డీజీపీ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 8,000 ఎక్కువ అని పేర్కొన్నారు. ఇక అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వ్యక్తిగత గృహాల్లో ప్రతిష్ఠించిన చిన్న విగ్రహాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య సులభంగా మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన ఇన్నొవేషన్ అండ్ ఇమర్షన్ పోర్టల్ ద్వారా మండపాల నిర్వాహకులు, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుని విగ్రహాల వివరాలను పక్కాగా నమోదు చేసినట్లు డీజీపీ వివరించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయానికే రాష్ట్రవ్యాప్తంగా 63,350 విగ్రహాల నిమజ్జనం పూర్తి కాగా, మరో 32 వేల విగ్రహాలు నిమజ్జనానికి క్యూలో ఉన్నాయని, శనివారం ఉదయం నాటికి ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

**25,000 మంది పోలీసులతో బందోబస్తు..**

**మంత్రి పొన్నంతో కలిసి ఏరియల్ సర్వే...**

హైదరాబాద్ నగరంలోనే నిమజ్జన బందోబస్తు కోసం సుమారు 25,000 మంది పోలీసులను మోహరించినట్లు డీజీపీ తెలిపారు. ఇందులో 15,000 మంది స్థానిక సిటీ పోలీసులు కాగా, మిగిలిన 10,000 మందిని జిల్లాల నుంచి ప్రత్యేకంగా రప్పించారు. హైదరాబాద్ నగర విస్తీర్ణం పెరిగిన దృష్ట్యా శంషాబాద్, రాజేంద్రనగర్ లాంటి ప్రాంతాలకు అదనపు బలగాలను కేటాయించారు. సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో కూడా అదనపు సివిల్, ఏపీఎస్పీ ఫోర్సు అందించారు. టీజీఎస్పీ బెటాలియన్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆర్ఏఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్తో పాటు మౌంటెడ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్లనుకూడా భద్రతా విధుల్లో వినియోగించారు. హైదరాబాద్ నగరంలో13 డ్రోన్లను మోహరించి, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులకు బర్డ్ ఐ వ్యూ అందించారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్తో కలిసి డీజీపీ శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్లో ఏరియల్ సర్వే నిర్వహించి ఊరేగింపు రూట్లను, ట్యాంక్ బండ్ పరిసరాలను పరిశీలించారు. శుక్రవారం ప్రార్థనల కారణంగా ఆయా వర్గాల మనోభావాలను గౌరవిస్తూ ఉదయం ఊరేగింపులు కాస్త ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, సాయంత్రానికి వేగం పుంజుకున్నాయని డీజీపీ తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మృతి.. 26 మందికి గాయాలు..**

ఈ పది రోజుల ఉత్సవాల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 13 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపిందని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం ఎస్ఐ వెంకన్న హైదరాబాద్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా, సైబరాబాద్ పరిధిలోని పటాన్చెరు వద్ద జరిగిన ప్రమాదంలో ఆరుగురు యువకులు మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఖైరతాబాద్ గణేశ్ వద్ద ఒకరు, నిర్మల్లో ఊరేగింపు సమయంలో మరొకరు గుండెపోటుతో మరణించారు. డీజేల విపరీతమైన శబ్ద కాలుష్యం కారణంగా కూడా కొందరు ఆరోగ్య సమస్యలు, గుండెపోటు బారిన పడినట్లు డీజీపీ నిర్ధారించారు. వివిధ సంఘటనల్లో రాష్ట్రవ్యాప్తంగా 26 మందికి గాయాలయ్యాయి, అందులో అత్యధికంగా మల్కాజిగిరి పరిధిలోనే 17 మంది గాయపడ్డారని వెల్లడించారు. మొత్తంగా, అన్ని వర్గాల సమన్వయం, పటిష్టమైన పోలీసు భద్రతా చర్యలతో గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని డీజీపీ వెల్లడించారు.

# జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

**ఢిల్లీ, సెప్టెంబర్ 25:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఢిల్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను తొలగించుకొని ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే చూస్తూ కూర్చోబోమని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మాస్కును ధరించి.. యూత్ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ని పోలీసులు నిర్భందించారు. బిహార్ రాజధాని పట్నా, చండీగఢ్ లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు కోల్ కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి.

# క్రిమినల్ ప్రాసిక్యూట్ చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ వేశారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా.. జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్ వేర్ మార్పులన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. సర్ కు సంబంధించిన నిర్ణయాలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ.. 'ఫామ్-6'ను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సర్ ప్రక్రియ సమయంలో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయని, వాటిపై సిట్ తో దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు.

# సీఈసీ రాజీనామాకు ఇంక మిగిలింది 24 గంటలే

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుందనేది ముమ్మాటికీ నిజమేనని ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాలు ఎన్నికల్లో పాల్గొనడంతో.. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భావన ప్రజల్లో కలుగుతోందన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని పదేపదే ఆరోపిస్తున్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు ఎందుకు పోటీ చేస్తున్నాయని ప్రశ్నించారు. 'మీరు ఎన్నికల్లో పోటీ చేయకపోతే మీ ఉనికికే ముప్పు వాటిల్లుతుందనే భయంతో పోటీ చేస్తుండొచ్చు. కానీ ఓట్లు దొంగిలిస్తున్నప్పుడు.. మీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభపెడుతున్నప్పుడు.. మీ పార్టీలు చీలిపోతున్నప్పుడు.. మీరు ఇంకా ఎలాంటి ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు? ఆట మోసపూరితమైందని చెబుతున్నప్పుడు.. దానికి కొనసాగించడం తప్పు.

# నిత్య జనగణమన నిర్వాహకులకు అభినందన

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** నిత్య జనగణమన విజయవంతంగా 1600 రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని.. వీహెచ్‌పీ కార్యక్రమ నిర్వాహకులకు అభినందన సత్కారం అందజేసింది. శుక్రవారం గణేశ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లోని లిబర్టీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రసార సమితి తెలంగాణ ప్రశాసనిక్ సంపర్క్ ప్రముఖ్ రాపర్తి రవికుమార్ నిత్య జనగణమన ఫౌండర్ ఆర్గనైజర్ నేలంటి మధు, వందే ప్రజ అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్‌లను సత్కరించారు. సమితి ఆఫీసు బేరర్లు వెంకటేశ్వర్ రావు జాధవ్, నందనం హరికిషన్ శర్మ, శ్రీమతి ఉమారెడ్డి, రమణ, బ్రహ్మం గౌడ్, భూమా గంగాధర్ గౌడ్ తదితరులు అభినందనలు తెలియజేశారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి ప్రేమ్ గాంధీ ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు.



## మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన దానం



● 'ప్యారడైజ్' పాటకు ఉత్సాహంగా డ్యాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి: హైదరాబాద్లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

## గ్రేటర్లో కనులపండువగా
# గణేశ్ నిమజ్జనం..




### ప్రశాంత వాతావరణంలో సాగుతున్న ఉత్సవాలు

పటిష్ట ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం: మంత్రి పొన్నం ప్రభాకర్

ఏరియల్ వ్యూ ద్వారా నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన మంత్రి, ఉన్నతాధికారులు

ఉత్సవ నిర్వాహకులు, భక్తులు సహకరించి ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): భాగ్యనగరంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న వినాయకుల నిమజ్జన మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. నగరవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో సాగుతున్న ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సుమారు గంటపాటు నగరంలోని నిమజ్జన ప్రాంతాలను ఏరియల్ వ్యూ ద్వారా ఉన్నత అధికారులతో కలిసి పరిశీలించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ఏరియల్ వ్యూ పరిశీలన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలాలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 11వ రోజైన శుక్రవారం గణేశ్ నిమజ్జనానికి ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, నిర్ణీత రూట్లు, పాయింట్ల వద్ద వివిధ శాఖల అధికారులు, పోలీసు యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఖైరతాబాద్ బడా గణేశ్ నిమజ్జనం మధ్యాహ్నమే విజయవంతంగా పూర్తికాగా, బాలాపూర్ గణేష్తో పాటు జంట నగరాల్లోని వివిధ ప్రాంతాల ప్రతిష్టాత్మక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా సాగుతోందని పొన్నం వెల్లడించారు. రానున్న సమయాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు ప్రభుత్వానికి సహకరించి విగ్రహాల కదలికను వేగవంతం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, ఎంజే మార్కెట్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో తలెత్తిన స్వల్ప ట్రాఫిక్ రద్దీని ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేసి క్లియర్ చేయించామని మంత్రి తెలిపారు. నగర ప్రజలందరూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా, సంయతనంతో వ్యవహరిస్తూ ఈ గణేశ్ నిమజ్జన వేడుకలను మరింత ఆనందంగా, విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో టీడబ్ల్యూయూకు
# కాంగ్రెస్ మద్దతు

### ప్రకటించిన టీపీసీసీ చీఫ్ మహేష్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 : త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 9న జరగనున్న ఈ ఎన్నికల్లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన పార్టీ శ్రేణులకు శుక్రవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నగరాలు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆర్టీసీ డిపోలలో కాంగ్రెస్ అనుబంధంగా పనిచేస్తున్న టీడబ్ల్యూయూ అభ్యర్థులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్మికుల మధ్య ఐక్యత కోసం ఇతర యూనియన్లను ప్రోత్సహించవద్దని పార్టీ నాయకులకు సూచించారు. ఈ ఎన్నికల నిర్వహణ, పార్టీ శ్రేణులు, కార్మికుల మధ్య సమన్వయం కోసం టీపీసీసీ ఉపాధ్యక్షులు, టీడబ్ల్యూయూ గౌరవాధ్యక్షులు బొంతు రామ్మోహన్ ను సమన్వయకర్తగా నియమించారు. టీడబ్ల్యూయూ ప్రెసిడెంట్ గా మొగుళ్ల రాజిరెడ్డిని నియమించారు.

## 11 నుంచి ఇంద్రకీలాద్రిపై
# శరన్నవరాత్రి మహోత్సవాలు

### ఆర్జిత సేవా టికెట్ల విడుదల



విజయవాడ, సెప్టెంబర్ 25 : కనకదుర్గమ్మ అమ్మవారు కొలువైన విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలకు ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవా టికెట్లను శుక్రవారం లాంఛనంగా విడుదల చేశారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న ఈ ఉత్సవాల టికెట్లను దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, స్థానాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. దేవస్థానం నూతన పూజా మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్న ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్రనవావరణార్చన సేవలను భక్తులు ఇంటి వద్ద నుంచే పరోక్షంగా వీక్షించవచ్చు.

పూజా సమయంలో భక్తుల పేర్లు, గోత్రాలను అమ్మవారి సన్నిధిలో అర్చకులు చదువుతారు. భక్తులు లైవ్ లింక్ ద్వారా ఈ పూజలను తిలకించవచ్చు. సేవా టికెట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారిక పోర్టల్ ద్వారా లేదా ఏపీ ప్రభుత్వ 'మనమిత్ర' అధికారిక వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా అత్యంత సులభంగా ఆన్లైన్లో బుక్ చేసుకోవచ్చని ఈవో శీనానాయక్ తెలిపారు. ఒక రోజు పూజా టికెట్ రుసుము రూ.1,500, పది రోజులకు ప్యాకేజీ రుసుము: రూ.11,116/- (నవరాత్రుల మొత్తం 10 రోజులకు)గా నిర్ణయించారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత భక్తుల చిరునామాకు తపాలా ద్వారా అమ్మవారి శేష వస్త్రం, రవిక ముక్క, శ్రీచక్ర పీఠం, ల్యామినేషన్ ఫొటో, కుంకుమ భరిణె, రక్షా కంకణాలను పంపిస్తారు. పరోక్ష సేవా టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు నేరుగా దేవస్థానంలో పూజల్లో పాల్గొనేందుకు గానీ, అమ్మవారి దర్శనానికి గానీ ఎలాంటి అనుమతి ఉండదు. దూర ప్రాంతాల నుంచి రాలేని భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఛైర్మన్, ఈవో సూచించారు.

# రాష్ట్రంలో 200 కొత్త కోర్టులు

### ఏర్పాటుకు జీవో జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 25 : రాష్ట్రంలో న్యాయవ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కేసుల విచారణను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 200 అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులను ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి ఆర్థిక శాఖ ఆమోదంతో జీవో ఎంఎస్ నంబర్ 59ను జారీ చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించేందుకు మొత్తం 594 కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం తొలిదశ కింద 200 కోర్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

**అధిక కోర్టులు కేటాయించిన జిల్లాలు**

**రంగా రెడ్డి జిల్లా:**
గరిష్ఠంగా 30 కోర్టులు (రాజేంద్రనగర్, ఎల్బీనగర్, కూకట్పల్లి, హయత్నగర్, చేవెళ్ల, షాద్నగర్, ఆమన్గల్, ఇబ్రహీంపట్నంలలో).

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా:**
25 కోర్టులు (మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ ప్రాంతాల్లో).

**హైదరాబాద్:**
సిటీ సివిల్, సెషన్స్ కోర్టుల పరిధిలో 16 కోర్టులు.

**ఇతర జిల్లాలు:**



నల్గొండ (10), ఖమ్మం (8), సంగారెడ్డి (8), కరీంనగర్ (7), సూర్యాపేట (7), నిజామాబాద్ (6), జగిత్యాల (6), సిద్దిపేట (5), మంచిర్యాల (5), వరంగల్, హనుమకొండ కలిపి (12) కోర్టులు మంజూరైనాయి.

## ఉధృతంగా గోదావరి వరద ప్రవాహం..
# ప్రజా అవసరాలకు ఒడిసి పట్టండి

### కాళేశ్వరం సహా.. జలాశయాలను నింపండి.. మంత్రి ఉత్తమ్కు హరీష్రావు లేఖ




హైదరాబాద్, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి : ప్రస్తుతం గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నందున మోటార్లు నడిపి రిజర్వాయర్లను నింపాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్రావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం లేఖను రాశారు. ఇప్పటికైనా కళ్లు తెరచి , చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం లేదని పేర్కొన్నారు. ఎన్నినోను సాకుగా చూపకుండా, అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్-ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించి, 141 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను ఏర్పాటు చేశారని వెల్లడించారు.

**కుట్ర రాజకీయాలతో పంటలు ఎండబేడుతున్నరు**

గోదావరిలో వరద వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లను నింపితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంద న్నారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే, మీరు మాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ పంటలు ఎండగొడుతున్నారని విమర్శించారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయని, మల్లన్న సాగర్ రిజర్వాయర్లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుందని సూచించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయని, ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుందని తెలిపారు. మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్.ఎం.డి.)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని వివరించారు. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారని తెలిపారు.

**పాం ఆయిల్ ఫ్యాక్టరీకి నీళ్లు లేక ఇబ్బందులు**

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని లేఖలో పేర్కొన్నారు. పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని, రంగనాయక సాగర్లో నీళ్లు లేకపోవడం వల్ల పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారిందని వెల్లడించారు. గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మీరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని కోరారు.

# విదేశీ పర్యటనకు నారా కుటుంబం

● ప్రత్యేక విమానంలో సీఎం పయనం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కుటుంబ సమేతంగా మూడు రోజుల వ్యక్తిగత విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో ఆయన విదేశాలకు ప్రయాణమయ్యారు. ఇది పూర్తిగా ఆయన వ్యక్తిగత, ప్రైవేట్ టూర్ కావడంతో చంద్రబాబు ఏ దేశానికి వెళ్తున్నారు, ఎక్కడ బస చేయనున్నారు అనే వివరాలను అధికారిక వర్గాలు అత్యంత గోప్యంగా ఉంచాయి.



(అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి): గత కొంతకాలంగా వరుస సమీక్షలు, జిల్లాల పర్యటనలు, పెట్టుబడుల సన్నాహక సమావేశాలతో బిజీగా గడిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కొద్దిరోజుల పాటు విశ్రాంతి కోసం చిన్న విదేశీ పర్యటనను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఆయన వ్యక్తిగత సిబ్బంది పర్యవేక్షణలోనే ఈ ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ 28 సోమవారం నాటికి తిరిగి అమరావతికి చేరుకోనున్నారు. విదేశీ పర్యటన ముగిసి తిరిగి వచ్చిన మరుసటి రోజు నుంచే సెప్టెంబర్ 29న సీఎం షెడ్యూల్ పక్కాగా ఖరారైంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 3 వరకు చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా వరుస కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 29న విజయవాడలో జరిగే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'మిషన్ కర్మయోగి' వర్క్షాప్నకు హాజరవుతారు.

**రాయలసీమ గ్లోబల్ ఫ్రూట్ బౌల్ ప్రాజెక్ట్**

అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ప్రభుత్వ రూ. 40,000 కోట్ల భారీ మద్దతుతో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్ (రాయలసీమను గ్లోబల్ ఫ్రూట్ బౌల్గా మార్చే ప్రాజెక్ట్) శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రులతో కలిసి సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రస్తుతం సీఎం విదేశాల్లో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేసేందుకు అవసరమైన కమ్యూనికేషన్ ఏర్పాట్లను సీఎంఓ సిబ్బంది సిద్ధం చేశారు.

# ఏ ఒక్కరినీ విడిచిపెట్టం



### 'శాప్' దాడి ఘటనపై మంత్రి సవిత

టీచర్లపై దాడి చేసిన వారంతా గొడ్డలి పార్టీ గూండాలే..

మెగా డీఎస్సీలో అక్రమాలు జరగలేదని తేల్చిన కోర్టు

చెంప పెట్టులాంటి తీర్పిచ్చినా సిగ్గులేని జగన్ బ్యాచ్

బుక్కరాయసముద్రం/ అనంతపురం,సెప్టెంబర్,25,మనం న్యూస్ : విజయవాడ శాప్ కార్యాలయంలో ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిలో డీఎస్సీ అభ్యర్థులెవరూ లేరని, అంతా గొడ్డలి పార్టీ గూండాలేనని, ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. కోర్టు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చినా, జగన్, గొడ్డలి పార్టీ నాయకులు సిగ్గు లేకుండా మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులంటే సీఎం చంద్రబాబుకు అపారమైన గౌరవమని, అందుకే విధి నిర్వహణలో వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారని తెలిపారు. శుక్రవారం బుక్కరాయసముద్రం మండలం, జంతులూరు లోని 14వ బెటాలియన్ లో ఏపీఎస్పీ ఎస్సీటీపీసీ 2025-26 బ్యాచ్ కు చెందిన 187 మంది శిక్షణార్థుల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంత్రి సవిత విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో పోలీసులు తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వర్తించేవారన్నారు. సీఎం చంద్రబాబుకు పోలీసులపై అపారమైన గౌరవం ఉందన్నారు. శాంతిభద్రతలో పోలీసులే కీలకమని భావించి, వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, దాంట్లో భాగంగా పోలీసు శాఖ పోస్టులు కూడా భర్తీ చేస్తామని తెలిపారు. ఇటీవల 2,050 ఎస్ఐ, ఇతర కానిస్టేబుళ్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీచేశామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే, 6,100 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీచేశామన్నారు. వారిలో 187 మందికి జంతులూరు లోని 14వ బెటాలియన్ నందు ఏపీఎస్పీ ఎస్సీటీపీసీలో పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమం ఘనంగా జరిగిందని మంత్రి సవిత తెలిపారు.

**వారంతా 'గొడ్డలి' గూండాలే...**

విజయవాడలోని శాప్ కార్యాలయంలోని ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిలో గొడ్డలి పార్టీ గూండాలేనని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఉపాధ్యాయులపై దాడి చేసిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదని కోర్టు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చినా, జగన్, గొడ్డలి పార్టీ నాయకులు సిగ్గుపడడం లేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, చూస్తూ ఊరుకోబోమని, ఉక్కుపాదం మోపుతామని మంత్రి సవిత హెచ్చరించారు.

# పర్యావరణంపై అవగాహన అవసరం





వాతవరణంలో సంభవించే మార్పులు, పారిశుధ్యలోపం, నగరీకరణ, పారిశ్రామీకరణ వలన మానవాళికి ఏర్పడిన ప్రమాదం పట్ల అవగాహన పెంపొందించడం, పర్యావరణ నాణ్యతను పెంచడం వంటి అంశాల ఆధారంగా ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం ఏర్ప డింది. మనం పీల్చే గాలి సురక్షితంగా ఉండాలి. తాగే నీరు పరిశుభ్రంగా ఉండాలి. తినే ఆహారం కల్తీ కాకుండా చూడాలి. ప్రపంచాన్ని రక్షించ డానికి, భావితరాలకు మంచి భవిష్యత్తును అందించడానికి పర్యావరణాన్ని పరిరక్షించాలి. పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగు పరచాలి. వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విజ్ఞానంతో కూడిన సమాజాన్ని నెలకొల్పాలి. ప్రకృతిలో సహజంగా సంభవించిన ఏర్పాటును విధ్వంసం చేయడం వలన మానవాళి మనుగడ ప్రమాదంలో పడింది. ఆరోగ్యానికి,పర్యావరణానికి మధ్య గల అవినాభావ సంబంధాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలి. పర్యావరణం మానవ దుష్కృత్యాల వలన అనేక పరిణామాలకు గురైనది. పర్యావరణంలో నాశనమైతే,అది అంతిమంగా మానవ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పర్యావరణం ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ఇదే భావనతో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం జరుగుతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచంలో 24 శాతం మంది ప్రజలు పర్యావరణ సమస్యల వలన ఇబ్బందులకు గురౌతున్నారు. సుమారు 12.6 శాతం మంది ప్రజలు పర్యావరణ సంబంధిత అనారోగ్య సమస్యల వలన మృత్యువాత పడుతున్నారు.గాలి, నీరు, నేల, ఆహారం ఇలా అన్నింటి లోను హానికరమైన రసాయనిక పదార్థాలు,ఇతర భౌతిక,జీవ సంబంధిత హాని కారకాలు చేరడం వలన అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి.ప్రజల ఆరోగ్యం పర్యావరణం పై ఆధారపడి ఉంది. పర్యావరణం బాగుండాలంటే ప్రజలకు స్వచ్ఛ మైన గాలి, నీరు ఆహారం కావాలి. వాయు కాలుష్యం వలన, నీటి కాలుష్యం వలన వాతా వరణంలో అనేక అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.పర్యావరణం దెబ్బ తినడం వలన ప్రజలు అనారోగ్యవంతులవు తున్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆర్థిక ప్రగతి సాధ్యపడుతుంది. పర్యావరణం ఆరోగ్య వంతంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యపడుతుంది. పర్యావరణాన్ని వివిధ రకాల కాలుష్యాల నుండి కాపాడి,ప్రజల ఆరోగ్యం మెరుగుపరచడానికి 1986 సంవత్సరంలో లండన్ ప్రధాన కార్యాలయం గా 'ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎన్విరాన్మెంటల్ హెల్త్ కౌన్సిల్' (IFEH) ఏర్పడింది. ఇండోనేషియాలోని బాలి ప్రావిన్స్ రాజధాని డెన్‌పసర్‌లో 2011 సంవత్స రంలో జరిగిన ఈ కౌన్సిల్ సమావేశం ప్రతీ సంవ త్సరం సెప్టెంబర్ 26వ తేదీన ప్రపంచ పర్యా వరణ ఆరోగ్య దినోత్సవం జరపాలని నిర్ణయిం చింది. పర్యావరణానికి ఇబ్బందికరంగా మారిన గ్రీన్ హౌస్ వాయువుల గురించి, వాతావరణ మార్పుల గురించి ప్రజల్లో అవగాహన కలిగిం చడం, కాలుష్య కారకాలను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం, మొక్కలను పెంచడం వంటివి అంతర్జాతీయ పర్యావరణ ఆరోగ్య మండలి ప్రణాళికలో చోటు చేసుకున్న ప్రధానాంశాలు. పుడమిపై పచ్చదనం మాయమైపోతున్నది.

పచ్చని పంట పొలాలతో, పసందైన ప్రకృతి ఒడిలో స్వచ్ఛమైన ప్రాణవాయువును పీలుస్తూ, అంటువ్యాధులను సైతం అవలీలగా జయించి, రసాయనిక పదార్థాలు లేని,సహజసిద్ధమైన బలవర్ధకమైన ఆహారాన్ని భుజించి, ఆరోగ్యవంతంగా నిండు నూరేళ్ళు జీవించిన నాటితరం నాటి జీవన విధానం నేటి తరంలో అగుపించడం లేదు. కృత్రిమ వాతావరణంలో, కాలుష్య కారకాల మధ్య నిరంతరం అష్టకష్టాలు పడుతూ, ఆరోగ్యాలు చెడి, అంటువ్యాధుల బారిన పడి అలమటిస్తున్న వారి ఆవేదనలు, ఆక్రందనలు అత్యంత బాధాకరంగా ఉన్నాయి.

నిరక్షరాస్యత ప్రబలంగా ఉన్న నాటి కాలంలో కూడా ప్రజలు ఎంతో విజ్ఞత ప్రదర్శించి, ప్రకృతిని దైవంగా ఆరాధించే వారు. విజ్ఞానం పెరిగిన కొద్దీ నేటి ప్రపంచం అజ్ఞానంతో అలమటిస్తూ, మితిమీరిన స్వార్థంతో ప్రకృతి పై విధ్వంస కాండను కొనసాగిస్తున్నది. పెరిగిన జనాభా ఇతర జీవరాశుల అంతానికి నాంది పలికింది.పెరిగిన జనాభాకు సరిపడా ఆహారం సమకూర్చడం కోసం ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచవలసిన అవసరం ఏర్పడింది. ఆహారోత్ప త్తుల పెంపుదలకు పంటల్లో విరివిగా రసాయనిక ఎరువుల వాడకం పెరిగింది. క్రిమికీటకాదుల నుండి పంటలను సంరక్షించడానికి మోతాదుకు మించి, క్రిమి సంహారక మందులను వినియోగిం చడం వలన పంటలకు సహజ మిత్రులైన పలు జీవరాశులు నశించిపోయాయి.

వాతావరణంలో కాలుష్యం పెరిగింది. ఊహించని వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రజల నివాసాలకోసం పచ్చని పొలాలు, అడవులు విధ్వంసమైనాయి. అవసరాలకు మించి ఆకాశహర్మ్యాలు పెరిగిపోయాయి. పట్టణాల సంస్కృతిని పల్లెలు సంతరించుకున్నాయి. నగరీకరణ వలన సహజసిద్ధమైన వాతావరణం అంతరించింది. కలుషితాల వలన అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. ప్రకృతిలో పలు అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సముద్ర జలాలు వేడెక్కి, ఎల్‌నినో సమస్య ఏర్పడి భూమండలం అగ్నిగుండంలా మారింది.

కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఒక వైపు కరువు, మరో వైపు వరదలు వంటి విచిత్రమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రకృతి విలయాలతో జనజీవనం అస్తవ్యస్తమౌతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. పర్యావరణ పరిస్థితులపై దృష్టి సారించక పోతే ఇప్పటికే ప్రమాదపు అంచున ఉన్న మానవాళి తన మనుగడను కోల్పోయే ప్రమాదం ఉంది. పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించడంలోనే సకల మానవాళి క్షేమంగా మనుగడ సాగించగలదు. పచ్చదనం యొక్క ప్రాధాన్యత చాటి చెప్పాలి.

ఒక వైపు మొక్కల పెంపకం ఆవ శ్యకత గురించి చెబుతూనే, మరొక వైపు చెట్లను నరకడం పరిహాసప్రాయమౌతున్నది. ఐక్యరాజ్య సమితితో పాటు పలుఅంతర్జాతీయ సంస్థలు పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నా యి. ప్రజల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమా లను రూపొందిస్తున్నాయి.

ప్రపంచ దేశాలన్నీ పర్యావరణం గురించి, పచ్చదనం యొక్క ఆవశ్య కత గురించి పదే పదే చెబుతూనే ఉన్నా,అవన్నీ కేవలం మాటల వరకే పరిమితమౌతున్నాయి. సందర్భానుసారంగా మొక్కుబడిగా మొక్కలను నాటి, వాటి సంరక్షణను గాలికొదిలేయడం వలన మొక్కలు నాటే కార్యక్రమాలు నగుబాటు పాలౌ తున్నాయి. పర్యావరణ సంరక్షణ సమిష్టి బాధ్యత. ప్రపంచంలో తలెత్తే పలు సమస్యలకు పర్యావరణ విధ్వంసమే మూలకారణం.కాలుష్యకారకాలు విజృంభించడం భూఉష్ణోగ్రతలు భరింపశక్యం కాకుండా పెరగడం ఊహాతీతమైన ప్రకృతి విలయాలకు సంకేతం. ఆధునిక పరిజ్ఞానం ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రభావం చూపుతున్నది. ఆధునిక నాగరికత జనావాసాలను కాంక్రీటు అరణ్యాలుగా మారుస్తున్నది.

చెరువులు,ఇతర నీటి వనరులు నశించిపోతున్నాయి. సముద్ర జలాలు కలుషితమై సముద్ర జీవాలు అంతరించి పోతు న్నాయి. ప్రకృతిలో చోటు చేసుకుంటున్న పరిణా మాలు జీవవైవిధ్యానికి ముప్పుగా మారాయి. మానవ స్వార్థం ఇతర జీవరాశులకు భూగ్రహంపై చోటులేకుండా చేస్తున్నది. విలాసవంతమైన జీవన విధానం జీవ వైవిధ్యానికి తూట్లు పొడుస్తున్నది. దూరదృష్టి నశించి చెట్లను నరకడం పెరిగిన మానవ పైత్య ప్రకోపానికి నిదర్శనం. ఇకనైనా పర్యావరణానికి సంభవిస్తున్న పెను ముప్పును నివారించాలి. ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించడంలో చేస్తున్న నిర్లక్ష్యం అత్యంత ప్రమాదకరంగా మారింది. రసాయనాల వినియోగం, వాతావరణ కాలుష్యం మానవ మనుగడకు చరమగీతం పాడే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో బాధ్యతయుతమైన, విజ్ఞానవంతమైన ప్రపంచ నిర్మాణం వైపు అంతర్జాతీయ సంస్థలు దృష్టి సారించాలి.

**(సెప్టెంబర్ 26 ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం)**

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# రాజ్యాంగ విలువల ఉల్లంఘన!



భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత కీలక మైన, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ. దేశంలో నిష్పాక్షి కంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఈ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. కానీ, ఇటీవల వెలువడుతున్న కథనాలు, చోటుచేసు కుంటున్న పరిణామాలు కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రెండొం దల ఇరవై నాలుగు ప్రజాప్రతినిధుల సభ ఎన్నికల ప్రణాళిక వెలువడే కొద్దిరోజుల ముందు అకస్మా త్తుగా భారత ఎన్నికల అధికారిగా నియమితులైన జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలి, ఆ నియామకం వెనుక ఉన్న రాజకీయ ప్రాధాన్యతలు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత పది నెలల కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నుంచి వెలువడిన అనేక కీలక ప్రకటనలు, నిర్ణయాలు అత్యధిక సంఖ్యలోని అధికారుల ఆమోదం లేకుండానే విడుదలయ్యాయనే వార్త ప్రజాస్వామ్య ప్రియులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ కాలంలో జ్ఞానేష్‌కుమార్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలపై తోటి ఎన్నికల అధికారులు కనీసం పదునాలుగు సార్లు తమ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగంలోని మూడు వందల ఇరవై నాలుగో అధికరణం ప్రకారం.. ఎన్నికల సంఘం నిర్ణయాలు సాధ్యమైనంతవరకు ఏకాభిప్రాయంతో, లేదంటే కనీసం అత్యధిక సభ్యుల అంగీకారంతో జరగాలి. రాజ్యాంగం ఈ అధికారాలను 'సంఘానికి' ఇచ్చిందే తప్ప ఏ ఒక్క వ్యక్తికి కాదు. కానీ, రాజ్యాంగ నిబంధనలను పక్కనబెట్టి ఏకపక్షంగా వ్యవహరించడం వ్యవస్థల నిర్వీర్యానికి అద్దం పడుతోంది. అత్యంత ఆందోళనకరమైన విషయమేమి టంటే, ఓటర్ల జాబితా రూపకల్పన వంటి అత్యంత కీలకమైన పది నెలల కాలంలో ఏకంగా పన్నెండు కోట్ల మంది భారతీయులు ఓటర్ల జాబితాలో తమ స్థానాన్ని కోల్పోవడం. తగినంత నోటీసు లేకుండా, వివక్షపూరితంగా తమ పేర్లను తొలగించారని బాధి తులు, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి వెన్నెముక వంటిది. దానిలోని పారదర్శకతనే ప్రశ్నించే పరిస్థితి వస్తే, ఇక ఎన్నికల నిర్వహణలో నిష్పాక్షికత ఎక్కడ ఉంటుందనేది ప్రధానమైన ప్రశ్నగా మారుతుంది. ఇంతకీ ఈ జ్ఞానేష్ కుమార్ ఎవరు? ఆయన నేపథ్యం ఏమిటి? కేరళ విభాగానికి చెందిన ఉన్నతాధికారి అయిన జ్ఞానేష్ కుమార్ కాన్పూర్ సాంకేతిక విద్యాలయం నుండి పట్టా పొందారు. కేరళలో కాంగ్రెస్, వామపక్ష ప్రభుత్వాల హయాం లో అనేక కీలక శాఖల్లో పనిచేశారు. అనంతరం కేంద్ర పరిపాలనలోకి వచ్చి రక్షణ శాఖ, పార్లమెం టరీ వ్యవహారాల శాఖ, హోం శాఖలలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర హోంశాఖలో పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులలో ఆయన కీలక పాత్ర పోషించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగ నిబంధన రద్దు ప్రక్రియ లోనూ, రామ్ మందిర్ ట్రస్ట్ ప్రారంభ నియామకా ల్లోనూ, మరియు బహూరాష్ట్ర సహకార సంఘాల చట్ట సవరణల రూపకల్పనలోనూ ఆయన పాత్ర ప్రధానమైనది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన రెండు నెలల్లోపే ఆయనను ఎన్నికల అధికారిగా నియమించడం గమనార్హం. ఈ నియామకం వెనుక ఉన్న ప్రక్రియ మరింత వివాదాస్పదమైనది. గత నిబంధనలను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టం ప్రకారం...ఎన్నికల అధికారులను ఎంపిక చేసే ముగ్గురు సభ్యుల కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఆ స్థానంలో కేవలం ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ప్రతిపక్ష నేత మాత్రమే ఉంటారు. దీనివల్ల నియా మక ప్రక్రియలో పూర్తిస్థాయిలో ప్రభుత్వానిదే పైచేయి అవుతుందని, స్వతంత్రత దెబ్బతింటుం దని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసినప్పటికీ, ప్రభుత్వం తన నిర్ణయానికే కట్టుబడింది. మార్చిలో అధికారిగా ఉన్న అరుణ్ గోయల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడం, ఆ వెంటనే ఈ నూతన చట్టం కింద జ్ఞానేష్ కుమార్ నియామకం జరగడం అనేక అనుమానాలకు తావిచ్చింది. ఆయన కుటుంబ నేపథ్యం కూడా వివాదా లకు అతీతంగా ఏమీ లేదు. ఆయన కుమార్తె జిల్లా అధికారిగా ఉన్న సమయంలో ఒక విద్యార్థిని పై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నందుకు అలహాబాద్ కోర్టు తీవ్రంగా మందలించి.. ఐదు లక్షల రూపాయల జరిమానా విధించారు కూడా.. ఒకవైపు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని ప్రభుత్వం తన పరిపాలనా విభాగంగా మార్చుకుంటోందన్న విమర్శలు రావడం, మరో వైపు రాజ్యాంగం స్పష్టం చేసిన అధికరణం ప్రకా రం ఏకాభిప్రాయ నిర్ణయాలు జరగకపోవడం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు శుభసూచకం కాదు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నిష్పా క్షికంగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం పునరుద్ధరించబడుతుంది. దేశంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం సడలిపోతే రాజ్యాంగ వ్యవస్థకే తీవ్ర ముప్పుగా పరిణమిస్తుంది. ప్రతిపక్షాలు లేవ నెత్తుతున్న అభ్యంతరాలను, ఉన్నత న్యాయస్థానం గతంలో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎన్ని కల సంఘం తన పనితీరును సమీక్షించు కోవా ల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంఘం సభ్యుల మధ్య సమిష్టి నిర్ణయాధికారం పునరుద్ధరించబడి, ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత పాటిస్తేనే రాజ్యాంగ బద్ధమైన బాధ్యత నెరవేరుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వతంత్ర వ్యవస్థల పరిరక్షణే ఏకైక మార్గం.




**- వెంక గారి భూమయ్య**
9848559863

# గర్భ నిరోధంపై అవగాహన... ఆధునిక విధానాలు




ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం (World Contraception day) మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, యువతశక్తి, సమాజ అభివృద్ధి గురించి అవగాహన పెం పొం దించే ప్రధాన దినంగా గుర్తించబడింది. ఈ దినోత్సవం ప్రధానంగా గర్భనిరోధక పద్ధతుల సురక్షిత, సమర్థవంతమైన వినియోగం, వ్యక్తిగత మరియు జంట హక్కులపై దృష్టి సారించడం కోసం ఏర్పాటు చేయబడింది. గర్భనిరోధక పద్ధ తుల అవగాహన కేవలం వ్యక్తిగత సమస్యలకు పరిమితం కాకుండా సమాజం, దేశ స్థిరత్వానికి కూడా కీలకంగా ఉంది.

భారతదేశంలో కుటుంబ నియంత్రణకు సంబంధించిన అవగాహన ప్రాచీన కాలం నుంచే ఉంది. ఆయుర్వేద గ్రంథాలలో ఫర్టిలిటీ నియంత్రణ, మూలికల ఆధారిత గర్భనిరోధక పద్ధతులు వివరంగా వర్ణించబడ్డాయి.

మహాభారత, రామాయణ కాలంలో కూడా కుటుంబ పరిమాణాన్ని నియంత్రించడంలో వ్యక్తిగత బాధ్యత, సమాజ పరి మితుల ప్రాధాన్యం ప్రస్తావించ బడింది. 20వ శతాబ్దంలో, జనాభా విస్తరణ, మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం ప్రధాన సమస్యలుగా మారడంతో, అంతర్జాతీయంగా గర్భనిరోధక అవగాహనపై ప్రత్యేకదృష్టి సారించడం ప్రారంభమైంది. 2007లో InternationalPlannedParenthood Federation (IPPF) సెప్టెంబర్ 26ని ప్రపంచ గర్భ నిరోధక దినోత్సవంగా ప్రకటిం చింది.

గర్భనిరోధక పద్ధతులు మూడు ప్రధాన వర్గాల్లో విభజించవచ్చు. సంక్లిష్టత లేని పద్ధతులలో కండమ్, డయాఫ్రాగమ్, సర్వైంటైన్ ఉన్నాయి. ఇవి లైంగిక వ్యాధుల నుండి రక్షణ ఇచ్చే విధంగా, గర్భధారణను కూడా నివారిస్తాయి. హార్మోనల్ పద్ధతులలో గర్భ నిరోధక పిల్లు, ఇంజెక్షన్లు, ఇంప్లాంట్లు ముఖ్యమైనవి, ఇవి హార్మోన్ల మార్పుల ద్వారా గర్భసాధ్యాన్ని నిరోధిస్తాయి. ప్రకృతి ఆధారిత పద్ధతులలో ఫర్టిలిటీ అవేర్నెస్, చక్ర గణన, శరీర ఉష్ణోగ్రత పద్ధతులు ఉన్నాయి, వీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తే గర్భనిరోధకత సాధ్యమవుతుంది. గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలలో సుమారు 60 శాతం మంది సురక్షిత గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తారు, అయితే అభివృద్ధి చెందని కొన్ని దేశాల్లో ఈ సంఖ్య 30 శాతం కన్నా తక్కువ. భారత్‌లో స్త్రీలలో సుమారు 58 శాతం మంది మాత్రమే సురక్షిత గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. 2015లో ఇది 50 శాతం మాత్రమే ఉండటం, క్రమంగా మార్పు జరుగుతున్నదని సూచిస్తుంది.

గర్భనిరోధక పద్ధతుల వినియోగం మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, యువత ప్రగతికి కీలకంగా మారింది. అసురక్షిత గర్భ నిరోధకత, అనూహ్య గర్భస్రావాలు, గర్భపాతం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. పిల్లల సంఖ్యను నియంత్రించడం ద్వారా ప్రతి పిల్లకు సరైన పోషణ, విద్య, వైద్య సౌకర్యం లభిస్తుంది. అలాగే, కుటుంబ వ్యయం, వైద్య ఖర్చులు సమర్థవంతంగా విభజించవచ్చు. సురక్షిత గర్భనిరోధక పద్ధతులు యువతకు చదువు, కెరీర్ అవకాశాలను తగ్గకుండా పెంపొందిస్తాయి.

భారతదేశంలో కుటుంబ సంక్షేమ, గర్భనిరోధక అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కండమ్, ఇంప్లాంట్, శిక్షణా వర్క్‌షాప్‌లు అందించడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్, వైద్య పాఠశాలలు ద్వారా మహిళలు, యువతకు అవగాహన కల్పించ బడుతుంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల లోపలి విద్య, సాంప్రదాయ పరిమితుల కారణంగా అవగాహన ఇంకా తక్కువగా ఉంది. ఈ కారణంగా, తల్లితనం రేటు, బాలికల ఆరోగ్యం, మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్‌లు, సదస్సులు, సామాజిక మీడియా ప్రచారాలు, పబ్లిక్ క్యాంపెయిన్లు జరుగుతాయి. యువత, మహిళలు, కుటుంబాలు, వృద్ధులు, సర్వసాధారణ ప్రజలకు సులభంగా, స్పష్టంగా సమాచారం అందించడానికి కృషి జరుగుతుంది.

ఈ దినోత్సవం ద్వారా ప్రతి వ్యక్తికి అందించే ముఖ్య సందేశం... ప్రతి వ్యక్తి, ప్రతి జంట గర్భనిరోధక పద్ధతుల గురించి అవగాహన కలిగి, వాటిని సురక్షితంగా ఉపయోగించడం అనేది వారి హక్కు. ఇది మహిళా శక్తి, కుటుంబ సంక్షేమం, సమాజ అభివృద్ధికి మూలాధారం.

భారతీయ సాంప్రదాయంలో స్త్రీలకు, కుటుంబానికి, సమాజానికి ఉన్న హక్కులు, బాధ్యతల ఆధారంగా, సురక్షిత గర్భ నిరోధకత, మహిళా ఆరోగ్యం, పిల్లల పౌష్టికాహారం వంటి అంశాలు ప్రాచీన కాలం నుంచే గుర్తించబడ్డాయి. ఈ దినోత్సవం ఆధునిక సమాజంలో ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ప్రతిమహిళ, కుటుంబం, సమాజం కోసం అవగాహన, సంకల్పం పెంపొందిస్తుంది.

ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం కేవలం గుర్తింపు మాత్రమే కాదు. సురక్షిత, సమర్థవంతమైన, సులభంగా అందుబాటులో ఉండే గర్భనిరోధక పద్ధతులు సమాజానికి ప్రగతి, ఆరోగ్యం, మహిళా శక్తి, ఆర్థిక స్వావలంబన తీసుకొస్తాయి. ప్రతి వ్యక్తి ఈ హక్కును తెలుసుకొని, సురక్షితంగా ఉపయోగించాలి. తద్వారా భారతీయ సమాజం మరియు ప్రపంచ సమాజం ఆరోగ్యకరంగా, శక్తివంతంగా మారుతుంది.

**సెప్టెంబర్ 26... ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## ఆరబ్బ్..

ఆకాశమంతా నల్లని ముసుగేసిన వేళ!
కడలి పురిటి నొప్పుల్లా అల్పపీడనం
తీరంపై మహోగ్రంగా పడుతూ లేస్తూ
చేతులు చాచిన కల్లోల కెరటాలతో
జనసామాన్యాన్ని అతలాకుతలం చేసింది!
వాయుగుండం మహాగండమై
గాలీవానాతో కలిసి పూనకం తెచ్చుకొంటే
కళింగపట్నం కళింగయుద్ధమై
ఉత్తరాంధ్ర వెన్నువిరిగింది
మన్యం మసకబారింది

గోదారి గందరగోళమైపోయింది
రాలిన ఆశల పంటల ముందు
రైతు నిస్తేజమయ్యేడు
సంద్రం ఒడ్డునే బందీయైన పడవలు
మత్స్యకారుల కడుపులో ఆకలి సునామీ రేపాయ్
పడగలెత్తిన నదులు కాటేయడంతో
కూడూ గూడూ కొట్టుకుపోయి పేదరికం
దిక్కులేని పక్షిలా చలికి వణుకుతోంది!

ప్రకృతి కన్నెర్రజేస్తే..
ఆకాశానికీ భూమికీ యుద్ధమొచ్చినట్టే
చినుకు శరాలు భూమి గుండెల్ని ఛిద్రం చేస్తే
కడలి కెరటాలు మృత్యునాల్కలై ఎగసిపడతాయ్
జీవనపోరాటం నిల్చిపోయి..
జీవుల అస్తిత్వమే ఇగిరిపోతుంది..!

**- భీమవరపు పురుషోత్తమ్**
9949800253

# హౌస్ వైఫ్ లాగే, హౌస్ హస్బెండ్?



మారుతున్న కాలానికి అనుగుణంగా మనుషులు మారాలి, మనసులు మారాలిమారుతున్న కాలాన్ని ఆపలేం. కానీ ఆ మార్పును అర్థం చేసుకుని మన ఆలోచనలను మార్చుకోవచ్చు. ఒకప్పుడు బాల్యవివాహం సమాజంలో సాధారణం. వితంతు వివాహం ప్రశ్నార్థకం. స్త్రీలకు చదువెం దుకు? అన్నది సహజమైన ప్రశ్న. అదే సమాజం నేడు స్త్రీలు లేని రంగమేది? అని అడిగే స్థాయికి వచ్చింది. ఇది కేవలం కాలమార్పు కాదు, మనస్తత్వ పరిణామంఇప్పుడు కుటుంబ వ్యవస్థలో మరో మార్పును అర్థం చేసుకోవాల్సిన సమయం వచ్చింది. తిరువణ్ణామలైకి చెందిన వైద్య దంపతుల విడాకుల కేసును విచారించిన మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తులు జి.ఆర్. స్వామినాథన్, ఎం.డి. సుమతి, హౌస్ వైఫ్ ఉండగలిగినప్పుడు హౌస్ హజ్బెండ్ కూడా ఉండ వచ్చు. అది కొత్త సాధారణంగా మారాలి అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. గృహ నిర్వహణకు లింగభేదం లేదని, భార్యాభర్తల పాత్రలు మారుతున్న సామా జిక వాస్తవికతను గుర్తించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొందిఇది ఒక మాటగా తీసిపారేయాల్సిన వ్యాఖ్య కాదు. కుటుంబం, వివాహం, ఉద్యోగం, బాధ్యతలపై మనం ఇప్పటికీ మోస్తున్న పాత నిర్వచనాలను పునఃపరిశీలిం చాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోందిఒకప్పుడు పెళ్లి అంటే అమ్మాయి అత్తవారింటికి వెళ్లడం. భర్త సంపాదిం చడం, భార్య ఇంటిని చూసుకోవడం సంప్రదాయంగా ఏర్పడిన పాత్రలు. కానీ నేడు పరిస్థితులు మారాయి. మహిళలు వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు, వ్యాపారవేత్తలు, పైలట్లు, సైనికులుగా అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, వృత్తి ప్రాధాన్యం, వ్యక్తిగత నిర్ణయ స్వేచ్ఛ, ఇవన్నీ వారి జీవితంలో ముఖ్యమైన భాగాలయ్యాయిఅలాంటి సమయంలో ఉద్యోగం చేయాలంటే పెళ్లి వద్దు అనే పరిస్థితి ఏర్పడితే, పరిష్కారం మహిళల ఆశయాలను వెనక్కి నెట్టడం కాదు. కుటుంబ బాధ్యతలను ఇద్దరూ ఎలా పంచుకోవచ్చో ఆలోచించడం

ఇక్కడే హౌస్‌హజ్బెండ్ అనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. భార్య ఉద్యోగం చేస్తే భర్త ఇంటిని చూసుకోవడంలో తప్పేముంది? పిల్లల పెంపకం, వంట, ఇంటి నిర్వహణ, వృద్ధుల సంరక్షణ, ఇవి ఆడవారి పనులే అన్న భావన ఎందుకు ఉండాలి? ఇల్లు నడపడం కూడా బాధ్యతే. సంపాదనకు ఆర్థిక విలువ ఉన్నట్టే, ఇంటి నిర్వహణకు సామాజిక విలువ ఉంది. పనిస్వభావం ఆధారంగా గౌరవం మారకూడదు, లింగం ఆధారంగా మారకూడదు. ఇది మహిళల స్వాతంత్ర్యాన్ని తగ్గించే ఆలోచన కాదు. అందుకు విరుద్ధంగా, ఇద్దరి స్వేచ్ఛను గౌరవించే కుటుంబ వ్యవస్థకు దారి సుప్రీంకోర్టు తీర్పుల్లోనూ వివాహం మహిళ వ్యక్తిత్వాన్ని, స్వతంత్రతను చెరిపివేయదనే సూత్రం స్పష్టంగా కనిపిస్తుంది. వ్యక్తిగత ఎంపిక, గౌరవం, స్వయం నిర్ణయం, వృత్తి ఆశయాలకు రాజ్యాంగ విలువలు రక్షణ కల్పిస్తున్నాయని కోర్టు పలు సందర్భాల్లో పేర్కొంది

అందుకే రేపటి కుటుంబంలో అత్తవారిల్లు-మామగారిల్లు అనే సరిహద్దుల కంటే మన ఇల్లు అనే భావనే ముఖ్యం కావాలి. అవసరమైతే అమ్మాయి ఇంట్లో ఉండొచ్చు. అవసరమైతే అబ్బాయి అత్తవారింట్లో ఉండొచ్చు. భార్య సంపాదించొచ్చు. భర్త ఇంటిని చూసుకోవచ్చు. లేక ఇద్దరూ సంపాదిస్తూ, ఇద్దరూ ఇంటిని పంచుకోవచ్చుకాలం మారింది. కుటుంబం కూడా మారాలి.ఆడవారికి హక్కులు కావాలంటే మగవారికి బాధ్యతల ఎంపిక కూడా ఉండాలి.హౌస్ వైఫ్ కు గౌరవం ఉన్న సమాజంలో హౌస్ హజ్బెండ్ కూ అదే గౌరవం ఉండాలి. మనుషులు మారితేనే మనసులు మారతాయి. మనసులు మారితేనే సమాజం ముందుకు సాగుతుంది



**- కొలను వెంకటేశ్వర రెడ్డి**
9346995566

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం....
https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# సిరిసిల్ల సభను విజయవంతం చేయాలి

- అభివృద్ధి పనులు, రాజన్న ఆలయ విస్తరణపై ప్రజలకు వాస్తవాలు వివరించాలి
- ఎమ్మెల్యే పదవిని గెలిచిన రోజే ప్రజలకు అంకితం చేశా
- నాలుగు సార్లు ఓడిన ప్రజల మద్యే ఉన్నవిదేశాలకు పట్నం పారిపోలేదు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,సెప్టెంబర్25(మనం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పాల్గొననున్న భారీ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం వేములవాడ పట్టణంలో వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో దిశ నిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకున్న నాయకులు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి జన సమీకరణ చేపట్టాలని, నిర్ణయించిన సంఖ్యకు అదనంగా మరో పది మంది వచ్చేలా చూడాలని సూచించారు. జన సమీకరణపై మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కమిటీ కూడా సమీక్షించే అవకాశం ఉందని తెలిపారు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే సుమారు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తాజాగా మరో సుమారు రూ.250 కోట్లకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సిరిసిల్లకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరయ్యాయని చెప్పారు. కోనరావుపేటకు కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైనట్లు వివరించారు. ఇవన్నీ ఇప్పటికే కొనసాగుతున్న రూ.1,000 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు అదనమని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయానికి రూ.99.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రానున్న కాలంలో జిల్లాకు మరో రూ.400-500 కోట్ల మేర అదనపు అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఫొటోలు, ఆధారాలతో ప్రజలకు వివరించి, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారానికి వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. వేములవాడ నిర్మాణం చేసుకొని ఇటీవల ప్రారంభం చేసుకున్న బండ్ పార్క్ పై గతంలో హైదరాబాద్ ట్యాంక్బండ్ నిర్మాణంతో పోలుస్తూ సోషల్ మీడియాలో కొందరు పోస్టులు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రచారంపై వెంటనే వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో వేములవాడ రాజన్న ఆలయం ఎలా ఉందో, 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ఆలయ అభివృద్ధి ఎంతవరకు జరిగిందో ప్రజలు గమనించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాత ఆలయ నిర్మాణాన్ని, రాతితో నిర్మించిన మండపాన్ని ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా ఉంచుతున్నామని స్పష్టం చేశారు. ఆలయ విస్తరణలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతంలో అద్దాల మండపాలు, పిల్లర్లపై నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. పాత ఆలయాన్ని తొలగించడం లేదా మార్చడం లేదని తెలిపారు. 1975 వరకు ఆలయ శిఖరం శిలామయంగా ఉండేదని, ఆ తర్వాత ఇటుకతో నిర్మాణం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా శిలామయంగా శిఖరాన్ని నిర్మించే అవకాశం ఉందని, ఆగమ శాస్త్రం ప్రకారం సంబంధిత అనుమతులు తీసుకుని ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఆలయ నిర్మాణం, విస్తరణ విషయంలో భక్తులు, ప్రజలకు ఎలాంటి అపోహలు కలగకుండా వాస్తవాలను వివరించాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు.

## వినాయక నిమజ్జనోత్సవాలను పరిశీలించిన కలెక్టర్



- భక్తజన సందడి.. భారీ బందోబస్తు

**జగిత్యాల , సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి):** తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు జగిత్యాల జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద నిమజ్జనోత్సవాల తీరును జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. పట్టణంలో అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు చింతకుంట చెరువు వైపు తరలి వెళ్తున్నాయి.నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్గాలను పర్యవేక్షించడంతో పాటు నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చెరువు వద్ద నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, మున్సిపాలిటీలు, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయడంతో నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగుతున్నాయి . ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారని అన్నారు. భక్తి, ఉత్సాహం, క్రమశిక్షణతో సాగిన నిమజ్జనోత్సవాలతో జిల్లా మరోసారి గణేష్ ఉత్సవాల వైభవాన్ని చాటుతుందని అన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తహసీల్దార్ రామ్ మోహన్, సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

## గోరింటాకు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్పర్సన్



**జగిత్యాల సెప్టెంబర్ 25(మనం న్యూస్):** పట్టణంలోని 24వ వార్డు మార్కండేయ నగర్లో శివ హిందూ యూత్ ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై మహిళలతో కలిసి గోరింటాకు కార్యక్రమంలో పాల్గొన్నారు., ఈ సందర్భంగా మహిళలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సంప్రదాయాలను, మహిళల ఐక్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో కౌన్సిలర్ మానపురి పవిత్ర మహేష్ పాటు పలువురు మహిళలు, శివ హిందూ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ముగింపు ఉత్సవాలు శాంతి యుతంగా జరుపుకోవాలి

- విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- ఎన్నికల వరకు రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్దే లక్ష్యం
- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్ డి ఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘం అదనపు కార్యాలయాన్ని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ గారితో కలిసి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. యూఐడీఎఫ్ నిధులు రూ.62.5 కోట్లతో జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులకు రూ.కోటికి తక్కువ కాకుండా నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి మాత్రం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొందరు కావాలనే జగిత్యాల అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### ప్రజలు వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు, కార్యక్రమాలు నిర్వహించి మన సంస్కృతి, సంప్రదాయాలను ఆదర్శంగా నిలపాలని ఎమ్మెల్యే సూచించారు.

మన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు వేయడం, ఇష్టారీతిన వ్యవహరించడం తగదని, ఇలాంటి చర్యలను పూర్తిగా ఖండిస్తున్నానని తెలిపారు. ప్రజలు శాంతిభద్రతలకు భంగం కలగకుండా వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

### విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం

119 కోట్ల తో జగిత్యాల మెడికల్ కళాశాల పనులు వేగంగా పూర్తవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో 14కోట్లు మంజూరు కాగా ఈ ప్రభుత్వం పూర్తి నిధులు కేటాయించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ.9 కోట్లు చెల్లించగా, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మరో రూ.9 కోట్ల నిధుల మంజూరు తో మిగిలిన రోడ్లు, డ్రైనేజీ పనుల పూర్తికి అవసరమవుతాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మోరపల్లి, తాటిపల్లి, చలిగల్ శివారుల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా 2,500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రూ.235 కోట్లతో 400కు పైగా పడకల సామర్థ్యంతో జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం ఉంటుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. నాయి బ్రాహ్మణుల సెలూన్ లకు ఉచిత విద్యుత్తో పాటు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రజల సహకారంతో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య కౌన్సిలర్ వేముల శ్రీనివాస్,సంఘం అధ్యక్షులు పెండెం మహేందర్ , టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, కౌన్సిలర్ మ్యానపురి మహేష్, రాచర్ల విజయ్, మాజీ కౌన్సిలర్ ముస్కు నారాయణ రెడ్డి, మానాల కిషన్, ఎనగందుల శ్రవణ్, రాకేష్, తొలిప్రేమ శ్రీనివాస్, శరత్ రావు, పవన్, వేణు, పాలోజి సత్యం, మహేష్, సంఘం సభ్యులు గంగిపెల్లి గంగవ్వ, రాజేశం, శంకర్, గంగరాజం, రాచమల్ల శ్రీనివాస్, మర్రిపెల్లి సాగర్, రాచర్ల శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘ సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత

- మాజీ సెక్రటరీ మామిడాల అశోక్ కుమార్ మృతికి సంతాపం
- సర్వ సభ్య సమావేశంలో మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్




**మంథని సెప్టెంబర్25 (మనం న్యూస్):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.,మంథని కార్యాలయంలో 89 సర్వ సభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సభ్యులు,రైతులకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు.సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు,దీర్ఘకాలిక రుణాలు,ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి వివిధ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.రైతులకు సకాలంలో అవసరమైన సహకారం అందిస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సహకార సంఘం అభివృద్ధి చెందితే సభ్యులు, రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని, అందుకు పాలకవర్గం, సిబ్బంది,సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సంఘం ద్వారా గత రబీ సీజన్ లో ఎక్కడ లేని విధంగా అత్యధికంగా 36 కేంద్రాలు నిర్వహించి 5,05,585 క్వింటాల్ల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలో, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామని అన్నారు.అంతే కాకుండా ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్,సహకార అధికారి సహకారం తో గుంజపడుగు శివారులో రూ.3.40 కోట్లతో పిఎం కుసుమ్ ద్వారా సౌర విద్యుత్ నుప్రోత్సహించేందుకు సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. తద్వారా సంఘానికి రూ.51 లక్షల ఆదాయం సమకూరనుందని అన్నారు.ఈ సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు,గోనె సంచుల సమస్య రాకుండా తగు చర్యలు చేపడుతున్నామని, ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లలకు తరలించేలా తగు పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో పూర్తి జవాబుదారి తనంగా వ్యవహరిస్తామని, రైతుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపడుతామని అన్నారు.గత సీజన్ లో జరిగిన ఇబ్బందులు మళ్ళి పునరావుతం కాకుండా చూసుకుంటామని అన్నారు.ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో రైతుల కు ధాన్యంలో ఎలాంటి కోతలు లేకుండా కొనుగోళ్ళు చేపడుతున్నామని అన్నారు టీజీఈఆర్సి సలహాదారు శశి భూషణ్ కాచే మాట్లాడుతూ స్వాతంత్ర్య,సహకార ఉద్యమ కాలంలో కొంత మంది వ్యక్తులు తమ ఆస్తులు, డబ్బులు దారాదత్తం చేసి సంస్థలను కాపాడుకున్నారని అన్నారు.కరీంనగర్ జిల్లాలో మెట్ పల్లి, వావిలాల చేనేత సహకార సంఘాలు కాల గమనంలో నిర్వహణ లోపాల మూలంగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్,డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి వారు చేపట్టిన రుణ మాఫి లాంటి సంస్కరణల వల్ల రైతుల రుణాలు మాఫీ అయ్యాయని, సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రూ.5 వేల ఇన్సెంటివ్ అందిచారని గుర్తు చేశారు.తద్వారా రైతులకు ఆర్థిక భరోసా అందటంతో పాటు సంఘాలు ఆర్థికంగా నిలదొక్కు గలిగాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య సంఘ జమ ఖర్చులు పట్టిక చదివి వినిపించారు.అలాగే సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సమాధానాలు ఇచ్చారు.ముందుగా సంఘ మాజీ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ అకాల మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.ఈ సమావేశంలో సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాపు,పెద్దిరాజు ప్రభాకర్,రావికంటి సతీష్ కుమార్, సిరిమూర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్,దాసరి లక్ష్మి-మొండయ్య, ఉడుత మాధవి - పర్వతాల్ యాదవ్, దేవల్ల విజయ్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, సర్పంచులు తోటపల్లి పోచయ్య,సంగెం సరోజన-గట్టయ్య, న్యాతరిలతా-శ్రీనివాస్,గుమ్మడి సమ్మయ్య, సంధ్య-భానేష్,జాడి రామస్వామి,మాజీ ఎంపిపి కొండ శంకర్, సంఘ మాజీ డైరెక్టర్ ఇనుముల సతీష్, నాయకులు బెజ్జంకి డిగంబర్,వేల్పుల గట్టయ్య,తిరుపతి, సబ్బని సంతోష్,పెద్ద సంఖ్యలో సభ్యులు, రైతులు,సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారఖ్ పరీక్షకు పకడ్బందీగా సిద్ధం కావాలి

- ప్రతి సబ్జెక్టు,సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**మంథని,సెప్టెంబర్25(మనం న్యూస్):** పారఖ్ పరీక్షను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ఇప్పటి నుంచే పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ ఎండీ షేక్ అంజద్ ఉపాధ్యాయులకు సూచించారు. మంథని మండలంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆయన హాజరై పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు,విద్యార్థుల అభ్యసన స్థాయి,రెమిడీయేషన్ కార్యక్రమం, 2027లో నిర్వహించనున్న పారఖ్ పరీక్షకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు.



విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంపొందించేందుకు బోధనలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులోని ప్రతి సామర్థ్యాన్ని గుర్తించి, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన కొనసాగించాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రెమిడీయేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ఎంతవరకు అర్థం చేసుకున్నారో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,అవసరమైన చోట అదనపు బోధన అందించాలని సూచించారు.దేశవ్యాప్తంగా నిర్వహించే విద్యా సర్వేలో పెద్దపల్లి జిల్లా టాప్-50లో నిలిచేలా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు బోధించే విషయంలో ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛ ఉందని,తమ జ్ఞానం,అనుభవాన్ని ఉపయోగించి బోధనా పద్ధతులను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉదాహరణలు,కార్యకలాపాల ద్వారా బోధించాలని తెలిపారు.విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అందించే సేవ ఎంతో కీలకమని ఎండీ షేక్ అంజద్ పేర్కొన్నారు. బోధనలో ఉపాధ్యాయులు ఎలాంటి ఒత్తిడికి గురికావాల్సిన అవసరం లేదని, విద్యార్థుల అభ్యసనలో నాణ్యత పెంచడంపైనే ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారాలు,ప్రోత్సాహం అందిస్తూ జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నారని తెలిపారు.సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొని పారఖ్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, రెమిడీయేషన్ కార్యక్రమం అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల/ భీమారం , సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి):** భీమారం మండలంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజలింగంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను పరిశీలించి, పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం భీమారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, భవనం నాణ్యత, మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అనుకూలంగా, సురక్షితమైన వాతావరణం కల్పించే విధంగా అంగన్వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ వసంత, ఇంజనీర్ శాఖ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల తరలింపు చారిత్రక తప్పిదం

### విద్యాభివృద్ధిలో తిరోగమన చర్య...

### విద్యార్థి యువత వ్యవస్థాపద్యక్షుడు కొండేల మారుతి

**మంథని, సెప్టెంబర్25 (మనం న్యూస్):** 46 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తరలించడం చారిత్రక తప్పిదమని,ఇది విద్యాభివృద్ధిలో తిరోగమన చర్య అని విద్యావేత్తలు,పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి అన్నారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1981 నవంబర్16న ప్రారంభిం చబడిన ఈ కళాశాల అభివృద్ధి పట్ల నాయకులు విఫలమయ్యారనడానికి అనేక నిదర్శనాలు ఉన్నాయని.45 సంవత్సరాలుగా ఇక్కడ చదువుకున్న విద్యార్థులు,సిబ్బంది అనేక సమస్యలను భరిస్తూనే,సహనంతో కళాశాల అభివృద్ధి చెందుతుందనే విశ్వాసంతో ఉన్నారు.కానీ ఇటీవల తరలింపు నిర్ణయంతో ఆ ఆశలు పటాపంచలయ్యాయని.తొలినాళ్లలో జూనియర్ కళాశాలలో ప్రారంభమైన డిగ్రీ కళాశాల,క్లాస్ రూముల కొరత, జూనియర్ కళాశాల యాజమాన్య అభ్యంతరాలతో పరీక్షల నిర్వహణలో దృష్టి వైషమ్యాలు పెరిగి గొడవలకు దారితీసిన సందర్భాలు ఉన్నాయన్నారు. 1983లో వరదలు తారాస్థాయికి చేరినప్పుడు,అప్పటి కళాశాల వసతి దుస్థితిని జిల్లా కలెక్టర్ కు నివేదించి,వరద బాధితుల శరణాలయం కోసం నిర్మించిన గదులను కళాశాలకు ఇవ్వాలని విన్నవించగా,ఆయన కరుణించి మంజూరు చేసిన గదులలోనే 33 సంవత్సరాల పాటు ఈ విద్యాలయం నెట్టుకొచ్చిందన్నారు అనంతరం 2012లో మంథని నుండి మల్లెపల్లి శివారులో సొంత భూమిలో,సొంత భవనంలోకి మారిన ఈ కళాశాల, న్యాక్ టీం పరిశీలనలో బి గ్రేడ్ సాధించి,అభివృద్ధికి సరిపడే నిధుల మంజూరుకు సిఫార్సు చేయబడింది. రెండు విడతల గ్రీన్ ఛానల్ క్లియరెన్స్ కూడా లభించింది.నాయకుల హామీలేవని అయన ప్రశ్నించారు

సొంత భూమిలో,సొంత భవనంలో రెపరెపలాడుతున్న ఈ కళాశాలను ఇప్పుడు తరలించడం ఎవరి కోసమో అర్థం కావడం లేదని విద్యాభిమానులు ప్రశ్నిస్తున్నారని, మంథని శాసనసభ్యులు శ్రీధర్ బాబు కళాశాలను సందర్శించిన సందర్భంగా'మా ప్రభుత్వం వస్తే ఇక్కడ డిగ్రీ కళాశాలతో పాటు పీజీ కాలేజీ కూడా ఏర్పాటు చేస్తాం'అని బహిరంగంగా హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు.కళాశాల తరలింపు వల్ల ప్రస్తుత క్యాంపస్ అసాంఘిక కార్యకలాపాలకు,జల్సారాయుళ్ల చీకటి సామ్రాజ్యంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1979లో అప్పటి విద్యార్థి యువత రెండేళ్ల పోరాటం,వంద రోజుల నిరాహార దీక్షలు,నిరసన ప్రదర్శనలు,తరగతుల బహిష్కరణ,ఎక్సైజ్ కాంట్రాక్టర్ల ఆర్థిక సహకారంతో సాధించుకున్న ఈ డిగ్రీ కళాశాలను కాపాడుకోవడానికి, ఆనాటి కంటే పదింతల ఉధృతంగా, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమై అవిశ్రాంత పోరాటం చేస్తామని పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు హెచ్చరిస్తున్నారు. మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరలింపును అడ్డుకోవడానికి, కళాశాల పరిరక్షణే లక్ష్యంగా విద్యాభిమానులందరినీ ఏకం చేస్తూ డిగ్రీ కళాశాల సంరక్షణ మండలిని సత్వరమే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.ఇది కేవలం ఒక సంస్థగా కాకుండా, విద్యాభిమానుల సన్నిధికి ప్రతీకగా, ఐక్యతకు పతాకగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియలో సత్ఫలితాలు సాధించే దిశగా అన్ని వర్గాల వారిని,పూర్వ విద్యార్థులను, మేధావులను,ప్రజా సంఘాలను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు.ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా,పారదర్శక విధి విధానాలతో,కేవలం విద్యా ప్రయోజనాల కోసమే ఈ మండలి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# ప్రతి చిన్నారికి పౌష్టికాహారం అందాలి

- అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- తల్లులు, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 25 మనం ప్రతినిధి:** పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు బంగారు భవితకు బాటలు వేయవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. 9వ పోషణ మాసం సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన అంగన్వాడీ-మన బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోషణపై అవగాహన కార్యక్రమాలు ఒక నెలకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలు అంగన్వాడీ కేంద్రాల కు క్రమం తప్పకుండా తీసుకువెళ్లాలని తల్లులకు సూచించారు . అంగన్వాడీసేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు తల్లిదండ్రులు ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువును నమోదు చేయించి, వారి ఎదుగుదలకు అనుగుణంగా అవసరమైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, అక్కడ పౌష్టికాహారంతో పాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా ప్రాథమిక విద్య అందిస్తున్నట్లు తెలిపారు. బాలామృతంతో పాటు ఇతర పౌష్టికాహారాన్ని కూడా పిల్లలకు అందించాలని, తీవ్రమైన, మధ్యస్థ పోషకాహార లోపం, తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. సూపర్వైజర్లు, సీడీపీఓలు తమ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.

**చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి**

తెలంగాణను మిల్లెట్స్ ఫుడ్ స్టేట్గా పిలుస్తారని కలెక్టర్ తెలిపారు . పోషక విలువలు అధికంగా ఉండే చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కూరగాయలు, ఆకుకూరలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయధాన్యాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు, మహిళలు వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పౌష్టికాహార ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, బియ్యం సరఫరా తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బియ్యం, పౌష్టికాహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.జి ల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల భవనాల స్థితిగతులను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ నిర్వహణ, సరఫరాల్లో లోపాలు, ఇతర సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలకు బేబీ వెయింగ్ మిషన్లను పంపిణీ చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పోషణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు, వినికిడి లేదా మాట సమస్యలు, నడకలో ఇబ్బందులు, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడు సంబంధిత సమస్యలు, రక్తహీనత లేదా పోషకాహార లోపాలను గుర్తించిన వెంటనే అంగన్వాడీ సిబ్బందికి సమాచారం అందించి, అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏరియా ఆసుపత్రుల్లో అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పోషణ మాసం లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, జిల్లా వైద్యాధికారిణి లలితాదేవి, ఐసీడీఎస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ గడ్డలో ఘనంగా గణపతి పల్లకి సేవ



- పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- శ్రీ సిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధల మధ్య ముగిసిన బ్రహ్మోత్సవాలు

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి దేవాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం సాయంత్రం నిర్వహించిన స్వామివారి పల్లకి సేవ, రథయాత్ర కార్యక్రమాల్లో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సిద్ధి గణపతి స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ గడ్డ దేవాలయాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే రాజగోపురాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, సాలహారం పనులు సైతం త్వరలో పూర్తికానున్నాయని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 11 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ నిర్వాహకులు, పురోహితులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా ఆలయ పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భక్తులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పల్లకి సేవ, రథయాత్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి



- డిసెంబర్ 1,2 తేదీలలో ఆక్యుపై ఢిల్లీని జయప్రదం చేయండి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్

**గజ్వేల్, సెప్టెంబర్ 25 మనం న్యూస్:** కేంద్ర ప్రభుత్వ కార్మిక కార్మిక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడులను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని ఆర్ ఎం ఎల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో డిసెంబర్ 1,2 తేదీలలో జరుగు ఆక్యుపై ఢిల్లీ వాలంటీర్లను ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడులను తెచ్చిందని, వీటిని రద్దు చేసే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారి కాలంలో, మరియు స్వాతంత్రానంతరం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని అన్నారు. భారత కార్మికవర్గంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుందని, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టే విధంగా కోడులు తయారు చేశారని అన్నారు. కార్మిక శాఖ, ఫ్యాక్టరీ తనిఖీల శాఖ, అధికారుల పర్యవేక్షణ తొలగించిందని, కార్మికుల భద్రతకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. పరిశ్రమలో రెగ్యులర్గా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు, కాంట్రాక్టు, నీము, ఇతర పథకాల ద్వారా పరిశ్రమలలో కార్మికులను నియమించుకుని ద్వారా ఉత్పత్తులు చేయించుకునే విధంగా చట్టాలు మార్చారని అన్నారు కార్మిక సంక్షేమం, భద్రత అంశాలను తొలగించడం జరిగిందని అన్నారు . కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతుందని అన్నారు నిత్యావసర సరుకుల ధరలు అరికట్టడంలో విఫలమైందని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచిందని, తాజాగా యూపీఐ చార్జీలు వేసే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. కరెంటు చార్జీలు వసూలు చేసే విధంగా రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తుందని సాధారణ ప్రజలను ఆర్థిక వేధింపులకు గురిచేస్తుంది అని అన్నారు సిఐటియు ఆధ్వర్యంలో డిసెంబర్1,2 తేదీలలో చలో ఆక్యుపై ఢిల్లీ కార్యక్రమాలు జయప్రదం చేయాలని కార్మికవర్గం భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, ఆర్ ఎం ఎల్ యూనియన్ నాయకత్వం వేణుగోపాల్ బిక్షపతి బండ్ల స్వామి చంద్రశేఖర్ రెడ్డి వెంకట్రావు రవికుమార్ రంగారెడ్డి రాజగోపాల్ స్వామి మల్లయ్య విమల పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితలకు ఆర్థిక చేయూత

- వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ అండ
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.35.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు చెందిన 83 మంది లబ్ధిదారులకు రూ.35 లక్షల 30 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర వైద్య పరిస్థితుల్లో చికిత్స ఖర్చులను భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక పరిస్థితులతో వైద్యం విషయంలో ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అర్హులైన వారికి సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని జీఎంఆర్ తెలిపారు. వైద్య చికిత్సకు సంబంధించిన సహాయం అవసరమైన వారు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీకాంత్ బాలరాజు, వెంకటేష్, హమీద్, మధు తదితరులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భూ బాధితులకు సహాయమందేలా చూస్తాం

- జిల్లా కలెక్టర్ హైమావతి



**గజ్వేల్ సెప్టెంబర్ 25 మనం న్యూస్:** కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన ఆయా గ్రామాల నిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం ఆర్ అండ్ ఆర్ కాలనీ మరియు గజ్వేల్ పట్టణంలో ముట్రాజ్ పల్లి పరిధిలోగల మల్లన్న సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ లను మరియు ములుగు మండలం కొండపోచమ్మ సాగర్ నిర్వాసితుల సమస్యలను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ లకు అర్ అండ్ ఆర్ కాలనీల సమస్యలు చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్నాయని, నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు, ఇతర పెండింగ్ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, వీటికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధించిన బడ్జెట్ మంజూరు కాగానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాలు అర్హత మేరకు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కొండపోచమ్మ సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో చెరువు పక్కన నిర్మాణం చేపడుతున్నారని చెరువు యొక్క ఎఫ్ టి ఎల్ బౌండరీ లు ఫిక్స్ చెయ్యాలని, దీనికి ఆనుకొని ప్లాట్స్ చెయ్యకూడదని ములుగు తహసిల్దార్ ను ఆదేశించారు. అర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితుల పునరావాసం కోసం భూ సేకరణ చేసి ఎవ్వరికి కేటాయించకుండా, ఎలాంటి నిర్మాణం చేపట్టని భూములను వెంటనే అధీనంలోకి తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇట్టి స్థలాలు ఆక్రమణకు, మరియు ఎలాంటి పంటలు వెయ్యకుండా ఎల్లప్పుడూ పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఆయా మండల తహశీల్దార్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా అర్ అండ్ ఆర్ కాలనీల నిర్వాహకులు రాజనర్సింహారెడ్డితో పాటు పాల్గొన్నారు.

## పాలకులెవరైనా పాలమూరుకు అన్యాయమే



**కృష్ణానది జలాల్లో పాలమూరు వాటా తేల్చండి**
**ప్రభుత్వం హామీలకే పరిమితం కాకుండా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి**
**డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను నిలిపివేయాలి**
**పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఈనెల 27న పాదయాత్ర**
**పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి**

**కల్వకుర్తి, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** పాలమూరు ప్రాంతంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి,కన్వీనర్ రాఘవాచారి, కేఎల్ ఐ సాధన జేఏసీ అధ్యక్షుడు బండెల రామచంద్ర రెడ్డి, పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలమూరు ప్రాంతానికి రావాల్సిన కృష్ణా జలాల వాటాపై స్పష్టత ఇవ్వకుండా, పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. పాలమూరు ప్రజల సాగు,తాగునీటి అవసరాలను తీర్చే ప్రాజెక్టులు ఏళ్లుగా పెండింగ్లో ఉన్నాయని మండిపడ్డారు.ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం కాకుండా,ఆయా ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిలిపివేయాలని, పాలమూరు ప్రాంత ప్రయోజనాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువలతో పాటు ఇతర పెండింగ్ పనులను పూర్తి చేస్తే వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.కృష్ణానదీ జలాల్లో పాలమూరు ప్రాంతానికి ఉన్న వాటాను తేల్చి,స్థానిక అవసరాలకు అనుగుణంగా నీటిని వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే జేఏసీ ఆధ్వర్యంలో మరింత విస్తృత స్థాయిలో ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

**పాలకులెవరైనా పాలమూరుకు అన్యాయమే**

ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర తెలంగాణ విభేదాలతో,నేడు స్వరాష్ట్రంలో ఉత్తర,దక్షిణ తెలంగాణ చిన్న చూపుతో పాలమూరుకు అన్యాయం జరుగుతుందని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టులు పెట్టి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ త్వరితగతిన పూర్తి చేయడం పట్ల పాలకులకు పాలమూరు పైన ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతు oదోనని వారు అన్నారు.పాలమూరు పొలాలు కాలువల్లో పోతూ ఉంటే నీళ్లు మాత్రం నల్లగొండ జిల్లాకు తరలి వెళ్తున్నాయని పేర్కొన్నారు.

**పాదయాత్రకు సన్నాహాలు...**

పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం ఈనెల 27న నిర్వహించనున్న పాదయాత్రలో రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ సభ్యులు లింగస్వామి, కానుగుల జంగయ్య, అడ్వకేట్ వెంకట్గౌడ్, వెంకటేశ్వర్లు,సదానందం గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**తిరుమలగిరి, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలోని శౌబుని చెరువు నిండుకుండల నీరుతో నిండి అలుగు పోస్తున్న సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ కొమ్ము సోమన్న ఆధ్వర్యంలో చెరువులో గంగమ్మ తల్లికి పసుపు కుంకుమ గాజులను శుక్రవారం గంగమ్మ ఒడిలోకి సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము సోమన్న మాట్లాడుతూ గంగమ్మ తల్లి మత్స్య కార్మికుల్ని, రైతులను, గ్రామ ప్రజలను మా గ్రామాన్ని ఎల్లప్పుడు సల్లగా చూడాలని కోరుతూ ఘనంగా పూజలు సమర్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బై బై గణేశా..



**గంగమ్మ ఒడికి లంబోదరుడు**
**అంగరంగా వైభవంగా గణేష్ శోభాయాత్ర**



హైదరాబాద్, సెప్టెంబర్ 25(మనంన్యూస్) : పటాన్ చేరులో శ్రీవిఘ్నేశ్వర స్వామికి భారీ ఊరేగింపుతో చిన్నారులు శిరస్సున మోస్తూ శోభాయాత్ర నిర్వహించారు, బీజేపీ జిల్లా మహిళా మోర్చా కొల్లోల సుజాత కోర్వి సాయి చందు ముధిరాజ్, అధ్యక్షులు టీమ్ రుద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగరంగా వైభవంగా లడ్డూ వేలంపాట, గణేష్శోభయాత్ర నిర్వహించారు. మొదటి లడ్డు రూ. 41,000 కృష్ణ , రెండవ లడ్డు రూ. 39,001 అబ్దుల్ ఖదీర్, మూడోవ లడ్డు రూ. 56,666 సన్నీ కుమార్ కైవసం చేసుకున్నారు, మూడు లడ్డులా వేలంలో ఈసారి మొత్తం రూ. 1,36,667/- రికార్డు నమోదైంది. విఘ్నేశ్వర స్వామికి పూజలు తరువత లడ్డు వెలంపట తదుపరి శ్రీ విఘ్నేశ్వర స్వామికి శోభాయాత్ర లో విద్యుత్ అలంకరణ నృత్యాల తో యువకులు చిన్నారులు మహిళలు బతకమ్మ పాటలతో శోభాయాత్రలో పలుగొన్నరు. ఈ ఆధ్యాత్మిక శోభాయాత్ర భారీ గణపయ్య భక్తజనులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పటాన్చెరు లోని సాయి చెరువులో శ్రీ మహా గణపయ్య ను గంగమ్మ వాడికి చేర్చారు. గణేష్ శోభాయాత్ర మరియు నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం, పోలీస్ శాఖ, మరియు ఎఏఇ సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని మైక్ లో సూచనలు మరియు దగ్గరుండీ నిమజ్జనంలో పోలీస్ వారు శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సిబంది కృతజ్ఞతలు తెలుపుతున్న స్వాములు.. కోర్వి . సాయి చందు ముధిరాజ్, టీమ్ రుద్ర యూత్ అసోసియేషన్, పటాన్చెరు అధ్యక్షులు.. మరియు 30 మంది గణేశుని భక్తులు ఇందులో అందరూ ఉన్నారు వారు వీలు కాదు మనం అందరమూ ఒకటే అన్నారు సాయి.. స్వతంత్ర కాలంలో ఎలా ఉండాలో వీరిని చూసి నేర్చుకోవాలి 12.సం బంధం జై భోలో గణేష్ మహారాజ్ కి జై అనే బంధం అదే నినాదం.

ఈ ఆధ్యాత్మిక శోభ యాత్రలో చిట్ల, శివ కుమార్ ముదిరాజ్ పి ఆర్ మీడియా సంచాలకులు, గౌతంనగర్ బిజెపి బూత్ అధ్యక్షులుకుందన్ ముదిరాజ్, హైదరాబాద్ పెన్సిల్ ఆర్టిస్ట్ చిట్ల కార్తీక్ ముదిరాజ్, చందు ముధిరాజ్, మని, ముఖేష్ ముధిరాజ్ , నాగసాని జగదీష్ ముదిరాజ్, రిషి కుమార్ ముధిరాజ్ , సాయి కుమార్ ముధిరాజ్ , సన్నీ కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో గులాబీ జెండా ఎగరెయ్యాలి

- కష్టపడే కార్యకర్తకు గుర్తింపు..
- ప్రజా సమస్యలపై పోరాడాలి
- బడే నాగజ్యోతి



**ములుగు, సెప్టెంబర్ 25,మనం ప్రతినిధి:** పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తించి అండగా నిలుస్తామని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండాలని కార్యకర్తలకు సూచించారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ములుగు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల తాజా మాజీ అధ్యక్షుడు సనికొమ్ము రమేష్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి నాగజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలు, గ్రామస్థాయి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆమె కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలన్నారు. ములుగు నియోజకవర్గంలో మూడేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని నాగజ్యోతి డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా, 22-ఏ భూముల అంశంపై ప్రభుత్వ తీరును ఆమె విమర్శించారు. రాబోయే పార్టీ కమిటీల్లో యువతకు ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల పార్టీ అధ్యక్షుడు సనికొమ్ము రమేష్రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ మురళి, సర్పంచులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి

పాలేరు వరద నీటిని గ్రామాల చెరువులకు మళ్లిస్తున్నాం

అల్పపీడనం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంతో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలోని చెరువుల్లో 25 నుంచి 30 శాతం నీటి నిల్వలు అదనపు నీటితో మరింత నీటిని నింపేలా చర్యలు

పాలేరు రిజర్వాయర్లో నీటి మట్టం, కాలువల ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహాన్ని, అలుగును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, సెప్టెంబర్ 25(మనం బ్యూరో):** ఎగువ ప్రాంతాల నుంచి పాలేరు జలాశయానికి వస్తున్న వరద నీటిని జిల్లాలోని చెరువులకు మళ్లిస్తూ, నీటిని వృథా కాకుండా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గం లోని పలు మండలాలలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయాన్ని కలెక్టర్ సందర్శించి, రిజర్వాయర్లో నీటి మట్టం, కాలువల ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహం, అలుగు వద్ద నీటి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులను, కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని అధికారులు తమ తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని పలు చెరువుల్లో 25 నుంచి 30 శాతం వరకు నీరు చేరిందని కలెక్టర్ తెలిపారు. పాలేరు జలాశయానికి చేరుతున్న అదనపు నీటిని కూడా ప్రణాళికాబద్ధంగా జిల్లాలోని చెరువులకు మళ్లిస్తున్నామని చెప్పారు. సాగర్ ఎడమ కాలువ, పాలేరు పాతకాలువ, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, మంచుకొండ ఎత్తిపోతల పథకంతో పాటు జిల్లాలోని ఇతర ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి, అవసరమైన ప్రాంతాలకు నీటిని తరలించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

పాలేరు రిజర్వాయర్లో నీటి నిల్వలను నిర్దేశిత స్థాయిలకు అనుగుణంగా నిర్వహిస్తూ, అదనపు నీటిని చెరువులకు మళ్లించే కార్యాచరణను ఇప్పటికే రూపొందించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత నీటి ప్రవాహాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని చెరువుల నీటి నిల్వలను పెంచేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పాలేరు రిజర్వాయర్ ద్వారా చెరువులను నింపే అవకాశం ఉందని, నీటి లభ్యత, ప్రవాహం, స్థానిక పరిస్థితుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో నీటి వనరులను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ, భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని రాబోయే సద్వినియోగం చేసుకునేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

అల్పపీడనం నేపథ్యంలో జిల్లాలోని మండల స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు తమ పరిధిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, నీరు నిలిచే ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పునరావాస కేంద్రాలను గుర్తించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతానికి వర్షాల ప్రభావం పెద్దగా ఇబ్బందులు కలిగించనప్పటికీ, వాతావరణ హెచ్చరికలు పూర్తిగా ముగిసే వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాలు, వరదల పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రెండురోజుల నుండి కురిసిన వర్షాల వలన పత్తి, మిర్చి, వరి తదితర పంటలు సాగు చేసిన రైతులకు కొంత ఉపశమనం కలిగించాయని కలెక్టర్ తెలిపారు. అయితే వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్లో వ్యవసాయ రంగంలో పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లోనూ మారుతున్న వర్షపాత పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వర్షపాత పరిస్థితులు, నేల స్వభావం ఆధారంగా పంటల ఎంపికపై వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పాలేరు జలాశయానికి వస్తున్న నీటి ప్రవాహం, రిజర్వాయర్లో నీటి మట్టం, కాలువల ద్వారా విడుదలవుతున్న నీటి స్థాయిలను పరిశీలించేందుకే క్షేత్రస్థాయిలో పర్యటించామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన నీటిని సాధ్యమైనంత సమర్థవంతంగా వినియోగించుకునేలా అవసరమైన నిర్ణయాలు తీసుకున్నామని, చెరువులకు నీటిని మళ్లించే ప్రక్రియను అధికారులు సమన్వయంతో కొనసాగిస్తున్నారని వివరించారు. పాలేరు జలాశయంలో నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సాగునీరు, తాగునీటి అవసరాలు, చెరువుల నింపుదల వంటి అంశాలను సమన్వయంతో నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం కామంచికల్, నేలకొండపల్లి మండలం కొంగర, కూసుమంచి మండలం ఈశ్వర మాధారం గ్రామంలలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పరాస్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వేయర్ ఏడీ రాజేందర్, డీఈఈ రమేశ్ రెడ్డి, కూసుమంచి తహసీల్దార్ సైదులు, నేలకొండపల్లి తహసీల్దార్ రాంప్రసాద్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ వినేంద్రర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ లు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

---

## గోదావరి వరద పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలి

### క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25 (మనంప్రతినిధి):** జిల్లాలో వర్షాలు, గోదావరి వరద పరిస్థితిపై జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షపాతం, గోదావరి నీటిమట్టం, రహదారులు, వంతెనలు, పాఠశాలలు, పంటలు, ఇళ్ల నష్టంపై మండలాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాణహిత నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం నీటిమట్టం 25 నుంచి 30 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, సిబ్బంది విధులను పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని పాత వంతెనలు, కల్వర్టులు, రహదారులను పరిశీలించి ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ములకలపల్లి వద్ద దెబ్బతిన్న వంతెనపై రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న బ్రిడ్జి పనికి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలతో పంటలకు ఎలాంటి నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో పంటలు, ఇళ్ల నష్టం తదితర పరిస్థితులను పరిశీలించి నష్టం ఉంటే వెంటనే నివేదించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు హెడ్క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

---

## 27 ఏళ్లుగా గణేష్ యూత్ అన్నదాన సేవలు

నవరాత్రులు ప్రారంభమైన నాటి నుంచి ప్రతిరోజూ 100 మందికి అన్నదానం

5 వేల మందికి మహా అన్నదానం

18 రకాల వంటకాలతో భారీ ఏర్పాట్లు

భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** భక్తి, సేవా కార్యక్రమాలను సమన్వయం చేస్తూ పట్టణంలోని క్లాత్ మర్చంట్స్ పక్కన గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గత 27 సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్న గణేష్ యూత్ సభ్యులు, ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ భక్తులకు సేవలందిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం సుమారు 100 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ మండపానికి విచ్చేసే భక్తులు, స్థానికులు, కార్యక్రమాల్లో పాల్గొనే వారికి భోజన సౌకర్యం కల్పిస్తూ సేవా భావాన్ని చాటుతున్నారు. అన్నదానం చేయడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు సేవాభావాన్ని అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

**5 వేల మందికి మహా అన్నదానం**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా భారీ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గణేష్ యూత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి సుమారు 5 వేల మంది భక్తులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజన వసతులు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు.

**18 రకాల వంటకాలతో ప్రత్యేక విందు**

మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులకు ప్రత్యేకంగా సుమారు 18 రకాల వంటకాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉండటంతో వంటకాల తయారీ, వడ్డింపు, భక్తుల కూర్చునే ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో మహా అన్నదానాన్ని నిర్వహించి అందరికీ ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

**27 ఏళ్లుగా సేవా పరంపర**

గత 27 సంవత్సరాలుగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడంతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను కొనసాగించడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భక్తులను భాగస్వాములను చేయడం, అన్నదానం ద్వారా సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తినిస్తుందని గణేష్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వినాయక నవరాత్రి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో గణేష్, పవన్, సతీష్, తోట సంతోష్, నరేందర్, సాయి, సందీప్, రాంరెడ్డి, సంతోష్, శ్రీధర్, శివ, మనోజ్, చింటూ, శశాంక్, ప్రేమ్, రేవంత్, ప్రవీణ్, ధనుంజయ్, జ్ఞానప్రకాష్, విఘ్నేష్ తదితర గణేష్ యూత్ సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారు.

---

## ప్రజల ఆరోగ్య సేవల్లో ఫార్మసిస్టుల పాత్ర అమూల్యం

టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు

అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఫార్మాసిస్టులకు ఘన సన్మానం



**ఖమ్మం, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలల్లో సేవలందిస్తున్న ఫార్మసిస్టులను ఘనంగా సన్మానించారు. టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ జెడ్.ఎస్. జయపాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఫార్మసిస్ట్ జి. వీరయ్యకి, ప్రభుత్వ హోమియో వైద్యశాల ఫార్మసిస్ట్ జయశ్రీకి, ప్రభుత్వ యునాని వైద్యశాల ఫార్మసిస్ట్ సూర్యకళకి సన్మానం చేశారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో కీలకమని, వైద్యులతో సమన్వయంతో పని చేస్తూ మందుల నాణ్యత, నిల్వ, పంపిణీతో పాటు రోగులకు మందుల వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఫార్మసిస్టులు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొంటూ, అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్టు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ప్రకాష్ రావు, ఆయుష్ ఫార్మసిస్ట్ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు గంగిశెట్టి వీరయ్య, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఉపేందర్, యునాని వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

---

## మృతులకుటుంబాలను పరామర్శ



**టేకుమట్ల సెప్టెంబర్ 25 మనం న్యూస్ :** మండలంలోని పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టేకుమట్ల మండల కేంద్రంలోని రామకృష్ణపూర్ (వి) గ్రామానికి చెందిన లద్దునూరి సమ్మక్క అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి, మాతృశ్రీ ఫౌండేషన్ తరఫున 25 కిలోల బియ్యం బస్తా అందజేసి నివాళులర్పించారు.

అలాగే ఏంపెడు గ్రామానికి చెందిన బొల్లి రాజయ్య మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు 25 కిలోల బియ్యం బస్తా అందజేశారు. ఈ సందర్భంగా దొంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవాపూర్ సర్పంచ్ అంబాల కిరణ్ టేకుమట్ల మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లద్దునూరి ఐలయ్య, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఆరకొండ రాజయ్య, మండల ఎస్సీ సెల్ నాయకులు పొరణంది రాములు తదితరులు పాల్గొన్నారు.

---

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**టేకుమట్ల సెప్టెంబర్ 25 మనం న్యూస్:** మండలంలోని సోమనపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన గుర్రపు రాజ గౌడ్ కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. అనంతరం దుబ్యాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన దుగ్యాల జలపతి రావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గుర్రపు నాగరాజు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దేశెట్టి గోపాల్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలిఫ్, జిల్లా నాయకులు కూర సురేందర్ రెడ్డి, మాజీ బీజేవైఎం మండల అధ్యక్షులు పంజాల కుమార్ గౌడ్, మండల నాయకులు గుండెబోయిన తిరుపతి, దుగ్యాల మధుకర్ రావు, సామి రావు, అనిల్ మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

## తల్లిపాలు పిల్లలకి అవసరం



**టేకుమట్ల సెప్టెంబర్ 25 మనం న్యూస్:** మండలంలో వెలిశాల సెక్టార్ లోని వెంకట్రావుపల్లి అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సంవత్సరము థీమ్ వచ్చేసి'మన అంగన్వాడి మన బాధ్యత' తల్లులకు, పిల్లలకు పోషణ అవసరం మీ పిల్లలు వయసుకు తగ్గ బరువు లేదా ఎత్తుకు తగిన బరువు ఉన్నప్పుడే వాళ్లు శారీరకంగా మానసికంగా ఎదుగుదల ఉంటుంది. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గుడ్లు, ఆకుకూరలు ,పండ్లు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, ఎక్కువగా మీపిల్లలకు పెట్టి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని తల్లులకు గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాండ్ల చంద్రకళ మాట్లాడుతూ గర్భిణీ ఉన్నప్పుడే మన సీజనల్ లో దొరికే ఆకుకూరలు ,కూరగాయలు ,పండ్లు తీసుకోవాలని తల్లులకు సూచనలు ఇవ్వనైనది ఈ కార్యక్రమంలో గర్భిణీలు ,బాలింతలు, పిల్లలు,,అంగన్వాడి టీచర్ భాగ్యలక్ష్మి ఆశ వర్కర్ శారద, కోమల ఆయా కొమురమ్మ పాల్గొన్నారు

---

## తుఫాను బాధితులకు అండగా ఉంటాం ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** నిన్నటి వరకు కురిసిన భారీ తుఫాను వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పంట పొలాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ,దమ్మపేట మండల పరిధిలోని జగ్గారం గ్రామపంచాయతీలో పర్యటించి పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా సుడిగాలి తీవ్రతకు నేలకొరిగిన ఆయిల్ ఫామ్ జీడిమామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల రైతాంగానికి జరిగిన నష్టం అత్యంత విచారకరమన్నారు రైతులు అధైర్యపడొద్దని పంట నష్టానికి సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి బాధితులందరికీ ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందేలా తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు అలాగే దెబ్బతిన్న రహదారులకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంకా జానకీ రామ్, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

---

## నూతన పారిశుధ్య వాహనాల ప్రారంభం



**వైరా, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** వైరా మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన నూతన పారిశుధ్య వాహనాలను వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పరిశుభ్రమైన వైరా పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ ఛైర్పర్సన్ కాపా చంద్రకళ, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వియత్నాం విద్యా పర్యటనకు ఉపాధ్యాయుడు ఎంపిక



మంథని సెప్టెంబర్25(మనంన్యూస్): తెలంగాణ పాఠశాల విద్యాశాఖ,ఎస్.సి.ఇ ఆర్.టి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ఎక్స్పోజర్ విజిట్, ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్ కింద వియత్నాం దేశ పర్యటనకు మంథని జెడ్పిహెచ్ ఎస్ బాలికల పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు భరత్ రెడ్డి ఎంపికయ్యారు.ఈ విద్యా పర్యటన 10.10.2026 నుండి17.10.2026 వరకు జరగనుంది.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి అంతర్జాతీయ విద్యా విధానాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.భరత్ రెడ్డిగణిత బోధనలో చూపిస్తున్న ప్రతిభ, విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తుండటంతో ఆయన కు అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. వియత్నాంలోని విద్యా సంస్థలను సందర్శించి అక్కడి బోధనా పద్ధతులను తెలుసుకుని రాష్ట్రంలో అమలు చేసేందుకు ఈ పర్యటన దోహదపడుతుంది.ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, మంథని ప్రజలు భరత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆయన పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## క్లిష్టమైన వ్యాధులకు కోతల్లేని శాశ్వత పరిష్కారం

- **యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఏంటరోలజిస్ట్ డాక్టర్ కృష్ణ చౌదరి**



పాలకొల్లు సెప్టెంబర్ 25,మనం ప్రతినిధి: ఆధునిక జీవనశైలి మార్పుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం పెను సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా రక్త సంబంధిత, జీర్ణాశయ వ్యాధులు వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు అత్యుత్తమ ప్రపంచస్థాయి వైద్య సేవలను అందించడంలో యశోద హైటెక్ సిటీ బృందం అగ్రగామిగా నిలుస్తోంది. ప్రాణాంతకమైన వ్యాధులను సైతం ప్రాథమిక దశలోనే పసిగట్టి, అత్యాధునిక సాంకేతికతతో కూడిన వైద్య విధానాల ద్వారా సంపూర్ణ స్వస్థత చేకూర్చవచ్చని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు వేదికగా శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాత్రికేయుల సమావేశంలో యశోద ఆసుపత్రికి చెందిన సుప్రసిద్ధ వైద్యులు పాల్గొని పలు కీలక విషయాలు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో విశేష అనుభవం గడించి, ఎన్నో క్లిష్టమైన కేసులను ఛేదించి వేలాది ప్రాణాలను కాపాడిన యశోద ఆసుపత్రుల సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చౌదరి, హెమటాలజిస్ట్ డాక్టర్ ఫరాజ్ అహ్మద్ ఈ వైద్య సదస్సులో తమ అపారమైన పరిజ్ఞానాన్ని పంచుకున్నారు.జీర్ణాశయ వ్యవస్థలో తలెత్తే అనారోగ్య సమస్యలకు పాతకాలపు పద్ధతులకు స్వస్తి పలుకుతూ ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. డాక్టర్ కృష్ణ చౌదరి తన సుదీర్ఘ ప్రస్థానంలో అనేక సంక్లిష్టమైన ఆపరేషన్లను అత్యంత సునాయాసంగా విజయవంతం చేసి ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదించారు. దీనివల్ల బాధితులకు ఆపరేషన్ తర్వాత వచ్చే తీవ్రమైన నొప్పి, అసౌకర్యం దరిచేరవు. అత్యంత కచ్చితత్వంతో క్లిష్టమైన భాగాల్లో శస్త్రచికిత్స చేయడం రోబోటిక్ సర్జరీ ప్రత్యేకత. అయితే రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను నిశితంగా పరిశీలించిన తర్వాతే ఏ తరహా ఆపరేషన్ చేయాలనేది నిపుణులైన వైద్య బృందం నిర్ధారిస్తుంది. ఇలాంటి ఖరీదైన వైద్య సేవలను సైతం ఆరోగ్య బీమా కవరేజ్ ద్వారా సామాన్యులు కూడా సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. మరోవైపు రక్త సంబంధిత సమస్యలు నేడు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రక్తహీనత నుంచి మొదలుకొని రక్తం గడ్డకట్టే స్వభావంలో లోపాలు, ప్లేట్లెట్ క్షీణత, తెల్ల రక్తకణాల సమస్యలు, లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా లాంటి తీవ్రమైన ప్రాణాంతక క్యాన్సర్లు వివిధ వయసుల వారిని పట్టిపీడిస్తున్నాయి. ఈ వైద్య రంగంలో విశేషమైన ఖ్యాతి గడించిన డాక్టర్ ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, శరీరంలో కనిపించే చిన్నపాటి మార్పులను సైతం ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదని హెచ్చరించారు. నిరంతర అలసట, కారణం లేకుండా బరువు తగ్గిపోవడం, చర్మం పాలిపోవడం, అకారణ రక్తస్రావం, చర్మంపై నీలిరంగు మచ్చలు, మెడ లేదా చంకల్లో కణితులు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం అప్రమత్తం కావాలి. ఈ లక్షణాలన్నీ క్యాన్సర్ కే దారితీయకపోయినా, వైద్య పరీక్షల ద్వారా అసలు మూలాలను గుర్తించడం ఎంతో అవసరం. యశోద ఆసుపత్రిలో ఇలాంటి సంక్లిష్ట వ్యాధులను పసిగట్టడానికి అత్యాధునిక రక్త, ఎముక మజ్జ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి దశను బట్టి కచ్చితమైన కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ వంటి టార్గెటెడ్ చికిత్సలతో పాటు అవసరమైన వారికి మూలకణాల మార్పిడి (బోన్ మ్యారో ట్రాన్స్ప్లాంటేషన్) వంటి ప్రపంచ స్థాయి ట్రాన్స్ప్లాంట్ సేవలను యశోద అద్భుతంగా అందిస్తోంది. వ్యక్తిగత ఆరోగ్య నివేదికలు, జన్యుపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని సరైన సమయంలో చికిత్సను ప్రారంభిస్తే ప్రాణాపాయాన్ని పూర్తిగా అదుపు చేయవచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు. ఏవైనా లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరావు రావు వీరంకీ, మార్కెటింగ్ మేనేజర్ బాల వీరభద్ర నల్లం, పశ్చిమ గోదావరి జిల్లా అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ బి లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



జగిత్యాల / గొల్లపల్లి, సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి): గొల్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ గారు శుక్రవారం సందర్శించి పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచిని పరిశీలించారు. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. వంటశాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

అనంతరం పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యాబోధన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు, మండల పంచాయతీ అధికారి ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేత



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 25 ( మనం న్యూస్ ): ఇటీవల తాడేపల్లిగూడెం టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఊరేగింపు కార్యక్రమంలో డ్రైవర్ కె ఏసు ఆకాల మరణాని చింతిస్తూ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ , పైబొయిన వెంకట్రామయ్య కలిసి వారి కుటుంబ సభ్యులకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం శుక్రవారం చేశారు . ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ , జనసేన సివియర్ నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు , చాపలా రమేష్ గారు, బొడ్డు సాయి , చిన్న వెంకట్రామయ్య ,గట్టిం నాని , నలగంచు రాంబాబు , కిశోర్ ,రామ లక్ష్మణులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించిన వీఆర్ఏలు



పోడూరు, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు పోడూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు శుక్రవారానికి పదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోడూరు గ్రామంలోని మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి కూటమి నాయకుల సమక్షంలో వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.నిరసనలో భాగంగా రెండో రోజు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, తొమ్మిదో రోజు మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేసిన వీఆర్ఏలు, పదో రోజు ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రుద్రరాజు రమేష్రాజు,మాజీ సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు రుద్రరాజు సీతారామరాజు( రవిరాజు), మాజీ ఎంపీటీసీ, ఉపసర్పంచ్ శీలబోయిన జయరామకృష్ణ పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలపై అవగాహనకు ఉత్సవం



పోడూరు, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి: సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా పోడూరు మండలంలోని వాటర్ ట్యాంక్ రోడ్డు మెయిన్ సెంటర్ కోడ్ నంబర్-1 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. సీడీపీఓ ఇందిరా ఆదేశాల మేరకు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఏసీడీపీఓ పి. నాగరత్నం, సూపర్వైజర్ హసీనా, అంగన్వాడీ కార్యకర్త పిల్లి లక్ష్మి, సహాయకురాలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాలు, మాతృ సంరక్షణ, టీకాలు, సామాజిక సేవలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సరుకుల నాణ్యత, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా అందిస్తున్న విద్యాబోధనపై వివరించారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్రాజు, బిజెపి మండల అధ్యక్షులు చింతపల్లి రమేష్ శెట్టి, రుద్రరాజు రవిరాజు, మాజీ సర్పంచ్ రుద్రరాజు సుజాత, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, జనసేన మండల అధ్యక్షుడు బొక్క గణపతి, ఏఎంసి డైరెక్టర్ బండి సత్యనారాయణ, పోడూరు సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి పురుషోత్తం, రుద్రరాజు రవిరాజు, గెద్దాడ అంజి, గుత్తుల వెంకటేశ్వర్లు, రుద్రరాజు సురేష్రాజు, బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు సీహెచ్ జ్యోతి భవాని, బండి కాండ్రేకుల సత్యనారాయణ, షేక్ బావాజీ, కే. దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## జనంలో జీవించి ఉన్న దీన్ దయాళ్



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 25 ( మనం న్యూస్ ): ఏకాత్మాత మానవతా,అంత్యోదయ సిద్ధాంతంతో.. ప్రజల్లో జీవించే ఉన్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. కొందరు మరణించేవరకు జీవిస్తారని,మహనీయులు మరణించిన తరువాత కూడా జీవించే ఉంటారని, అటువంటి కోవకు చెందిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శనీయులని ఆమె నివాళులు అర్పించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం బిజెపి తాడేపల్లిగూడెం పట్ట కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆదిలక్ష్మి మాట్లాడుతూ దీన్ దయాళ్ ను అందరూ స్ఫూర్తి గా తీసుకోవాలని కోరారు. యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పైడికొండల సింధు , ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాష్ట్రం కంచుమర్తి నాగేశ్వరరావు , గోకా మహాలక్ష్మి , తాడాల సూర్యకుమారి, పడాల కావ్యరెడ్డి, రామగాని సత్యనారాయణ, కసిరెడ్డి నాగదుర్గ, చిన్నా, తుట్టగుంట కృష్ణ కుమారి, చెరుకూరి గంగాధర్, మోటూరి వెంకటరత్నం తదితరులు పాల్గొని దీన్ దయాళ్ కు నివాళులు అర్పించారు.

## చైర్మన్ పదవి కూటమిలో జనసేనకా ! టిడిపికా ! బిజెపికా !

**తాడేపల్లిగూడెం పురపాలక సంఘం చైర్మన్ పదవికి పోటీ కోసం కూటమిలో రాజకీయ రగడ !**



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 25 ( మనం న్యూస్ ) : రాబోయే పురపాలక సంఘం ఎన్నికల కోసం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కూటమిలో రాజకీయ రగడ మొదలైంది. పురపాలక సంఘం ఎన్నికలు జరుగుతాయని చైర్మన్ పదవి పై చర్చ సాగుతుంది . తాడేపల్లిగూడెం శాసనసభ్యునిగా జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ ఉండటం వల్ల మున్సిపల్ చైర్మన్ పదవి తెలుగుదేశం పార్టీకి ఇవ్వాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి వలవల మల్లికార్జునరావు ( బాబ్జి ) డిమాండ్ చేస్తున్నారు. దానికి శాసనసభ్యులు సుముఖంగా లేరని జనసేనకు సంబంధించిన నాయకునికే పురపాలక సంఘం చైర్మన్ పదవి పట్టం కట్టబెడతారని ప్రచారం జరుగుతుంది. దానికి అనుగుణంగానే శాసనసభ్యుల ప్రకటన ఉండటంతో తెలుగుదేశం నాయకుల్లో కల్లోలం మొదలైంది. పురపాలక సంఘం చైర్మన్ పదవి కోసం జనసేన పార్టీ నుండి పాలూరి వెంకటేశ్వరరావు, పైబోయిన రఘు , వర్తనపల్లి కాశి , తెలుగుదేశం పార్టీ నుండి గొర్రెల శ్రీధర్ , బిజెపి పార్టీ నుండి ఈతకోట తాతాజీ , భోగిరెడ్డి ఆదిలక్ష్మి , పైడికొండల సింధు , నరిసే సోమేశ్వరరావు పేర్లు ప్రచారం జరుగుతున్నాయి. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం చైర్మన్ పదవి కూటమి నుండి జనసేనకా ! టిడిపికా ! బిజెపికా ! ఏ పార్టీకి ఇస్తారు అనేది వేచి చూడాలి !

## పండుగ వాతావరణంలో అంగన్వాడీ ఉత్సవం



- **పాల్గొన్న కూటమి నాయకులు**

పోడూరు, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సీడీపీఓ ఇందిరా ఆదేశాల మేరకు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పోడూరు సెక్టార్ పరిధిలోని సంత మార్కెట్ అంగన్వాడీ కేంద్రంలో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీడీపీఓ పి. నాగరత్నం, సూపర్వైజర్ హసీనా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు వివిధ పథకాలు, మాతృ సంరక్షణ,టీకాలు,సామాజిక సేవలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సరుకులు నాణ్యత తీసుకోవలసిన పౌష్టికాహారం గురించిన వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, సొసైటీ మాజీ చైర్మన్ టిడిపి సీనియర్ నాయకులు రుద్రరాజు సీతారామరాజు( రవిరాజు),గ్రామ టిడిపి అధ్యక్షులు బొంతు కాశి,మాజీ ఎంపీటీసీ, ఉపసర్పంచ్ శీలబోయిన జయరామకృష్ణ, బిజెపి నాయకులు జవ్వాది నానాజీ,గుత్తుల వెంకటేశ్వ రరావు,గెద్దాడ ఆంజనేయులు,ముడకల గణేష్, టిడిపి నాయకులు చిలుకూరి ప్రసాద్, గుడాల దుర్గారావు,షేక్ బావాజీ, ఏఎంసి డైరెక్టర్ బండి సత్యనారాయణ,అంగన్వాడీ కార్యకర్త నాగలక్ష్మి, సహాయకురాలు వెంకటలక్ష్మి, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంట రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



- **హెచ్ఓ దివ్యశ్రీ**

ఏలేశ్వరం,సెప్టెంబర్, 25:-(మనం న్యూస్): తుఫాను,భారీ వర్షాల అనంతరం ఉద్యాన పంటల్లో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ సూచించారు.కూరగాయ పంటల్లో నిల్వ నీటిని తొలగించి,పడిపోయిన మొక్కలను నిలబెట్టి మట్టి ఎత్తి ఆసరా ఇవ్వాలన్నారు.విరిగిన కొమ్మలు,కుళ్లిన ఆకులు,కాయలను తొలగించాలని సూచించారు.

ఆకుమచ్చ,కుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.వేరుకుళ్లు నివారణకు బ్లిటాక్స్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదల్లో పోయాలని తెలిపారు.అరటిలో వంగిన మొక్కలకు ప్రాపింగ్ చేసి,దెబ్బతిన్న భాగాలను తొలగించాలన్నారు.

సిగటోకా,ఆకుమచ్చ నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రోపికనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.బొప్పాయిలో నీరు నిల్వకుండా డ్రైనేజీ చేసి,కుళ్లిన భాగాలను తొలగించాలన్నారు.కుళ్లు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి వినియోగించాలన్నారు.

జామలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు,పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి వినియోగించాలని తెలిపారు.ఆయిల్పామ్,కొబ్బరిలో పాదులు చేసి ఎరువులు వేయాలని, మొవ్వ కుళ్లు సోకితే కుళ్లిన భాగాలను తొలగించి కార్బెండజిమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి వినియోగించాలని సూచించారు.

## కూటమి సమన్వయంతో స్థానిక ఎన్నికల్లో పోటీ



ధర్మవరం, సెప్టెంబరు 25, మనం న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలన్నీ సమన్వయంతో కలిసి పోటీ చేసి విజయానికి కృషి చేస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ధర్మవరంలోని భాజపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.కూటమి ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని, అదే విధంగా స్థానిక ఎన్నికల్లోనూ భాజపా, తెదేపా, జనసేన శ్రేణులు పరస్పర సహకారంతో ముందుకు సాగుతాయని మంత్రి పేర్కొన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తారని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని సత్యకుమార్ యాదవ్ చెప్పారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతో ఎన్నికలను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

## తెదేపా కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం



- **వినతులు స్వీకరించిన పొత్తూరి రామరాజు**

నరసాపురం, సెప్టెంబర్ 25 (మనం న్యూస్) : ప్రతి వారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్-ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పొత్తూరి రామరాజు ముఖ్య పాల్గొని నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తల నుండి సమస్యలపై అందిన వినతులను స్వీకరించారు.ఈ వేదిక ద్వారా ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రైనేజీలు తదితర స్థానిక సమస్యలపై ప్రజలు వినతులు, ఫిర్యాదులు అందించగా వాటిని స్వీకరించిన రామరాజు అందిన ప్రతి సమస్యను సవివరంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మొగల్తూరు మండల తెదేపా అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## దయనీయంగా రైతుల పరిస్థితి



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 25 (మనం న్యూస్ ) : తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురం గ్రామంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బాడవ ప్రాంతంలోని రైతులు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంటలన్నీ నీట మునిగిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పొలాల్లో నీరు ఎక్కువగా నిలిచిపోతే పంటకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది. రైతులు పెట్టిన పెట్టుబడులు నీటిలో మునిగిపోయాయి. ఎర్రకాలువ నిండిపోవడం, నీటి ప్రవాహం సక్రమంగా దిగువకు వెళ్లకపోవడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. రైతుల పరిస్థితిని అధికారులు అత్యవసరంగా పరిగణించి, ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేసి చర్యలు చేపట్టి పంటలను కాపాడాలని జగన్నాధపురం రైతు కోరుతున్నారు.

## నులి పురుగుల నిర్మూలనకు సమష్టి కృషి

- **హీరేహాళ్ లో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం-2026**



డి. హీరేహాళ్, సెప్టెంబర్ 25మనం న్యూస్: హిరేహాల్ మండలంలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం-2026 కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులుపాల్గొని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. మండల వ్యాప్తంగా పిల్లలు, కౌమారదశలోని బాలబాలికలను లక్ష్యంగా చేసుకుని వైద్య సిబ్బంది పర్యవేక్షణలో అర్హులైన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులి పురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వాటి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు డా. శ్రావణ్ కుమార్, డా. జశ్వంత్ మాట్లాడుతూ.. నులి పురుగుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రత కీలకమని తెలిపారు. భోజనానికి ముందు, మరుగుదొడ్ల వినియోగం అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లను క్రమం తప్పకుండా కత్తిరించుకోవడం, శుభ్రమైన నీటిని తాగడం, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం, తప్పనిసరిగా మరుగుదొడ్లను వినియోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నులి పురుగుల నిర్మూలన దినోత్సవం రోజున మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలు, విద్యార్థులకు అక్టోబర్ 5న మాప్అప్ డే ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరూ కార్యక్రమం నుంచి మినహాయించబడకుండా అర్హులైన ప్రతి చిన్నారికి మాత్రలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా-శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంత రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు ఎంపిటిసి మొండి మల్లికార్జున గంగాధర దొడగట్ట రామాంజనేయులు ఎంపీడీవో దాస్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి మకాశి వెంకటేశులు బోయ నాగ తాయప్ప గోవిందు వెంకటేశులు శీన తిమ్మయ్య విద్యార్థులు వైద్య సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలకు నోటీసు..

## రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించిన ఎంఈఓ

### అనుమతులపై ప్రశ్నించగా..

### కీలక వివరాలు వెల్లడించిన బాన్సువాడ మండల విద్యాధికారి.

**కామారెడ్డి, సెప్టెంబర్ 25 (మనం బ్యూరో):** పేరుకే నారాయణ పాఠశాల.. సౌకర్యాలు మాత్రం శూన్యం అనే శీర్షికతో ఇటీవల 'మనం' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ స్పందించింది. కథనంలో ప్రస్తావించిన అంశాలపై బాన్సువాడ మండల విద్యాధికారి నారాయణ పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.




### భవనం నిర్మాణంలో ఉండగానే అనుమతులు ఎలా?

పాఠశాల భవనం నిర్మాణంలో ఉండగానే అనుమతులు ఎలా ఇచ్చారనే అంశంపై మండల విద్యాధికారిని 'మనం' దినపత్రిక బ్యూరో ప్రశ్నించింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. గతంలో అదే భవనంలో ఠాగూర్ కళాశాల నిర్వహించబడిందని, ప్రస్తుతం అదే భవనంలో నారాయణ పాఠశాల కొనసాగుతోందని తెలిపారు. గతంలో అదే భవనానికి ఠాగూర్ కళాశాలకు అనుమతులు ఉన్న నేపథ్యంలో పాఠశాలకు అనుమతులు ఇవ్వకపోతే ప్రశ్నలు తలెత్తుతాయనే ఉద్దేశంతో అనుమతులు ఇచ్చినట్లు వివరించారు.

### 'కార్పొరేట్ నారాయణ కాదు'.. ఎంఈఓ

ఇదిలా ఉండగా, ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాల కార్పొరేట్ సంస్థకు చెందిన నారాయణ పాఠశాల కాదని, సాధారణ నారాయణ పేరుతో నిర్వహిస్తున్న పాఠశాల అని మండల విద్యాధికారి తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

### పెద్ద ప్లానింగే...

నిజానికి అందరు ఈ పాఠశాల కార్పొరేట్ పాఠశాల అని నమ్ముతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా కార్పొరేట్ నారాయణ సంస్థకు సంబంధించిన రిజిస్టర్డ్ లోగోను పోలిన విధంగా చిన్న చిన్న మార్పులతో లోగోను ఉపయోగిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించి జాగ్రత్త వహించాలి.

### ఉపాధ్యాయుల అర్హతలపై అనుమానాలు...

నారాయణ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిర్దేశిత విద్యార్హతలు, బోధనా అర్హతలు కలిగి ఉన్నారా అనే అంశంపై కూడా కొత్తగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల అర్హతలు, నియామక వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు పాఠశాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. చూడాలి... పాఠశాల యాజమాన్యం ఎలాంటి వివరణ ఇస్తారో.. ఇచ్చే వివరణతో పాటు పాఠశాల అనుమతులు, భవనం, మౌలిక సదుపాయాలు సంబంధించిన అంశాలపై విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో రెండు రోజుల్లో తెలుస్తుంది.



# వెల్గటూర్ లో వైద్య శిబిరం

## 101 మందికి ఓపీ.. మలేరియా, డెంగ్యూ పరీక్షలు

**మెండోరా, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** మెండోరా మండలం వెల్గటూర్ గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 101 మంది ఓపీ సేవలు పొందారు. జ్వరంతో బాధపడుతున్న 24 మందికి పరీక్షలు నిర్వహించగా, 24 మందికి మలేరియా పరీక్షలు, 27 మందికి డెంగ్యూ పరీక్షలు, 24 మందికి రక్తపు పూతల పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ప్రజలు జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఫిర్దోస్ ఫాతిమా, ఏంఎల్ హెచ్పి శారద, సూపర్వైజర్లు భీమన్న, అక్బర్ అలీ, వాణి, ఏఎన్ఎంలు ప్రమీల, వాణి, ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు.

# ఆయిల్ పామ్‌తో తక్కువ ఖర్చు అధిక లాభాలు

## తక్కువ నీటి వినియోగంతో సాగు, ఎకరానికి 3.5 టన్నుల దిగుబడి




**కామారెడ్డి, సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి):** ఆయిల్పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని రైతు శానం భాస్కర్ తెలిపారు. గాంధారి మండలంలో శుక్రవారం ఆయన సాగు చేస్తున్న ఆయిల్పామ్ తోటలో గెలల కోత కార్యక్రమం నిర్వహించారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న తోట నుంచి ఇప్పటివరకు సుమారు 14 టన్నుల దిగుబడి పొందినట్లు భాస్కర్ వెల్లడించారు. సాగు రైతు శానం భాస్కర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్పామ్ సాగులో తక్కువ శ్రమ, తక్కువ నీటి వినియోగంతో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. సాగు ఖర్చులు తగ్గడంతోపాటు దిగుబడి ద్వారా మంచి ఆదాయం లభిస్తోందన్నారు. ఆయిల్పామ్ గెలలను సంబంధిత కంపెనీ కొనుగోలు చేస్తుండటంతో మార్కెటింగ్ విషయంలో రైతులకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు. మరింత మంది రైతులు ఆయిల్పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, మండల ఉద్యాన శాఖ అధికారి సుమన్, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ మేనేజర్ సాయికుమార్, ఫీల్ ఆఫీసర్లు రవీందర్, ప్రదీప్, ఆయిల్పామ్ రైతులు పాల్గొన్నారు.

# గణేష్ విగ్రహాల నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి: సీపీ సాయిచైతన్య

**నిజామాబాద్, సెప్టెంబర్ 25 (మనం బ్యూరో):** గోదావరిలో గణేష్ విగ్రహాల నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నందిపేట్ మండలం ఉమ్మెడ బ్రిడ్జి వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి నదిలో గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా భారీ గణేష్ విగ్రహాలను గోదావరి నీటిలో నిమజ్జనం చేసే సమయంలో నిర్వాహకులు, భక్తులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. భారీ విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎవరూ ప్రమాదకరంగా



నీటిలోకి వెళ్లకుండా చూడాలని, పోలీస్ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్ శాఖకు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంలో భారీ వినాయకుల నిమజ్జనం కోసం భారీ క్రేన్లను ఏర్పాటు చేయడం జరిగింది. అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, నందిపేట్ ఎస్ఐ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞాత పోస్టర్తో భిక్కనూర్ మండలంలో కలకలం

- ఆర్టీఐ సమాచారం కోరితే డబ్బులు డిమాండ్ చేశారంటూ ఆరోపణలు.
- ఏసీబీ వలలో చిక్కనున్నారంటూ పోస్టర్.




**భిక్కనూర్, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** భిక్కనూర్ మండలంలో సోషల్ మీడియా వేదికగా ఓ అజ్ఞాత పోస్టర్ కలకలం రేపుతోంది. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆర్టీఐ చట్టం-2005 కింద సమాచారం కోరిన వ్యక్తుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ పోస్టర్లో ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. పోస్టర్లో ఆర్టీఐ నుంచి సమాచారం కోరితే డబ్బులు డిమాండ్, భిక్కనూర్ మండలంలో ఈ ఘటన అంటూ ఆరోపణలు చేస్తూ, త్వరలోనే ఏసీబీ వలలో పంచాయతీ అధికారులు చిక్కనున్నారనే విధంగా పేర్కొన్నారు. అయితే ఈ పోస్టర్ను ఎవరు ఏర్పాటు చేశారనే విషయం మాత్రం వెల్లడికాలేదు.

ఆర్టీఐ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రజలు సమాచారం పొందే హక్కు కలిగి ఉన్న నేపథ్యంలో, సమాచారం కోసం డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలు నిజమా? కాదా? అనే అంశంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. పోస్టర్లో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా ఏసీబీకి ఫిర్యాదు చేశారా?, పోస్టర్లో పేర్కొన్న ఆరోపణలపై అధికారికంగా ఏమైనా విచారణ జరుగుతోందా? అన్న విషయాలు కూడా తెలియాల్సి ఉంది. ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాటిపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. అజ్ఞాతంగా వెలువడిన ఈ పోస్టర్ ప్రస్తుతం భిక్కనూర్ మండలంలో హాట్టాపిక్గా మారింది. అయితే పోస్టర్లోని ఆరోపణల నిజానిజాలు అధికారిక విచారణ అనంతరం మాత్రమే తేలాల్సి ఉంది.



# మంత్రి సీతక్క సమీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**కామారెడ్డి, సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి):** ఈ నెల 28న కామారెడ్డిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. వేదిక, శాఖల వారీ నివేదికల సిద్ధం, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, సాధించిన లక్ష్యాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రూమ్ నంబర్ 25కు మార్చినట్లు అధికారులు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన

# విద్యను అందించాలి

## జిల్లా విద్యాధికారి మల్లికార్జున్



**సదాశివనగర్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం సదాశివనగర్ మండల విద్యాధికారి కార్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేలా బోధన అందించాలని మండల విద్యాధికారికి యోసేఫ్ కు సూచించారు. అనంతరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సందర్శించి విద్యార్థులకు విద్యా సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు బోధన అందించాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ఇస్తుందన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి క్రమం తప్పకుండా పాఠశాల హాజరై విద్యార్థులకు మంచి విద్యను అందించాలని సూచించారు.



# ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్ తనిఖీలు

**భిక్కనూరు, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** భిక్కనూరు పట్టణంలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ ఆహార విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, తయారీ తేదీలు, గడువు తేదీలు, నిల్వ విధానం, పరిశుభ్రత తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయాలని, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఫుడ్ ఇన్స్పెక్టర్ సూచించినట్లు సమాచారం. గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార దుకాణాల్లో తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు.



# రిటైర్‌మెంట్ వయస్సులో అప్పాయింట్‌మెంట్

## పట్టువదలని విక్రమార్కుడికి 27 ప్రయత్నంలో ఉద్యోగం దక్కింది

## 59 ఏండ్ల వయస్సులో టీచర్‌గా జాబ్‌లో చేరిన విజయ్ కుమార్

**ముంబై, సెప్టెంబర్ 25 :** గవర్నమెంట్ టీచర్ పోస్ట్ కొట్టాలన్నది ఆయన డ్రీమ్. దాని కోసం అందరిలానే యుక్తవయస్సులో.. 1999లో ప్రయత్నించాడు. అయితే, ఆయన లక్కు కన్నా ముందు అయనకు బ్యాడ్ లక్కే ఎదురైంది. అప్పుడు ఉద్యోగం రాలేదు. అప్పటి నుంచి పట్టు వదలకుండా 27 ఏండ్ల నుంచీ విఫల ప్రయత్నాలు చేస్తూనే వచ్చారు. ఆయన వయస్సు ఇప్పుడు 59. దాదాపు రిటైర్‌మెంట్ వయసొచ్చింది. అయినా, ఆయన నిరాశ పడలేదు. ఈసారి కూడా తన విక్రమార్క ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాలకు మెచ్చిన కాలం ఆయనకు ఉద్యోగం రప్పించింది. ఏమైతేనేం.. ఏవయస్సులో అయితేనేం అనుకున్న ఉద్యోగంలో చేరారు. ఇదీ ఉత్తర్ప్రదేశ్ లోని భాగ్ పత్ కు చెందిన విజయ కుమార్ శర్మ పోరాట గాథ. తన ప్రయత్నాల్లో భాగంగా విజయ్కుమార్ అనేక సార్లు రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా.. ఇంటర్వ్యూల్లోనే ఎదురుదెబ్బ తగిలేది. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పరీక్షలో ఆరుసార్లు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పరీక్షల్లో నాలుగు సార్లు ఉత్తీర్ణులయ్యారు. కానీ, ఇంటర్వ్యూల్లో ఫెయిలవ్వడంతో ప్రతిసారీ నిరాశే ఎదురయ్యేది. అయినా సరే.. తన ప్రయత్నాలను మాత్రం ఆయన ఆపలేదు. ఉపాధ్యాయుడిగా పనిచేయాలన్న తపనతో ఓ వైపు స్థానిక ప్రైవేటు పాఠశాలలో పని చేస్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధత కొనసాగించారు. రిక్రూట్మెంట్ ప్రాసెస్లో అక్కడి ప్రభుత్వం తాజాగా ఇంటర్వ్యూలను ఎత్తివేసింది. ఆ తర్వాతి విడుదలైన టీచర్ పోస్టుల నియామక నోటిఫికేషన్లో విజయ్ కుమార్ తన కలను సాకారం చేసుకున్నారు. టీజీటీ సంస్కృతం ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. యూపీలో ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లు కావడంతో... దాదాపు మూడేళ్లు ఆయన ఉపాధ్యాయుడిగా కొనసాగే అవకాశం దక్కింది.

# పాక్‌కు బెంబేలెత్తిస్తోన్న బ్రహ్మోస్

- అమేథీలో తయారవుతున్న ఆయుధంతో ఆదేశ నాయకులకు నిద్రలేని రాత్రులు
- యోగి సారథ్యంలో యూపీలో అభివృద్ధి పరుగులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా




**అమేథీ, సెప్టెంబర్ 25 :** ఉత్తర్ ప్రదేశ్ లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్ నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన యూపీ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత బీజేపీ హయాంలో ఆ రాష్ట్రం అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.

ప్రధాని మోడీ సారథ్యంలో భారత్ గణనీయమై ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్లో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగ తయారీ, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

## రైతు అన్నదాత మాత్రమే కాదు

# ఇంధన దాత కూడా

## ఇథనాల్ వినియోగంతో కర్షకులకు మంచి ఆదాయం

## ప్రభుత్వానికీ లాభమే: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**భోపాల్, సెప్టెంబర్ 25 :** ఇథనాల్ వాడకం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సహాయపడుతుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలని, ప్రజా రవాణాను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్ లో కొత్త బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో గడ్కరీ మాట్లాడారు. రైతులంటే ఈ రోజుల్లో అన్నదాత మాత్రమే కాదని.. 'ఇంధన దాత'లని గడ్కరీ అభివర్ణించారు. ఇథనాల్ ఉత్పత్తి వల్ల రైతులకు మేలు చేకూరిందన్నారు. దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి ప్రారంభమయ్యాక మొక్కజొన్న క్వింటాల్ ధర రూ.1200 నుంచి రూ.2,600కు చేరిందన్నారు. ఫ్లెక్స్ ఫ్యూయల్ కలిగిన ఇంజిన్లు నూరు శాతం ఇథనాల్తో నడుస్తాయని చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు.

భారత్ రూ.22 లక్షల కోట్ల పెట్రోలియంను దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ ఈ సందర్భంగా తెలిపారు.



ఇథనాల్, ఎలక్ట్రిసిటీ, హైడ్రోజన్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వాడకాన్ని పెంచి దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, హైడ్రోజన్ సాయంతో నడిచే వాహనాలూ అందుబాటులోకి రానున్నాయని గడ్కరీ చెప్పారు. కాలుష్యంలో రవాణా రంగం వాటా గణనీయంగా ఉందని, అందుకే ప్రజా రవాణాను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని కేంద్ర మంత్రి చెప్పారు.

# నా కొడుకును ఉరేసి చంపండి

- అత్యాచార కేసు నిందితుడి తల్లి

**ముంబై, సెప్టెంబర్ 25 :** మహారాష్ట్రలో ఓ వివాహితను బెదిరించి అత్యాచారం చేసిన కేసులో నిందితుడిగా ఉన్న కానిస్టేబుల్ ను ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. ఈ విషయంపై నిందితుడి తల్లి మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడు గతంలో అనేక మంది మహిళలను ఇలాగే వేధించాడని ఆరోపిస్తూ.. అతడికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. థాణే జిల్లా భీవండిలో సెప్టెంబర్ 13న ఓ వివాహితపై సామూహిక అత్యాచార ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో కానిస్టేబుల్ శైలేష్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే నరేంద్ర పవార్లు నిందితులుగా ఉన్నారు. బాధితురాలి నుదుటపై తుపాకీ పెట్టి బెదిరించి, మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసును ఇటీవల విచారించిన స్థానిక న్యాయస్థానం.. మాజీ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. సహ నిందితుడిగా ఉన్న శైలేష్ ను అధికారులు ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.

తన కుమారుడు గతంలో అనేక మంది మహిళలను ఇలాగే బెదిరించాడని తల్లి సులోచన పాటిల్ అన్నారు. ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిని కాపాడేందుకు నెపాన్ని తనపై వేసుకొని జైలుకు కూడా వెళ్లాడని తెలిపారు. ఆర్థర్ జైల్లో ఉన్నప్పుడు కరుడుగట్టిన నేరస్థులతో అతడికి పరిచయం పెరిగిందని, అప్పటినుంచి నేర చరిత్ర మొదలైందని ఆమె వివరించారు. శైలేష్ తనను తుపాకీతో బెదిరించి ఆస్తులన్నీ స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. ఎన్నో హేయమైన ఘటనలకు పాల్పడిన తన కుమారుడిని ఉరితీయాలని, తన ఆస్తులను ఇప్పించాలని ఉన్నతాధికారులకు సులోచన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కోట్లలో వ్యయం...రూల్స్ మాయం..!!

**కోదాడ శాంతినగర్ లిఫ్ట్ కథా ... కమీషు..**

**ఆ నేత..పేరు మార్పు వెనక మత్లబ్ ఏంటి**

**లిఫ్టు నిర్మాణం సబ్ కాంట్రాక్టర్ చేతుల్లోకి**

**లేదు.. లేదు అంటున్న ఇరిగేషన్ అధికారులు**

**సకాలంలో ఈ ఎత్తిపోతల నిర్మాణం పూర్తి అయ్యేనా..!**

**నిర్దేశించిన ఆయకట్టు నీరందేనా... సాగు విస్తీర్ణం పెరిగేనా..!**





**సూర్యాపేట, సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పనులను సబ్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న వైనం మీది... ప్రభుత్వ పనులను కాంట్రాక్టు తీసుకున్న గుత్తాదారు మరొకరికి సబ్ కాంట్రాక్టర్ గా అవకాశం కల్పించి లిఫ్ట్ నిర్మాణం పనులను కొనసాగిస్తున్న అధికారులు ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టినట్టు వ్యవహరిస్తున్నారు... కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మాణం చేపట్టిన ఈ ఎత్తిపోతుల పనులు సకాలంలో పూర్తి అవుతాయా... లేదా! అనే సందేహాలు స్థానిక ఆయకట్టు రైతుల నుంచి వినిపిస్తున్నాయి... విషయంలోకి వెళితే... కోదాడ నియోజకవర్గం పరిధిలోని అనంతగిరి మండలం శాంతినగర్ సమీపంలోని పాలేరు వాగుపై రూ 54 కోట్లతో లిఫ్ట్ ... నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే.. కొన్ని సంవత్సరాల క్రితం గతంలో ఇక్కడ లిఫ్ట్ నిర్మాణం జరిగింది.. అయితే గతంలో రెండు పర్యాయాలు పాలేరు వాగుకు.. ఉధృతంగా వరద నీరు రావడంతో ... ఆ ప్రభావంతో లిఫ్టు యంత్ర పరికరాలు మోటార్లు కొట్టుకుపోగా బంద్రు మట్టితో బావి నిండిపోవడం తెలిసిందే.. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ లిఫ్ట్ ఆయకట్టు దారులను దృష్టిలో ఉంచుకొని రైతుల ప్రయోజనం కోసం ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి పేరిట మరో లిఫ్ట్ నిర్మాణం పనులకు ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసి మరమ్మతు పనుల కోసం ఆనాడు అవకాశం కల్పించింది.. ఇదిలా ఉండగా...ఏమైందో ఏమో కానీ... ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్... పేరును... మార్చివేసి... రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఎత్తిపోతల పథకం గా నామకరణం చేయడం వెనుక మతలబు ఏంటో తెలియని పరిస్థితి... నూతనంగా నిర్మాణం కొనసాగిస్తున్న ఈ ఎత్తిపోతల పూర్తికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రూ 54 కోట్ల మొత్తాన్ని కేటాయించింది. పాలేరు వాగుకి మళ్లీ ఒకవేళవరద ఉద్ధ ృతంగా వచ్చినా... ఆ ప్రభావం నూతనంగా నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకంపై పడకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకున్నారు ఇందులో భాగంగా రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ కెపాసిటీ తట్టుకునే విధంగా . ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని.. 260 మీటర్ల దూరాన్ని పొడిగించి... ఈ లిఫ్టు పున నిర్మాణ పనులను.. ప్రారంభించారు. రూ 54 కోట్ల నిధులు కేటాయించి ప్రభుత్వం టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. ఈ ఆన్లైన్ టెండరను హనుమంత రాము అనే కాంట్రాక్టర్ దక్కించుకున్న విషయం విధితమే... ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఈ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం 18 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది.. గత సంవత్సరం 2025 డిసెంబర్ మాసంలో... నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా... సదరు గుత్తేదారు... సబ్ కాంట్రాక్టర్ కు పనులు అప్పజెప్పి నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు... ఈ నిర్మాణ పనులు దాదాపుగా సంవత్సరం కాలం కావస్తున్న పనులు నత్త నడక నడుస్తున్నాయని ఆరోపణలు వినిపిసు న్నాయి...ఇంకా ఆరు నెలల్లో... రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి... కానీ అక్కడ నిర్మాణ పనుల పరిస్థితి చూస్తే... ఆరు నెలల్లో పూర్తి అవుతుందో లేదో... అనే అనుమానాలు స్థానిక రైతుల నుండి వ్యక్తమవుతున్నాయి.. రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తే... సుమారు 5000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఇందులో.. మొగలాయి కోట కిష్టాపురం బొజ్జ గూడెం తండా అనంతగిరి శాంతినగర్ గొండ్రియల కొత్తగూడెం తమ్మరలో కొంత భాగం.. రైతులకు వ్యవసాయానికి సాగునీరు చేరుతుంది.. విషయం ఏమిటంటే... మొదటిగా స్వీకరించిన .. 5000 ఎకరాలు ఆయకట్టుకు... దీంతో పాటు అదనంగా మరికొంత కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుందా ! అనేది ఆకట్టుదారుల కొండంత ఆశతో ఉన్నారు . లిఫ్ట్ వరదకు గొట్టుకుపోయిన నేపథ్యంలో మరమ్మత్తుల కోసం కోసం రూ 5 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత ఈ లిఫ్ట్ పనుల కోసం రెండవసారి రూ 54 కోట్ల నిధులు కేటాయించడం గమనర్హం.

### పాత లిఫ్ట్ సామాగ్రి ఏమైంది...?

పాత లిఫ్ట్ కు సంబంధించిన మోటర్లు యంత్రాల పరికరాలు కరెంటు వైర్లు. ఇతర సామాగ్రి ఏమైందని ప్రశ్న ఎంతో కాలంగా ఆకట్టు దారలను వేధిస్తుంది... అదేవిధంగా గతంలో ఇక్కడ నిర్మించిన సబ్ స్టేషన్ ఆధీనంలో ఉన్న పలు రకాల వస్తువులు సామాగ్రి.. హెవీ గేజ్ గల వైర్లు..ఎవరి పాలయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది ...ప్రభుత్వ సామాగ్రి ఇతర పరికరాలను పక్కదారి పట్టించారా! అనే సందేహాలు స్థానిక రైతాంగం నుంచి వినబడుతున్నాయి..

## నష్టపరిహారంలో అన్యాయం...!



ఈ లిఫ్ట్ నిర్మాణం విషయంలో తనకు చెందిన రెండు ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం వినియోగించుకుందని కానీ దానికి సంబంధించిన నష్టపరిహారం అరకురగా ఇచ్చి చేతులు దులుపుకుందని బాధితురాలు కొత్త మల్లమ్మ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లిఫ్ట్ కు సంబంధించిన బావి రోడ్డు గదుల నిర్మాణం పరికరాలను తన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేయటంతో రెండు ఎకరాల భూమిని తాను కోల్పోవలసి వచ్చిందని బోరుమన్నారు.. మిగిలిన రైతులకు తమ వ్యవసాయ భూమి నుంచి పైపులు మాత్రమే పోయాయని.. వారికి ఇచ్చిన విధంగానే.. నష్టపరిహారం తనకు ఇవ్వటం ఏంటని ప్రశ్నించారు.. దీంతో అసలే తాను తన కూతురు రేణుకకు కట్నం కింద అందజేసిన 30 గుంటల భూమి కోల్పోయి రెండు కుటుంబం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని ఈ విషయాన్ని ఎన్నిసార్లు స్థానిక ఎమ్మెల్యే పద్మావతి.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి రెండు పర్యాయాలు తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని అభివృద్ధి దంపతులు బోరుణ విలపించారు ...బహిరంగ మార్కెట్లో మా ఎకరం భూమి 60 నుండి 70 లక్షల రూపాయలు పలుకుతుందని అయినా రాష్ట్ర ప్రభుత్వం కేవలం 27 లక్షలు నష్టపరిహారం అందజేసి చేతులదులుపుకుందనారు.. దీంతో మా పరిస్థితి అగమ గోచరంగా మారిందని వాపోయారు..

# చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- **రాష్ట్ర ఎస్ సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**నల్లగొండ, సెప్టెంబర్ 25( మనం ప్రతినిధి):** అంబేద్కర్ చెప్పినట్లు విద్యతో ప్రపంచాన్ని జయించవచ్చని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్లో ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.విద్యార్థులు ఐఏఎస్, ఇంజనీర్, డాక్టర్, లాయర్ తదితర రంగాల్లో రాణించి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన దేవరకొండ డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లి మండలం, డింజలాల్ తండా బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో వంట గది, స్టోర్ రూమ్, పరిసరాలను ఆయన తనిఖీ చేశారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కూరగాయలు, వంటనూనె, పండ్లు, గుడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు వాష్రూమ్లు, కాంపౌండ్ వాల్, బోరు అవసరముందని తెలిపారు.సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కలెక్టర్తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అక్టోబర్ 2న గ్రామసభలో తీర్మానం చేసి వీ బిజీ రాంజీ నిధుల కింద పనులకు శంకుస్థాపన చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బోరు కూడా వేయిస్తామని చెప్పారు.విద్యార్థులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూచించినట్లు తరగతి గదిలోనే తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ప్రభుత్వం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నందున విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ తియాన్ మావి, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, ఆర్ సి ఓ శ్రీనివాసరావు, ఏ సి ఎం ఓ వెంకటేశ్ నాయక్ ,ఏ టి డి వెంకటేశ్వర్, ఎంపీడీవో స్వర్ణలత, తహసిల్దార్ నరేందర్, ఎంపీ ఓ సుధీర్ కుమార్, సర్పంచ్ గోజి రతన్లాల్ , ఉపసర్పంచ్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ శారద , ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# జానపహాడ్ ఎత్తిపోతల పథకానికి అనుమతి

- **సవరించిన అంచనాలను ఆమోదం లక్షా 44 వేల 580 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు**
- **నియోజకవర్గ రైతాంగం కల సాకారం**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**పాలక వీడు, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలం జానపహాడ్ గ్రామంలోని జానపహాడ్ లో జవహర్ జానపహాడ్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు అయ్యాయని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా జానపహాడ్ ఎత్తిపోతల పథకంతో పాటు ఆర్-9, ఎన్.ఎస్.ఎల్.బి.సి, హుజుర్నగర్,కోదాడ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పునరుద్ధరణ పనులకు కుడా అనుమతులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. వీటన్నింటి నిర్మాణాలకు గాను నీటిపారుదల శాఖ సవరించిన అంచనాలకు ఈ నెల 4 న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జీ ఓ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాజెక్టల నిర్మాణానికి గాను గతంలో 447 కోట్లతో ప్రణాళికలు రూపొందించగా కాలక్రమంలో పెరిగిన ఆయకట్టుకు అనుగుణంగా ఆ మొత్తం 628.78 కోట్లకు పెరిగిందని తెలిపారు.ఈ మొత్తం ప్రాజెక్టులు పూర్తి అయితే 1,44,580 ఎకరాలకు సమృద్ధిగా సాగు నీరు లభిస్తుందన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది మొదలు సాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించి అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి రూపొందించిన ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు లభించడం సంతృప్తినిచ్చిందని చెప్పుకొచ్చారు.నియోజకవర్గ రైతాంగం కల సాకారం చెయ్యాలి అన్నదే నా పరితపన అని అందుకు తగ్గట్టుగానే పురోగతి సాధించడం ఆనందదాయకంగా ఉందన్నారు వాస్తవానికి 173 కోట్ల అంచనాతో 5,650 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించబడిన జవహర్ జానపహాడ్ ఎత్తిపోతల పథకానికి 2022 లో ప్రణాళికలు రూపొందించమని అయితే ఆయకట్టును 10,000 ఎకరాలకు విస్తరించాలన్న ప్రతిపాదనలు ముందుకు రావడంతో రైతాంగం ఆకాంక్షమేరకు 173 కోట్ల అంచనా వ్యయాన్ని 292.98 కోట్లకు పెంచాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఆ పెరిగిన మొత్తానికి ఆమోదం తెలుపుతూ ఈ నెల 4 న రాష్ట్ర ప్రభుత్వం జీ.ఓ విడుదల చేసినట్లు వెల్లడించారు.మొదలు అనుకున్నట్లుగా జానపహాడ్ బ్రాంచ్ కెనాల్ 19.90 కిలోమీటర్ వద్ద నీటిని ఎత్తిపోతల ద్వారా టెయిల్ ఎండ్ ప్రాంతాల్లో సాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్న జానపహాఫ్, ఆలింగాపురం, బొత్తాలపాలెం,కోమతికుంట,గుండ్లపహాడ్,గుండెబోం ుునగూడెం, మిగడంపాడు తండా, చెరువుతండా, రాజీవ్పురం గ్రామాలకు చెందిన 5,650 ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు ఆరు చిన్ననీటి పారుదల ట్యాన్క్ లకు ప్రయోజనం జరిగేదని వివరించారు.అయితే రైతాంగంనుండి వస్తున్న అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని అదనంగా మరో 4,350 ఎకరాలు కలిపి మొత్తం పదివేల ఎకరాలకు ఈ ఎత్తిపోతల పథకం విస్తరించడంతో అంచనాలను సవరించాల్సి వచ్చిందన్నారు. అదనంగా పెరిగిన 4,350 ఎకరాల ఆయకట్టు పరిధిలో యెల్లాపురం, సజ్జాపురం, పాలకీడు, నాగిరెడ్డిగూడెం, హనుమయ్యాగూడెంలతో పాటు గుడుకుంట్లపాలం లు ఉన్నాయి.వీటితో పాటు మరో 3 చిన్నతరహ నీటిపారుదల ట్యాన్క్ లకు లబ్ది చేకూరనుందని ఆయన తెలిపారు.ఇప్పటికే పంప్ హౌజ్ నిర్మాణంతో పాటు ఫ్రెషర్ మెయిన్ లేవుట్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని 2026 ఖరీఫ్ నాటికి పూర్తి చేసేందుకు గాను యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయన్నారు.అదే విదంగా జవహర్ జానపహాడ్ ఎత్తిపోతల పథకంతో పాటె పాలనపరమైన అనుమతులు పొందిన ఎన్.ఎస్.పి ఎడమ ప్రధాన కాలువ పై ప్రతిపాదించిన ఆర్-9 ఎత్తిపోతల పథకం ద్వారా ప్రస్తుతం 1500 ఎకరాలు ఉండగా అదనంగా మరో 800 ఎకరాల ఆయకట్టును కలిపి మొత్తం 2300 ఎకరాల సాగునీరు అందించేందుకుగాను అనుమతులు పొందనన్నారు. దీని ద్వారా కోదాడ నియోజకవర్గ పరిధిలోని బరఖాత్ గూడెం,కృష్ణానగర్, ఆకు పాముల లతో పాటు రామాపురం,ఇకేపెట్ తండా గ్రామాల రైతాంగానికి సమృద్ధిగా సాగునీరు లభిస్తుందన్నారు. హుజుర్నగర్,కోదాడ నియోజ కవర్గల పరిధిలోని 1,08,000 వేల ఎకరాలకు సాగునీరు అందించే ందుకు ఉద్దేశించ బడిన ముక్త్యాల బ్రాంచ్ ను పునరుద్ధరించడంతో పాటు ఆధునీకరణ చేసేందుకు గాను 222.22 కోట్లకు ప్రభుత్వం ఆమోదించిందని ఆయన తెలిపారు వీటితో పాటె ఎన్.ఎస్.ఎల్.బి సి మెయిన్ కెనాల్ 70.560 నుండి 115.400 కిలోమీటర్ వరకు చేపట్టిన లైనింగ్ తో పాటు ఇతర పునరుద్ధరణ పనులకు 29.02 కోట్లు,హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలో 32,280 ఎకరాలకు ప్రయోజనం చేకూర్చనున్న జానపహాడ్ బ్రాంచ్ కెనాల్ లో మిగిలి పోయిన సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులకు గాను 53.68 కోట్లకు అనుమతులు లభించినట్లు మంత్రి ప్రకటనలో తెలిపారు.

# నీళ్లు తెచ్చే బాధ్యత నాది.. డిండి రైతులు దిగులు పడొద్దు

- **పది రోజుల్లో నీటి విడుదలకు ప్రయత్నాలు ముమ్మరం**
- **ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు చర్యలు**
- **రైతులు అధైర్యపడొద్దు.. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి**
- **నీరు అందిన తర్వాత పొదుపుగా వినియోగించాలి**
- **ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**డిండి, సెప్టెంబర్ 25(మనం న్యూస్):** డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ, ప్రాజెక్టులోకి నీటిని తీసుకురావడానికి అన్ని మార్గాలను అన్వేషిస్తున్నామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. డిండి మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిండి ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి పరిస్థితి, ఆయకట్టు పరిధిలో సాగు విస్తీర్ణం, రైతులకు అవసరమైన నీటి పరిమాణం, ప్రాజెక్టులోకి అదనపు నీటిని తీసుకురా వడానికి ఉన్న అవకాశాలు, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నీటి లభ్యతకు అనుగు ణంగా ఆయ కట్టు చివరి భూముల వరకు కూడా నీరు చేరేలా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించాలని ఆదేశించారు.

### కల్వకుర్తి నీటిపై దృష్టి...

డిండి ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి నీటిని డిండి ప్రాజెక్టులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ వెల్లడించారు. ఇందుకోసం సంబంధిత ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో డిండి ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. రైతుల పరిస్థితి నాకు పూర్తిగా తెలుసు. అందుకే ప్రాజెక్టులోకి నీటిని తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నాం. కల్వకుర్తి నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తీసుకురావడానికి సంబంధిత వారితో ఇప్పటికే చర్చలు జరిపాను. అవసరమైన సమన్వయాన్ని కొనసాగిస్తున్నాం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### పది రోజుల్లో నీరు తీసుకొచ్చేందుకు కృషి

డిండి ప్రాజెక్టులోకి త్వరితగతిన నీటిని తీసుకురావడమే ప్రస్తుతం తన ప్రధాన ప్రాధాన్యత అని బాలు నాయక్ అన్నారు. పది రోజుల్లోగా నీటి విడుదలకు అవసరమైన చర్యలు పూర్తి చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డిండి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడమే నా లక్ష్యం. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్చలు జరుపుతున్నాను. నీటిని తీసుకురావడానికి ఎక్కడ అవసరమైతే అక్కడ సమన్వయం చేస్తాను అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

### రైతుల్లో ఆందోళనకు తావివ్వొద్దు..

డిండి ప్రాజెక్టులోకి నీరు రాదని, ఆయకట్టు రైతులకు సాగునీరు అందదని కొందరు చేస్తున్న ప్రచారాన్ని రైతులు విశ్వసించవద్దని ఎమ్మెల్యే సూచించారు. నీటి లభ్యత, విడుదలకు సంబంధించిన అంశాలపై అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఇతర వేదికల్లో వచ్చే నిర్ధారణ లేని సమాచారాన్ని చూసి రైతులు ఆందోళనకు గురికావద్దని కోరారు. ప్రాజెక్టుకు నీటిని తీసుకురా వడానికి జరుగుతున్న ప్రయత్నాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని చెప్పారు.

### ప్రతి ఎకరాకు నీరు చేరేలా చర్యలు....

డిండి ఆయకట్టు పరిధిలోని రైతులందరికీ సమానంగా సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ప్రాజెక్టులోకి నీరు చేరిన అనంతరం అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని దృష్టిలో పెట్టుకుని పంటలకు అవసరమైన మేరకు నీటిని విడుదల చేయాలని అన్నారు. ఆయకట్టులో చివరి ప్రాంతాల్లోని రైతులకు కూడా నీరు అందేలా పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. నీటి వినియోగంలో ఎక్కడా వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు డిండి మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, డిండి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల శశిధర్రెడ్డి,తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చదువు శక్తివంతమైంది




- **చదువుకున్న పాఠశాలకు చేయూత**
- **ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి వైఆర్పీ ఫౌండేషన్ అధినేత రవిప్రసాద్ చేయూత**
- **మరుగుదొడ్ల నిర్మాణానికి హామీ**

**నల్లగొండ, సెప్టెంబర్ 25( మనం ప్రతినిధి):** తాను చదువుకున్న రామగిరి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని పూర్వ విద్యార్థిగా తన బాధ్యతగా భావిస్తున్నానని రవిప్రసాద్ తెలిపారు. పాఠశాల అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే తన సొంత నిధులతో రూ.1,50,000/- విరాళం అందించి పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరించారు.అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వైఆర్పీ ఫౌండేషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని రవిప్రసాద్ ప్రకటించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.చదువు శక్తివంతమైనదని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వైఆర్పీ ఫౌండేషన్ ఛైర్మన్ ఏలిశాల రవిప్రసాద్ అన్నారు. తాను చదువుకున్న నల్గొండ పట్టణంలోని రామగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పూర్వ విద్యార్థిగా ఆయన సందర్శించారు. పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వారికి మరియు పాఠశాలకు అవసరమైన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవిప్రసాద్ మాట్లాడుతూ, చదువుకున్న బడిని, చదువు చెప్పిన గురువులను ఎప్పటికీ మరవకూడదు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు మన జీవితానికి దిశానిర్దేశం చేస్తాయి అన్నారు. విద్యార్థులతో మాట్లాడుతున్న సమయంలో తన బాల్యాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురైన ఆయన, పుస్తకాలలోని పాఠాలతో పాటు జీవితంలో ఎలా స్థిరపడాలో కూడా తన ఉపాధ్యాయుల నుంచే నేర్చుకున్నానని తెలిపారు. ఆ ప్రోత్సాహమే తన జీవితంలో ముందుకు సాగేందుకు ఎంతో దోహదపడిందన్నారు. పాఠశాల కేవలం చదువు నేర్చుకునే ప్రదేశం మాత్రమే కాదని, భిన్నత్వంలో ఏకత్వం, సమానత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను నేర్పే వేదిక అని రవిప్రసాద్ అన్నారు. వ్యాపార రంగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ పాఠశాలలు, విద్యార్థుల చదువులు, వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తూనే ఉంటానని తెలిపారు. పేద విద్యార్థులు 1వ తరగతి నుంచి ఎంబీబీఎస్ వరకు చదువుకునేందుకు తమ వైఆర్పీ ఫౌండేషన్ ద్వారా ఫీజు సహాయం అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలల అభివపేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహాయం చేస్తున్న రవిప్రసాద్ సేవా దృక్పథాన్ని అభినందించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యామా కవిత దయాకర్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, అల్లి సుభాష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, అడ్వకేట్ జిల్లేపల్లి రాఘవ, గుత్తా రవీందర్, గార్లపాటి పురుషోత్తం, వైఆర్పీ ఫౌండేషన్ టీం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.పాఠశాల అభివృద్ధికి అందించిన సహకారానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది ఏలిశాల రవిప్రసాద్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



**జనగామ, సెప్టెంబర్ 25(మనం ప్రతినిధి):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 26న జనగామ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం, బస్టాండ్ ఎదురుగా గల ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్ లో చేపట్టుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో పైలాన్ల ఏర్పాటు, ఆటోల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సభా ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రపరచాలని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని 12 మండలాలకు 12 ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, తగిన సంఖ్యలో కుర్చీలు, బారికేడ్లు, తాగునీటి వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు ప్రభుత్వ ప్రోటోకాల్ కు అనుగుణంగా ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాకతీయుల శిల్పకళా వైభవం

- ప్రకృతి వర్ణశోభకు నిలయంగా ములుగు జిల్లా
- విశ్వవేదికపై విరాజిల్లుతున్న ప్రపంచ వారసత్వ రామప్ప దేవాలయం
- చారిత్రక, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలి
- మంత్రి దనసరి సీతక్క




**ములుగు, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి:** కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ప్రకృతి వర్ణశోభకు ములుగు జిల్లా నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో వరల్ టూరిజం డే-2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్స్, తెలంగాణ దర్శిని, కాంపిటీషన్స్, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 వరల్ టూరిజం డేను డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం అనే థీమ్తో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారధి కళాకారుల బృందం గేయాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శతాబ్దాలుగా తరతరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన ములుగు జిల్లాలో పచ్చని అడవులు, అందమైన చెట్లు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులతో అపారమైన ప్రకృతి సంపద ఉందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పూర్వీకులు అందించిన వారసత్వంగానే కాకుండా భావితరాలకు తిరిగి అందించాల్సిన విలువైన ఆస్తిగా భావించాలని మంత్రి సూచించారు. పర్యావరణం, చరిత్ర పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాంపిటీషన్స్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చల్వాయి టీజీఎంఎస్కు చెందిన డి. శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్. శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. మనస్విని, ఎ. శ్రుతి, ఎం. పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె. దిలీప్ రన్నరప్గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు గుడ్‌బై...



- కాంగ్రెస్‌లోకి అనిశెట్టి రామకృష్ణ

**గోవిందరావుపేట, సెప్టెంబర్ 25 (మనం ప్రతినిధి):** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పసర గ్రామానికి చెందిన రైస్మిల్లు యజమాని అనిశెట్టి రామకృష్ణ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా అనిశెట్టి రామకృష్ణకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీతో కలిసి ముందుకు వస్తున్నారని నాయకులు తెలిపారు. ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీకి ప్రజల మద్దతును కూడగడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో అనిశెట్టి రామకృష్ణ కాంగ్రెస్లో చేరడం పార్టీకి మరింత బలం చేకూర్చిందని నాయకులు పేర్కొన్నారు.

మంత్రి సీతక్క నాయకత్వం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ మార్గదర్శకత్వంలో ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు అన్నారు. కాంగ్రెస్ కుటుంబంలోకి వచ్చిన అనిశెట్టి రామకృష్ణకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, ములుగు జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కాసర్ల రాంబాబు, గుండెబోయిన అనిల్ యాదవ్, కాడబోయిన రవి, దేపాక కృష్ణ, గొంది కిరణ్, తొడుసు కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన అశోక్



**ములుగు, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భట్టు కరుణాకర్ కుమార్తె నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ శుక్రవారం హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్రెడ్డి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్రెడ్డి, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, జిల్లా సీనియర్ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లాలో ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు



**భూపాలపల్లి, సెప్టెంబర్ 25(మనంన్యూస్):** జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఆదేశాల అనుగుణంగా, శుక్రవారం నాడు స్థానిక సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో భూపాలపల్లి జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ అండర్-14, 17 సంవత్సరాల బాలబాలికల కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీల నిర్వహణపై పీఈటీ, పీడీ ఉపాధ్యాయుల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్ణయించిన షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి: 28/09/2026 (సోమవారం): అండర్-14 బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించబడును. 29/09/2026 (మంగళవారం): అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించబడును. ఈ సమావేశంలో క్రీడలకు సంబంధించిన వివిధ ఇన్చార్జ్లను కేటాయించడం జరిగిందని ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎల్. జైపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీవైఎస్ఓ సి.హెచ్. రఘు, పేటా సంఘం అధ్యక్షుడు ఎస్. రమేష్, సీనియర్ పీడీ టి. రాజయ్య,జిల్లాలోని పీఈటీ, పీడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మన్‌కీ బాత్ మండల కన్వీనర్‌గా క్రాంతికుమార్



**నల్లబెల్లి, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి:** నల్లబెల్లి మండలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యతను ధర్మారం క్రాంతికుమార్కు అప్పగించినట్లు బీజేపీ నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు క్రాంతికుమార్ను మండల 'మన్ కీ బాత్' కన్వీనర్గా నియమించినట్లు వెల్లడించారు. ప్రతి నెల నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని మండలంలోని అన్ని బూత్లలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో నిర్వహిస్తూ, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, దేశ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించడంలో 'మన్ కీ బాత్' వేదికగా ఉపయోగపడుతుందని వినయ్ గౌడ్ పేర్కొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ధర్మారం క్రాంతికుమార్కు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుంది



- మంత్రి దనసరి సీతక్క

**వెంకటాపురం, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి:** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్య ఇస్తూ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

శుక్రవారం వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 2025-26 సీఆర్ఆర్ నిధులు రూ.1 కోటి 80 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీదేవిపేట గ్రామంలో 2025-26 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 2025-26 ఎస్సీ ఎస్డీఎఫ్ నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయంతో, సీఆర్ఆర్ ప్లెయిన్ నిధులు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం..

- ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దాలి
- ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
- మంత్రి దనసరిసీతక్క



**ములుగు, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి:** పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. శుక్రవారం మల్లంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో మంత్రి అనసూయ సీతక్క, రూరల్ డెవలమెంట్ ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి ఐ ఫ ఎస్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. 'స్వచ్ఛత హి సేవ' పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నిత్యం గ్రామాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, గ్లౌజులతో కూడిన పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ అడవులు, పచ్చదనం కారణంగానే ములుగు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ప్రకృతే మానవాళికి, జీవరాశులకు జీవనాధారమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ను పూర్తిగా దూరం చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతను పాటిద్దాం.. పచ్చదనాన్ని పెంచుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందామని మంత్రి పేర్కొన్నారు. 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజలంతా శ్రమదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు. శారీరక శ్రమతోనే ఆరోగ్యంగా, దృఢంగా ఉండగలమని తెలిపారు. ఎండ, వాన, చలిని తట్టుకుంటూ కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్ బాబు,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి పి ఓ వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, యం పి ఓ రహీం, ఏ పి డి, స్వచ్ఛ భారత్ మిషన్ డిస్టిక్ కో ఆర్డినేటర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి ఎంటర్‌ప్రైజెస్‌లో అగ్నిప్రమాదం 2 కోట్ల ఆస్తి నష్టం




**హనుమకొండ, సెప్టెంబర్ 25(మనంన్యూస్):** హనుమకొండ జిల్లా వడ్డేపల్లి జవహర్ నగర్ క్రాస్ లోని భద్ర నాయక్ చెందిన సరస్వతి ఎంటప్రైజెస్ టైల్స్ అండ్ మార్బుల్ మరియు గృహానికి సంబంధించిన వస్తువులు షాప్ లో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో షాపులోనే టైల్స్, మార్బుల్, ఇతర సామాగ్రి మొత్తం కాలి బూడిదైంది సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలాన్ని చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు అయితే అప్పటికే షాపులోని సామాగ్రి పూర్తి గా దగ్గమైనట్టు తెలిసింది. ఈ ప్రమాదంలో సుమారు 2 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు భద్ర నాయక్ వ్యాపార సంస్థ కళ్ళముందే కాలిపోవడంతో భద్ర నాయక్ కుటుంబం సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు గత పది సంవత్సరాల నుండి కష్టపడి నిర్మించుకున్న వ్యాపారం అగ్నిమాపకంతో కుటుంబం తీవ్ర నష్టపోయిందని ఆవేదనపు గురయ్యారు సమాచారం అందుకున్న అఖిల భారత బంజారా సేవా సంఘం నాయకులు మరియు బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ వివిధ సంఘాల నాయకులు నష్టపోయిన భద్ర నాయక్ కుటుంబానికి నష్టపరిహారం ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ మేరకు శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేసినట్లుగా సంఘం నాయకులు తెలిపారు నష్టపోయిన భద్ర నాయక్ కుటుంబానికి తప్పకుండా ప్రభుత్వం నుండి ఆస్తి నష్టం గా రెండు కోట్ల రూపాయలను అందించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం నిర్వహణ

- చైర్‌పర్సన్ ముత్యాల కుమారస్వామి గౌడ్

**దుగ్గొండి, సెప్టెంబర్ 25 మనం ప్రతినిధి:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) ఆధ్వర్యంలో రైతాంగ సంక్షేమానికి, వ్యవసాయ రంగాభివృద్ధికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని సొసైటీ చైర్పర్సన్, రిటైర్డ్ ఏఎస్ఐ ముత్యాల కుమారస్వామి గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం దుగ్గొండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సంఘం అర్ధ వార్షిక మహాజన సభ సమావేశం చైర్పర్సన్ ముత్యాల కుమారస్వామి అధ్యక్షతన అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ కుమారస్వామి మాట్లాడుతూ.. రైతన్నలకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులను వేళకు అందిస్తూ సంఘాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సొసైటీ ద్వారా అందుతున్న వివిధ రకాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ మహాజన సభలో సొసైటీ డైరెక్టర్లు కోరికల ప్రశాంత్, జంగిలి రవి,తొర్రూరు రామన్న, కొలగని రవి, నాగుర్ల సునీత, పిండి అశోక్, భూతం కుమారస్వామి, మామిడిపెల్లి భాగ్య, మానుపాటి సారమ్మ, రైతులు శంకేశి రమేష్, శంకేశి రాజకుమార్, అపరాధపు కుమారస్వామి, కొమ్మ లక్ష్మయ్య, గైని భాస్కర్ సొసైటీ ముఖ్య నిర్వహణ అధికారి ఆరెల్లి బుచ్చయ్య గౌడ్, సిబ్బంది,పలువురు రైతులు పాల్గొన్నారు.




# రవీందర్ రావును పరామర్శించిన ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షులు



**మంథని, సెప్టెంబర్23(మనం న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా,ప్రస్తుత హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన ఓసీ జేఏసీ మండల నాయకులు నాయినేని రవీందర్ రావు సతీమణి రజిత గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం పోలాడి రామారావు నాయకులతో కలిసి ఉప్పల్ గ్రామంలో వారి నివాసంలో మృతురాలు రజిత పార్థీవ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలు భర్త రవీందర్ రావును వారి కుటుంబ సభ్యులను పోలాడి రామారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఓసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందుపట్ల నర్సింహారెడ్డి,మండల ఓసీ జేఏసీ అధ్యక్షులు కొనిశెట్టి మునీందర్, హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ వర్థినేని రవీందర్ రావు,బీ.ఆర్.ఎస్ నియోజకవర్గ ఇంచార్జి నాయినేని తిరుపతిరావు,సర్పంచులు వాల ప్రదీప్ రావు,పోలాడి శ్రీరంగారావు, కమలాపూర్ మండల ఎంపీటీసీల ఫోరమ్ మాజీ అధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు,ఉప్పల్ మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్ రావు,పోలాడి యాదగిరి రావు, అన్నమనేని శ్రీనివాస్ రావు, తక్కళ్లపెల్లి దేవేందర్ రావు,పోలాడి రాంగోపాల్ రావు పలువురు సర్పంచులు,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,అధిక సంఖ్యలో ప్రజలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## ఏటూరునాగారంలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

**ఏటూరనాగారం,సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి:** రాష్ట్రంలో 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్క్లాస్ కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు. ఈ మేరకు మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏటూరునాగారం మారుమూల, గిరిజన ప్రాంతాలకు కేంద్రంగా ఉందని, ఇక్కడి ప్రజలు న్యాయపరమైన వ్యవహారాల కోసం ఇతర ప్రాంతాల్లోని కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ప్రయాణ ఖర్చులు, సమయం, రవాణా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు చేస్తే తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. 'న్యాయం ప్రజల వద్దకు' అనే స్ఫూర్తితో ప్రభుత్వం ఈ ప్రాంతానికి న్యాయస్థానం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని శ్రీలత కోరారు.



# గ్రామాభివృద్ధికి సర్పంచ్ కృషి అభినందనీయం



**ములుగు, సెప్టెంబర్25, మనం ప్రతినిధి:** జంగాలపల్లి-కాశిందేవిపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్న సర్పంచ్ పి. నిరోషా అమర్సింగ్, ఉపసర్పంచ్ సుదర్శన్, పంచాయతీ పాలకవర్గాన్ని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు అభినందించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సన్మానం అనంతరం సర్పంచ్ నిరోషా అమర్సింగ్ మాట్లాడుతూ తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి మరింత శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వినయ్కుమార్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్.. ఫైనల్‌కు ‘గోదావరి’



గోదావరి గోల్డెన్ ఈగల్స్ అద్భుతం చేసింది. మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఫైనల్‌కు చేరుకుంది. కీలకమైన మ్యాచ్‌లో వైజాగ్ ఫైర్ బర్డ్స్‌పై విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. గత రెండు రోజులు వర్షాల కారణంగా మ్యాచులు రద్దైన సంగతి తెలిసిందే. వైజాగ్ ఫైర్ బర్డ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో గోదావరి విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. పుష్పిత గౌడ (91లి) అదరగొట్టింది. ఫ్లావియా పెరీరా (34లి), బాతుల హర్షిత (21) మెరిశారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన వైజాగ్ 129 పరుగులకే పరిమితమైంది. విష్ణు వర్ధిని (23లి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. సష్టి శేఖర్ (2/25) మరోసారి నాణ్యమైన బౌలింగ్ వేసింది.

# భారత్‌కు రెండో గోల్డ్ మెడల్



ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశపర్చినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో మన దేశానికి రెండో పసిడి పతకం లభించింది. అంతకుముందు మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ఇక, దక్షిణకొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి.ఇక, పురుషుల 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రజతం సాధించింది. ఫైనల్‌లో మన షూటర్లు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, రుద్రాంశ్ పాటిల్, నీరజ్ కుమార్ మొత్తంగా 1762 పాయింట్లు సాధించారు. 1766 పాయింట్లతో చైనా టీమ్ స్వర్ణం నెగ్గింది. కేవలం నాలుగు పాయింట్ల తేడాతో మన జట్టుకు త్రుటిలో పసిడి చేజారింది. మరోవైపు స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో జోష్న చిన్నప్ప, సెంథిల్ కుమార్ పతకం ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఫిలిప్పీన్స్ జోడీ డేవిడ్ పెలినో-జెమైకా అరిబాడోను 11-3, 11-5తో ఓడించి మన ఆటగాళ్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. దీంతో కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. అటు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత ద్వయం మనుష్ షా, దియా చితాలే కూడా పతకం ఖాయం చేసుకున్నారు. క్వార్టర్స్‌లో వీరు హాంకాంగ్ జోడీని 11-6, 13-15, 11-9, 11-5తో ఓడించారు.

# 26 ఏళ్లకే స్టార్ హీరోకు అమ్మగా నటించి.. ‘ప్యారడైజ్’ సమ్మక్క ప్రయాణమిది

ఒకప్పుడు హీరోయిన్‌గా కనిపించిన నటి.. ఆ తర్వాత తల్లిగా చేయడం సహజమే. కానీ కెరీర్ ఆరంభంలోనే స్టార్ హీరోలకు తల్లిగా నటించి.. ఆ తర్వాత హీరోయిన్‌గా, కీలక పాత్రల్లో కొనసాగడం మాత్రం అరుదు. అలాంటి ప్రత్యేకమైన ప్రయాణం సొనాలీ కులకర్ణిది . తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘ది ప్యారడైజ్’లో నానికి అమ్మగా నటించి అందరి దష్టిని ఆకర్షించింది. సమ్మక్క మెప్పించిన ఆమె గురించి తెలుసుకుందాం..



## హతిక్‌కు తల్లిగా..

సొనాలీ కులకర్ణి 1992లో సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. 2000లో వచ్చిన ‘మిషన్ కశ్మీర్’ ఆమె కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రం. ఇందులో హతిక్ రోషన్ (శీఅష్ట్రఱఅ =శీష్ట్రఱఅ)కు తల్లిగా కనిపించారు. 26 ఏళ్ల వయసులోనే స్టార్ హీరోకు అమ్మగా నటించడం వల్ల తన కెరీర్ అక్కడితో ఆగిపోలేదు. ఆ తర్వాత ‘దిల్ చాహతా హై’ లాంటి పెద్ద చిత్రంలో హీరోయిన్‌గా సంతకం చేశారు. సైఫ్ అలీఖాన్‌కు జోడీగా కనిపించారు. అదే ఏడాది ‘ప్యార్ తూనే క్యా కియా’లోనూ హీరోయిన్‌గా నటించారు. ఓవైపు తల్లిగా చేస్తూనే.. హీరోయిన్‌గా కూడా తన కెరీర్‌ను కొనసాగించారు.

## సల్మాన్‌కు అమ్మగా.. ఆలోచించి ఓకే చెప్పి..

2019లో వచ్చిన ‘భారత్’లో సల్మాన్ ఖాన్‌కు అమ్మగా సొనాలి నటించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. కారణం.. సల్మాన్ (ాశ్రీఎఅ ఖష్ట్రఅ) కంటే సొనాలి తొమ్మిదేళ్లు చిన్నవారు. ఈ చిత్రంలో నటించడానికి మొదట తాను ఆలోచించినట్లు వెల్లడించారు. అయితే దర్శకుడు ఆమెను ఒప్పించడంతో ఓకే చెప్పారు. సినిమాకు కీలకపాత్ర కావడంతో సొనాలి ఆ పాత్రను సవాల్‌గా స్వీకరించారు.

## ఇప్పుడు నానికి తల్లిగా..

ఇప్పుడు ‘ది ప్యారడైజ్’లో (ఙష్ట్రవ ూaతీaసఱంవ) నాని తల్లి సమ్మక్కగా సొనాలి కనిపించారు. ఈ పాత్ర.. సినిమాకే హైలైట్ అయ్యింది. సినిమాలో సమ్మక్క ఎదుర్కొన్న పరిస్థితులు ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేశాయి.

## హీరోయిన్ తల్లిగా నటిస్తే..

తల్లి పాత్రల విషయంలో సమాజం, ప్రేక్షకుల ఆలోచనా విధానంపై సొనాలి గతంలోనే మాట్లాడారు. ‘‘పురుష నటులు విభిన్న పాత్రలు చేయడాన్ని ప్రేక్షకులు సులభంగా అంగీకరిస్తారు. కానీ, ఒక హీరోయిన్ తల్లి పాత్రలో కనిపిస్తే మాత్రం వెంటనే చర్చ మొదలవుతుంది. తొలినాళ్లలో ఈ ఆలోచనా విధానంతో నేను కూడా పోరాడాను’’ అని చెప్పారు. మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న సొనాలీ కులకర్ణి సినీ ప్రయాణంలో ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. చైత్ర (2002) అనే మరాఠీ లఘు చిత్రంలో ఉత్తమ నటనకు గాను నేషనల్ ఫిల్మ్ అవార్డు (స్పెషల్ మెన్షన్) సాధించారు. సొనాలీ నటించిన ‘ది గుడ్‌రోడ్’ (2013).. 86వ ఆస్కార్ అవార్డులకు భారతదేశం తరఫున అధికారిక ఎంట్రీగా ఎంపికైన మొదటి గుజరాతీ చిత్రంగా రికార్డు సాధించింది.

# ఐసీసీ ట్రోఫీలు సొంతం కావాలంటే.. భారత్‌పై గెలవాలి: డారెన్ సామీ



మూడు వన్డేలు, ఐదు టీ20లను ఆడేందుకు భారత పర్యటనకు వెస్టిండీస్ (చీణ జంబె) వచ్చింది. ఆదివారం నుంచి వన్డే సిరీస్ మొదలు కానుంది. ఇక్కడ టీమ్‌ఇండియాపై దాదాపు 24 ఏళ్ల నుంచి విండీస్ జట్టు సిరీస్‌ను గెలవలేదు. ఐసీసీ కప్పులను తమ జట్టు గెలవాలంటే.. కచ్చితంగా భారత్‌లాంటి బలమైన టీమ్‌ను అడ్డుకోవాల్సి ఉందని వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌ను తాము వరల్డ్ కప్ అర్హతకు సన్నాహకంగా మార్చుకుంటామని వెల్లడించాడు. ‘‘గత 24 ఏళ్లుగా మాకు భారత్ వేదికగా (ఔవర్అఱఅవం౧శీతీ అఱ) సిరీస్ దక్కలేదు. ఈసారి గెలిచేందుకు మంచి అవకాశం. మమ్మల్ని మేం సవాల్ చేసుకొని అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాం. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఐసీసీ ఈవెంట్లలో గెలవాలంటే.. ముందు భారత్ వంటి పెద్ద జట్లను అడ్డుకొనేలా ఆటతీరు ఉండాలి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో క్వాలిఫయర్స్ ఉంటాయి. దక్షిణాఫ్రికా వేదికగా జరగబోయే వరల్డ్ కప్‌లో మేం ఆడేందుకు అర్హత సాధిస్తామనే నమ్మకం ఉంది. ఇప్పుడీ సిరీస్‌ను అందుకు సన్నాహకంగా భావిస్తాం’’ అని సామీ తెలిపాడు.

**మా జట్టులో:** ‘‘ప్రస్తుతం మేం బరిలోకి దిగే జట్టులో నాణ్యమైన ప్లేయర్లే ఉన్నారు. ఒకరిద్దరిపైనే మేం ఆధారపడం. మా స్థాయికి తగ్గట్టు ఆడితే ఈపాటికే మేం నేరుగా వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించేవాళ్లం. కానీ, ఆరు పాయిట్ల తేడాతో మిస్ చేసుకున్నాం. ఇప్పుడు వన్డే క్రికెట్‌లో మెరుగైన పురోగతి సాధించాం. ఇప్పుడు భారత్‌తో సిరీస్‌లో ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. 19 ఏళ్ల కుర్రాడు విటెల్‌లో అద్భుతమైన టాలెంట్ ఉంది. మాకు మోతీ రూపంలో ఓ అద్భుతమైన రిస్ట్ స్పిన్నర్ ఉన్నాడు. గత కొన్నేళ్లుగా అతడి గురించి వినే ఉంటారు. ఇప్పుడు విటెల్ కూడా ఆరంభంలో జట్టు విజయాల్లో ప్రభావం చూపించడం అభినందనీయం. జట్టుగా మేం చేయాల్సింది చాలా ఉంది. అతడికి మద్దతుగా నిలుస్తాం’’ అని సామీ (ణతీతీవఅ ూaఎఎ) పేర్కొన్నాడు.

## ‘పార్కింగ్’ దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా..

# పూజా కార్యక్రమాలతో లాంఛ్!




కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా ‘ఎస్కే27’ అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘పార్కింగ్’ చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదల య్యాయి.
ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం.
శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ ‘ఎస్కే27’ షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు.



# అందుకే యాక్షన్ కథలంటే ఆసక్తి

‘‘ఒక సినిమాతో అన్నిరకాల భావోద్వేగాలు ప్రదర్శించే అవకాశం చాలా తక్కువసార్లు వస్తుంటుంది. అలాంటి ఓ అరుదైన పాత్ర ‘సిగ్మా’తో నాకు దక్కింది’’ అన్నారు ఫరియా అబ్దుల్లా. ఆమె కథానాయికగా నటించిన చిత్రమే ‘సిగ్మా’. సందీప్‌కిషన్ కథానాయకుడు. జాసన్ సంజయ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఫరియా మాట్లాడుతూ ‘‘ఇందులో నేను రేడియో జాకీ సామ్‌గా కనిపిస్తా. చాలా మంచి పాత్ర. తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు, దర్శకుడు జాసన్‌కి దర్శకత్వంపై మంచి పట్టుంది.

తమిళ ప్రేక్షకులు ఆయనపైనా, సందీప్‌కిషన్‌పైనా ఎంతో ప్రేమని కురిపిస్తుంటారు. ఆ ప్రేమ నాకూ కలిసొచ్చింది. ఆహారపు అలవాట్లు తప్ప తెలుగు, తమిళ పరిశ్రమల మధ్య నాకు వ్యత్యాసమేమీ కనిపించలేదు. నాకు అన్నిరకాల కథలూ చేయాలని ఉంటుంది. కాకపోతే నా వ్యక్తిత్వానికి యాక్షన్ బాగా నప్పుతుంది. అందుకే యాక్షన్ ప్రధానమైన కథల్లో నటించడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతుంటా. నేనే కొన్ని కథల్నీ రాసుకుంటున్నా, దర్శకత్వంపై ఆసక్తి ఉంది. నేను దర్శకత్వం వహించే సినిమాలో నేనూ తప్పకుండా నటిస్తా’’ అని చెప్పారు.

# మీ ప్రేమతో పాటు ట్రోల్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా

## ‘ది ప్యారడైజ్’ సక్సెస్‌పై నాని ఎమోషనల్ పోస్ట్!

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ‘ది ప్యారడైజ్’ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయంతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో సినిమా విజయంపై, అలాగే సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌పై హీరో నాని స్వయంగా స్పందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ నోట్‌ను షేర్ చేశారు. సినిమా చూసిన ప్రేక్షకుల స్పందనలు, రియాక్షన్స్ అన్నీ తాను చూశానని నాని తెలిపారు. ప్రేక్షకులు చూపించిన ప్రేమాభిమానాలతో పాటు, వారు చేసిన నవ్వులు పూయించే హిలేరియస్ ట్రోల్స్‌ను కూడా తాను ఎంతో ఆస్వాదించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు తమ సొంత చిత్రంగా ఓన్ చేసుకున్న తీరు తన మనసును తాకిందని, అలాగే క్రిటిక్స్ మరియు రివ్యూయర్స్ ఎత్తిచూపిన తప్పుల నుంచి తాను చాలా విషయాలు నేర్చుకున్నానని నాని నిజాయితీగా అంగీకరించారు.అన్నింటికీ ధన్యవాదాలు చెప్పడం ఒక్కటే నేను చేయగలిగిన పని. ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని పంచడం కోసం మేము ఎంతో కష్టపడి, చెమటోడ్చి ‘ది ప్యారడైజ్’ చిత్రాన్ని తెరకెక్కించాము. ఇప్పుడు ఈ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడమో లేదా విమర్శించడమో పూర్తిగా మీ చేతుల్లోనే ఉంది. ఈ సినిమాపై మీరు చూపిన ఉత్సాహం, నాపై చూపిన ప్రేమ నన్ను కతజ్ఞతాభావంతో నింపేశాయి అంటూ నాని తన భావాలను పంచుకున్నారు. ప్రస్తుతం నాని చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.